ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 27.06.2025 | సంపుటి :11 సంచిక : 339 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV



## 'జూరాల'కు డేంజర్‌బెల్స్

- తెగిన ప్రాజెక్ట్ రోప్‌వే..
- నీటి విడుదల సమయంలో డ్యామ్ 9వ గేటు వద్ద చోటుచేసుకున్న ఘటన
- అత్యంత బలహీన స్థితిలో 12వ, 16వ గేట్లు
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం: కేటీఆర్

జోగులాంబ గద్వాల (జనంసాక్షి): పొరుగు రాష్ట్రాలలో కురుస్తున్న కుంభవృష్టి వల్ల కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఈ జల ప్రవాహం జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు పోటెత్తడంతో.. జలాశయం నిండుకుండలా మారింది. నీటిని దిగువకు మిగతా 2లో..



## తెలంగాణలో 3 రోజులపాటు వర్షాలు

- ఉపరితల ఆవర్తనం ప్రభావంతో భారీ వానలు
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ ..

హైదరాబాద్(జనంసాక్షి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలే మిగతా 2లో..



## ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు శుభవార్త

- రూ.180.38 కోట్ల మెడికల్ పెండింగ్ బిల్లులు విడుదల
- దాదాపు 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ ఊరట లభించింది. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌గా ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం క్లియర్ చేసింది. మొత్తంగా రూ.180.38 కోట్ల బిల్లులు విడుదల మిగతా 2లో..

## ఉద్యమాల గడ్డ మనది..
# డ్రగ్స్‌కు అడ్డా కావొద్దు

### మాదక ద్రవ్యాలు లేని సమాజం కోసం కృషి చేస్తాం: సీఎం రేవంత్

- స్కూల్స్,కాలేజీల్లో డ్రగ్స్ దొరికితే యాజమాన్యాలదే బాధ్యత
- ఫీజులు వసూళ్లే కాదు..పిల్లల నడవడిని కట్టడి చేయాల్సిందే
- అవసరమైతే సైకాలజీ ప్రొఫెషనల్స్‌ను నియమించుకోవాలి
- మాదకద్రవ్యాలను అరికట్టే సందర్భంలో కఠిన చర్యలు తప్పవు
- యువతను ఆరోగ్యంగా ఉజ్వల భవిష్యత్తుదిశగా నడిపించాలి
- డ్రగ్ ఫ్రీ తెలంగాణ సంకల్పానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి
- డ్రగ్స్ వ్యతిరేక సదస్సులో పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి

హైదరాబాద్(జనంసాక్షి): మాదక ద్రవ్య రహిత సురక్షితమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యువతను ఆరోగ్యకరమైన ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించడమే లక్ష్యంగా కలిసి పని చేద్దామని అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ సంకల్పానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. మిగతా 2లో..




అంతర్జాతీయ యాంటీ డ్రగ్, ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే అవగాహన కార్యక్రమంలో శిల్పకళా వేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నటులు రామ్‌చరణ్ విజయ్‌దేవరకొండ తదితరులు..

### పాఠశాల విద్యార్థుల వరకూ చేరుతున్న డ్రగ్స్

చాక్లెట్లు, బిస్కట్ల రూపంలో సరఫరా

మంత్రి సీతక్క ఆందోళన 2లో



## దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైనది

### పార్లమెంట్ ఎప్పటికీ సుప్రీం కాదు

సీజేఐ బిఆర్ గవాయ్ వ్యాఖ్య


ముంబై(జనంసాక్షి): భారత్‌లో రాజ్యాంగమే అత్యున్నతమైందని.. ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలు దాని కిందే పనిచేస్తాయని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. అందరూ అనుకుంటున్నట్లు లేదా భావిస్తున్నట్లు పార్లమెంట్ సుప్రీం కాదన్నారు. ప్రజాస్వామ్యం ఛత్రం కింద పార్లమెంట్ ఒకటని అభిప్రాయపడ్డారు. బేసిక్ స్ట్రక్చర్ డాక్ట్రిన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంట్‌కు అధికారాలు ఉన్నాయి. కానీ, రాజ్యాంగం ప్రాథమిక రూపాన్ని మిగతా 2లో..

# డాకింగ్ సక్సెస్


### అంతరిక్ష కేంద్రంలో విజయవంతంగా అడుగుపెట్టిన వ్యోమగామి శుభాంశు శుక్లా టీం




వాషింగ్టన్(జనంసాక్షి): అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి భారత్ మరో ఘనతను సాధించింది. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సహా నలుగురు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి అడుగుపెట్టారు. డాకింగ్ (ఐఎస్ఎస్‌తో వ్యోమనౌక అనుసంధానం) ప్రక్రియ విజయవంతమైంది. దీంతో ఐఎస్ఎస్‌లో ప్రవేశించే ప్రక్రియ కొనసాగుతోంది. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్-9 రాకెట్‌ద్వారా భారత్‌కు చెందిన శుభాంశు శుక్లా సహా పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ -విస్నీవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లు అంతరిక్షంలోకి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరిన వీరి స్పేస్‌క్రాఫ్ట్ గురువారం సాయంత్రం ఐఎస్ఎస్‌కు చేరుకుంది. సాయంత్రం 4.03గంటలకు డాకింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. ఈ మిషన్‌లో ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించే వీరు 14 రోజులపాటు అక్కడ గడుపుతారు. కాగా కోట్లాది మంది భారతీయుల ఆశలను మోస్తూ భారత వైమానిక దళ ఫైటర్ పైలట్ అయిన మన వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి దూసుకెళ్లారు. మరికొన్ని గంటల్లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని చేరుకోనున్నారు. ప్రస్తుతం భూకక్ష్యలో వ్యోమనౌకలో తిరుగుతున్న ఆయన.. అంతరిక్షం నుంచి లైవ్‌కాల్‌లో మాట్లాడారు. ఈ ప్రయాణం చాలా అద్భుతంగా ఉందని మిగతా 2లో..



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి అడుగుపెట్టిన అనంతరం వీడియోకాల్‌లో మాట్లాడుతున్న వ్యోమగాములు



హైకోర్టులో సీఎం పిటిషన్..

## విచారణ వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి): ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో.. భాజపా పరువుకు భంగం కలిగేలా రేవంత్‌రెడ్డి మాట్లాడారని వాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో ప్రజాప్రతినిధుల కోర్టులో క్రిమినల్ డిఫమేషన్ కేసు నమోదైంది. కింది కోర్టులో ఉన్న కేసును మిగతా 2లో..



# ఇజ్రాయెల్‌పై గెలుపు మాదే

### అమెరికా చెంప ఛడేల్‌మనిపించాం

- లొంగుబాటు మా డిక్షనరీలోనే లేదు
- 12 రోజుల పాటు సాగిన యుద్ధంలో టెల్‌అవీవ్‌కు దీటుగా బదులిచ్చాం
- అమెరికా సైనిక స్థావరాలను ధ్వంసంచేసి ఆ దేశానికీ గట్టి సమాధానమిచ్చాం
- కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం తొలిసారి స్పందించిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

దుబాయి(జనంసాక్షి): ఇజ్రాయెల్- ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తొలిసారి స్పందించారు. 12 రోజుల పాటు కొనసాగిన ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌పై తమ దేశమే విజయం సాధించిందని ఆయన ప్రకటించారు. అలాగే, అమెరికా స్థావరాలపై దాడి చేయడం ద్వారా అగ్రరాజ్యానికి గట్టి చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చామని వ్యాఖ్యానించారు. జూన్ 19 తర్వాత తొలిసారిగా ఇరానియన్ స్టేట్ టెలివిజన్‌లో ఖమేనీ వ్యాఖ్యల వీడియో ప్రసారమైంది. అమెరికా జోక్యం చేసుకోకపోతే ఇజ్రాయెల్ నాశనమవుతుందని అగ్రరాజ్యం భావించడం వల్లే ఈ యుద్ధంలో జోక్యం చేసుకుందన్నారు. అయితే, ఈ యుద్ధం వల్ల అమెరికా ఎటువంటి ప్రయోజనం సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ విజయం సాధించింది. అమెరికాను చెంపదెబ్బ కొట్టింది. సోమవారం ఖతార్‌లో అమెరికా కీలక స్థావరాల్లో ఒకటైన అల్ ఉదీద్ వైమానిక స్థావరంపై దాడి చేసి నష్టం కలిగించింది. ఇందులో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా కేంద్రాలను యాక్సెస్ చేయగలదు. అవసరమనుకుంటే దాడులూ చేయగలదు. భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలు పునరావృతం కావొచ్చు. ఏదైనా దురాక్రమణ జరిగితే.. శత్రువు కచ్చితంగా భారీమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ఖమేనీ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి రోజులు గడుస్తున్నా అలీ ఖమేనీ బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడంతో ఆయన ఎక్కడ ఉన్నారంటూ వస్తోన్న వార్తల నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు.

### ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మళ్లీ రావొచ్చేమో?

ట్రంప్ అనుమానం 2లో




### వైద్యారోగ్యశాఖలో 52 పోస్టుల భర్తీకి
# పచ్చజెండా

నోటిఫికేషన్ విడుదల చేసిన మెడికల్ అండ్ హెల్త్ బోర్డు

హైదరాబాద్(జనంసాక్షి): డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టుల భర్తీకి వైద్యారోగ్యశాఖ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రెండు నోటిఫికేషన్‌లను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్, 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పీచ్ పాథాలజిస్టు పోస్టులకు జులై 12 నుంచి 26 వరకు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు జులై 14 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే వైద్య ఆరోగ్య శాఖ లో 8వేలకు పైగా పోస్టులను భర్తీ చేసినట్టు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ వంటి మరో 6వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. త్వరలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు తెలిపింది. మిగతా 2లో..

### ఎంపీ రఘునందన్‌కు
## భద్రత పెంపు

హైదరాబాద్(జనంసాక్షి): మెదక్ భాజపా ఎంపీ రఘునందన్‌రావుకు భద్రత పెంచాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఇటీవలే రఘునందన్‌రావుకు మావోయిస్టుల నుంచి బెదిరింపు కాల్ వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసు శాఖ మెదక్ ఎంపీకి భద్రత అవసరమని నిర్ధారణకు వచ్చింది. ఇకపై రఘునందన్‌రావు పర్యటనలో ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు మిగతా 2లో..





## అణచివేత నుంచి ఆదివాసీలను కాపాడాలి

వారి హక్కులను పరిరక్షించే బాధ్యత మంత్రి సీతక్కదే


మావోయిస్ట్ అధికార ప్రతినిధి జగన్ ప్రకటన

ములుగు(జనంసాక్షి): ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్క వహించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక లేఖలో పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో ఫారెస్టు అధికారులు, మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి

చర్ల(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపుర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల మాడ్ డివిజన్ సీనియర్ కేడర్ అబూజ్‌మడ్ అడవుల్లో ఉన్నారన్న సమాచారంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) నారాయణపుర్, కొండగావ్ ఎస్టీఎఫ్(స్టేట్ టాస్క్ ఫోర్స్) సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. బుధవారం సాయంత్రం నుంచి జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒక ఇన్సాస్ రైఫిల్, ఆయుధంతో పాటు వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.



### చైనా సదస్సులో సంతకం చేసేందుకు
# భారత్ నిరాకరణ

ఎస్‌సీవో పత్రంలో పహల్గాం ప్రస్తావన లేనందుకే...



బీజింగ్(జనంసాక్షి): చైనా పర్యటనలో ఉన్న భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి, సీమాంతర ఉగ్రవాదం గురించి ఆయన కీలక ప్రసంగం చేశారు. సమావేశం అనంతరం దీనిపై జాయింట్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశారు. అయితే, అందులో పహల్గాం ప్రస్తావన లేకపోవడంతో ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేయాల్సి వచ్చింది. చైనాలోని క్వింగ్డావోలో షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సు నిర్వహించారు. ఇందులో భారత్, చైనా, పాకిస్థాన్‌తో పాటు 10 సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం రూపొందించిన జాయింట్ డాక్యుమెంట్.. ఉగ్రవాదంపై భారత కఠిన వైఖరిని సుస్పష్టంగా ప్రతిబింబించలేకపోయింది. అంతేగాక, ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న పహల్గాం ఉగ్రదాడి ఘటనను అందులో ప్రస్తావించలేదు. అదే సమయంలో బలోచిస్థాన్ అంశాన్ని చేర్చి భారత్‌ను నిందించే ప్రయత్నం జరిగింది. దీంతో ఉగ్రవాదంపై భారత వైఖరిని నీరుగార్చేలా మిగతా 2లో..


### ఎన్నికల్లో పోటీ చేయని రాజకీయ పార్టీలపై
# ఈసీ కొరడా

345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను డీలిస్ట్ చేసిన ఎన్నికల సంఘం




న్యూఢిల్లీ(జనంసాక్షి): రాజకీయ పార్టీగా నమోదై ఎన్నికల్లో పోటీ చేయని రాజకీయ పార్టీలపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. 2019 నుంచి ఇప్పటి వరకు గడిచిన ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని 345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను (రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీస్) గుర్తించి వాటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఆయా పార్టీల కార్యాలయాలు కూడా ఎక్కడా మిగతా 9లో..

## పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ



'తుల్‌బుల్' ప్రాజెక్టు పునరుద్ధరణకు భారత్ పచ్చజెండా

ఆ దేశానికి వెళ్లే నీటిని మరింత కట్టడి చేసే యోచనలో కేంద్రం 2లో

## ఉత్తరాఖండ్‌లో ఘోర విషాదం

అలకనంద నదిలో పడిన బస్సు..

10 మంది గల్లంతు


2లో

# ఉద్యమాల గడ్డ మనది.. డ్రగ్స్‌కు అడ్డా కావొద్దు




శిల్పకళా వేదికలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ యాంటీ డ్రగ్ , ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే అవగాహన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్స్, కాలేజీల్లో మాదక ద్రవ్యాలు దొరికితే అది టీచర్లదే బాధ్యత అని.. పర్యవేక్షించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే యాజమాన్యాలపై కూడా కేసులు పెట్టండని ఆదేశిస్తున్నానని సీఎం రేవంత్ అన్నారు. ఫీజులు తీసుకుంటాం.. బాధ్యత తీసుకోం అంటే కుదరదని హెచ్చరించారు. బిహేవియరల్ ఛేంజెస్ గురించి చెప్పే సైకాలజీ ప్రొఫెషనల్స్ ను నియమించుకోవాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. పిల్లల వ్యవహార శైలిలో మార్పును గమనించాల్సిన బాధ్యత టీచర్లది, యాజమాన్యాలదేనని అన్నారు. శిల్పకళా వేదికలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ యాంటీ డ్రగ్ , ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే అవగాహన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్, గంజాయి గురించి టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇస్తే.. కట్టడి చేస్తామని అన్నారు. స్కూల్స్, కాలేజీల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్కూల్స్, కాలేజీల ముందు గంజాయి చాక్లెట్స్ అమ్మినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. హైదరాబాద్ టార్గెట్ న్యూయార్క్ అని.. బెంగళూర్, ముంబై, ఢిల్లీ కాదని అన్నారు.

తెలంగాణలో 68 శాతం జనాభా యువత అని.. యువతకు స్కిల్స్ పెంపొందిం చేందుకు శిక్షణ ఇస్తే న్యూయార్క్ తో పోటీ పడగలమని అన్నారు. మాదక ద్రవ్య రహిత సురక్షితమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యువతను ఆరోగ్యకరమైన ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించడమే లక్ష్యంగా కలిసి పని చేద్దామని 'కోరారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ సంకల్పానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ.. గంజాయి, డ్రగ్స్ హబ్‌గా మారితే మనందరం విఫలమైనట్టేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గడ్డపై గంజాయి, డ్రగ్స్ వైపు చూస్తే వారి వెన్ను విరుస్తామని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే స్పష్టంగా చెప్పానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'తెలంగాణ అంటే ఉద్యమాలు.. పోరాటాల గడ్డ. ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమానకరం. పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు విద్యార్థులపై డ్రగ్స్ ప్రభావం పడింది. డ్రగ్స్ మహమ్మారికి బలవుతున్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే దేశం మనుగడకే ప్రమాదం. ఒక దేశాన్ని దెబ్బతీయడానికి శత్రుదేశాలు ఏ మార్గాన్ని ఎంచుకుంటాయో చెప్పలేం. కొన్ని దేశాలు కొవిడ్‌ను ఎంచుకోవచ్చు.. మరికొన్ని దేశాలు డ్రగ్స్‌ను ఎంచుకోవచ్చు. మదక ద్రవ్యాలు తరలించే వారు తెలంగాణ సరహద్దులో అడుగు పెట్టాలంటే ఒకటికి వందసార్లు ఆలోచించుకునేలా చర్యలు ఉండాలని మంత్రివర్గ సహచరులు, పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చానని అన్నారు. యుద్ధం, సైనికులు అంటేనే.. పంజాబ్ గుర్తుకు వచ్చేది. అలాంటి పంజాబ్ ఇవాళ డ్రగ్స్ మహమ్మారి వలలో చిక్కుకుంది. డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి యువతను సరైన మార్గంలో పెట్టాలి, అభివృద్ధి పథంవైపు నడిపించాలని స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణపతకం రాకపోవటం గురించి ఆలోచించాం. యువతకు సాంకేతిక నైపుణ్యం అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. డ్రగ్స్ నిర్మూలన బాధ్యత పౌరులపై కూడా ఉంది. పిల్లల ప్రవర్తనను గమనించేందుకు ప్రత్యేకమైన సిబ్బందిని నియమించుకోవాలి. సబ్జెక్ట్, పీఈటీలను నియమించుకున్నట్టే బిహేవియర్ అబ్జర్వర్స్‌ను నియమించుకోవాలన్నారు. డ్రగ్స్ నివారణకు ప్రత్యేకంగా 'ఈగల్' అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి పంట, సరఫరా, విక్రయంపై ఈగల్ టీమ్ ప్రత్యేక నిఘా పెడుతుంది' అని సీఎం తెలిపారు. సినీనటులు రామ్‌చరణ్, విజయ్‌దేవరకొండకు ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా.. యువతకు మంచి సందేశం ఇవ్వాలని, ఈ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు' అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కోచ్ పుల్లెల గోపీచంద్, పలువురు ఉన్నతాధికారులు...తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి పలు రకాల స్టాళ్లను పరిశీలించారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా మార్చడానికి అందరూ కృషి చేయాలని ఎఫ్‌డీసీ ఛైర్మన్, సినీ నిర్మాత దిల్‌రాజు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మధ్యే మలయాళ చిత్ర పరిశ్రమలో ఓ నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధరణ అయితే, ఇండస్ట్రీ నుంచి బహిష్కరిస్తారు. అలాగే తెలంగాణ ఎఫ్‌డీసీ, తెలుగు చిత్ర పరిశ్రమ తరపున కోరుకునేది ఒక్కటే. అలాంటిది ఇక్కడ జరిగిందని తెలిస్తే, వారిని ఇండస్ట్రీలో అడుగు పెట్టకుండా నిషేధించాలి. అప్పుడే సమాజానికి సందేశం వెళుతుంది. ఎఫ్‌డీసీ తరపున చిత్ర పరిశ్రమ పెద్దలతో మాట్లాడి తెలుగు సినిమాలోనూ పాటించేలా చేస్తాం. ఇది మన కర్తవ్యం. డ్రగ్స్ లేని రాష్ట్రంగా మార్చడానికి మనమంతా ప్రతిజ్ఞ చేయాలి' అని దిల్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'నేనో చిన్న ప్రపంచంలో బతుకుతా. బయట ఏం జరుగుతుందో పెద్దగా తెలియదు. నేను విశాఖ పోర్ట్‌లో షూటింగ్ చేస్తున్నప్పుడు యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ గురించి బైట్ ఇవ్వమని ఓ పోలీస్ ఆఫీసర్ అడిగారు. గౌరవం కొద్దీ ఇచ్చాను. కానీ, ఇప్పుడు ఇంటర్నేషనల్ డే ఉందని తెలిసిన తర్వాత కొంతమంది పోలీస్ ఆఫీసర్‌లను కలిశా. వారు చెప్పిన విషయాలు విని, కచ్చితంగా దీనిపై మాట్లాడాలనిపించింది. దీనిని ఒక బాధ్యతగా

## పాఠశాల విద్యార్థుల వరకూ చేరుతున్న డ్రగ్స్

**ములుగు(జనంసాక్షి):**తెలంగాణలో డ్రగ్స్ వ్యసనం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, నేషనల్ ఆంటీ డ్రగ్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ శాఖ చేపట్టింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ అనే వ్యాధి యువతను భయంకరంగా పీడిస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇది ఒకప్పుడు విదేశాల్లో మాత్రమే వినిపించే సమస్య. ఇప్పుడు మాత్రం స్కూళ్ల దాకా ప్రవేశించింది. చాక్లెట్లు, బిస్కెట్లు రూపంలో పిల్లలకు చేరుతోంది. ఇది అత్యంత భయంకరమైన పరిస్థితి,' అని సీతక్క అన్నారు. డ్రగ్స్‌ను వ్యాపారంగా మార్చిన కొంతమంది, లాభాల కోసం సమాజాన్ని మత్తులోకి లాగుతున్నారన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు బాధను మిగులుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలాంటి వారిని సొసైటీ కూడా తిరస్కరించే అవకాశం ఉంది. ఇది కేవలం వారి జీవితమే కాదు ? సమాజానికే ప్రమాదం' అని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వాడకం మూలంగా చిన్నారులపై అత్యాచారాలు, వృద్ధులు ఆడపిల్లలపై రేపులు, హత్యలు వంటి దారుణాలు జరుగుతున్నాయని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. 'ఇది నేరం మాత్రమే కాదు, మానవత్వాన్ని మరిచే స్థితి,' అని అన్నారు.ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడి ఉన్నదని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. 'ప్రతి ఒక్కరూ బాధ్యతగా మత్తుపదార్థాలను తిరస్కరించి, డ్రగ్స్ నిర్మూలన కోసం కృషి చేయాలి' అంటూ ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ శాఖకు, కార్యక్రమ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. డ్రగ్స్ వంటి ముప్పుల నుంచి సమాజాన్ని రక్షించాలంటే, ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని అన్నారు.

## ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మళ్లీ రావొచ్చేమో..?

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇజ్రాయెల్, ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారాయి. దీంతో యుద్ధం ముగిసిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు పోస్టులు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై మరోసారి స్పందించిన ఆయన.. కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు దేశాల మధ్య యుద్ధం మళ్లీ రావొచ్చేమోనని అనుమానం వ్యక్తంచేశారు. "ఆ రెండు దేశాల (ఇజ్రాయెల్‌-ఇరాన్)తో నేను చర్చలు జరిపాను. అవి రెండూ ప్రస్తుతానికి అలిసిపోయాయి. అయితే మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తారా? అంటే బహుశా ఏదో ఒకరోజు రావొచ్చు. త్వరలోనే మళ్లీ ప్రారంభం కావొచ్చు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఆంక్షలు సడలించే అవకాశం: ట్రంప్

ఈ సందర్భంగా ఇరాన్‌తో అణు చర్చల అంశాన్ని అమెరికా అధ్యక్షుడు మరోసారి ప్రస్తావించారు. "వచ్చే వారం టెహ్రాన్‌తో అణు చర్చలు జరుపుతా. అణ్వాయుధాలు తయారుచేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా ఇరాన్‌తో ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది" అని ట్రంప్ వెల్లడించారు. ఇక, ఇరాన్‌పై అమెరికా దాడులు చేయడం వల్లే పశ్చిమాసియాలో యుద్ధానికి త్వరగా ముగింపు పడిందని ఆయన అన్నారు. తన నిర్ణయంతో అందరికీ విజయం లభించిందని పేర్కొన్నారు.మరోవైపు, ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించే అవకాశాలున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. "ప్రస్తుతం ఇరాన్ పునర్ నిర్మాణానికి నగదు వనరులు కావాలి.ఆ దేశం కోలుకునేలా మద్దతు ఇవ్వడం కోసం కొన్ని ఆంక్షలను సడలించే అవకాశాన్ని పరిశీలిస్తున్నాం" అని నాటో సదస్సులో ట్రంప్ వెల్లడించారు.

## తెలంగాణలో మూడు రోజులపాటు వర్షాలు

అవకాశం ఉందని తెలిపింది. వాయువ్య అరేబియన్ సముద్ర తీర ప్రాంతం నుంచి ద్రోణి ఒకటి దక్షిణ గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయువ్య బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టం నుంచి 1.5 - 7.6 కి.మీ మధ్యలో ఏర్పడిందని వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో 3 రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ మూడు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు శుభవార్త

**- రూ.180.38 కోట్ల మెడికల్ రియంబర్స్‌మెంట్ విడుదల**

**- దాదాపు 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట**

చేయడం ద్వారా దాదాపు 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊపిరి పీల్చుకునే అవకాశం లభించింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ప్రభుత్వంపై భారీ ఆర్థిక భారం ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలు కొనసాగుతుండగానే, ఉద్యోగుల ఆరోగ్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రాధాన్యతతో పరిష్కరించారు. 2023 మార్చి 4 నుండి 2025 జూన్ 20 వరకు పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను సమగ్రంగా పరిశీలించి ఈ మొత్తాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలు, పింఛన్ హక్కుదారులు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అభినందించాయి. ప్రభుత్వ నిబద్ధతను ఈ చర్య ప్రతిబింబించిందని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం మారిన సందర్భాల్లో ఈ విధంగా వెంటనే స్పందించిన ఉదాహరణలు తక్కువగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ వైఖరితో నష్టపోయిన వర్గాలకు న్యాయం జరుగుతుందని, భవిష్యత్తులో మరిన్ని సానుకూల చర్యలు కూడా ఆశించదగిన వాతావరణం ఏర్పడిందని ఉద్యోగులు, పింఛనర్లు తెలిపారు. బోనాలు పండగ ప్రారంభమైన వేళ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్‌లో ఉన్న రూ.180.30 కోట్ల మేర మెడికల్ బకాయిలను క్లియర్ చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. దీంతో 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట లభించనుందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోని పెండింగ్ బిల్లులనూ క్లియర్ చేసినట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ భారీఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులకూ ప్రాధాన్యత ఇస్తూ ఈ బకాయి నిధులు విడుదల చేసినట్లు భట్టి విక్రమార్క సోదాహరణగా విపులీకరించారు. కాగా, పెండింగ్ బకాయిలు విడుదల చేయడంపై ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నేతలు స్పందించారు. బోనాల వేళ శుభవార్త చెప్పారంటూ వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### హైకోర్టులో సీఎం రేవంత్‌రెడ్డి పిటిషన్..

## విచారణ వాయిదా

కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాది హైకోర్టును కోరారు. బహిరంగసభలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఆయన రాజకీయ ప్రసంగం మాత్రమే చేశారని తెలిపారు. జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే నెల 2కి వాయిదా వేసింది.

### దేశంలో ప్రజాస్వామ్యమే

## అత్యుత్తమైనది

మాత్రం అది మార్చలేదన్నారు. భారత 52వ సీజేఐగా గవాయ్ గత నెల బాధ్యతలు స్వీకరించారు. తూర్పు మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల్లో ఏది అత్యున్నతమైందని తరచూ చర్చ తలెత్తుతోందని గవాయ్ అభిప్రాయపడ్డారు. ' చాలామంది పార్లమెంట్ అత్యున్నతమైందని అంటారు. కానీ, నా ఉద్దేశంలో భారత రాజ్యాంగమే అత్యంత ముఖ్యమైంది. ప్రజాస్వామ్యంలోని మిగిలిన మూడు విభాగాలు దానికిందే పనిచేస్తాయి. మనం విధులు నిర్వహిస్తున్నామని న్యాయమూర్తులు ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి. మనం ప్రజల హక్కులకు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం. కేవలం మనకు అధికారం మాత్రమే లేదు. బాధ్యతలు కూడా ఉన్నాయి. తీర్పుల గురించి ప్రజలు ఏమనుకొంటున్నారు అన్నది జడ్జీలను ప్రభావితం చేయకూడదు. మనం స్వతంత్రంగా ఆలోచించాలి' అని పేర్కొన్నారు. తాను రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు అండగా నిలుస్తానన్నారు. బుల్డోజర్ న్యాయంపై తాను ఇచ్చిన తీర్పు మీద ఆయన స్పందించారు. ప్రతిఒక్కరికీ నివసించేందుకు ఇల్లు ఉండాలన్నారు. చిన్నప్పుడు తాను ఆర్కిటెక్ట్ కావాలనుకొన్నట్లు చెప్పారు. కానీ, తాను లా చదవడం తన తండ్రి కోరిక అని పేర్కొన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో ఆయన అరెస్టు కావడంతో.. లా చదవలేక పోయారన్నారు.

## ఎంపీ రఘునందన్‌కు భద్రత పెంపు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముగ్గురు ఎస్పీలకు ఆదేశాలు జారీ అయ్యాయి.రఘునందన్‌రావుకు పీపుల్స్‌వార్ మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఆగంతకుడు ఫోన్ చేశాడు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునంటూ బెదిరించాడు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి ఎంపీ హాజరైన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్ పీఏ లిఫ్ట్ చేశారు. బెదిరింపు కాల్‌పై డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు.

## ఉత్తరాఖండ్‌లో ఘోర విషాదం

**రుద్రప్రయాగ్(జనంసాక్షి):** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అలకనంద నదిలో పర్యాటకుల బస్సు పడిపోయింది. ఈ ఘటనలో 10 మంది గల్లంతయ్యారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..రుద్రప్రయాగ్‌లోని ఘోల్తీర్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బద్రీనాథ్ నుంచి వెళ్తున్న పర్యాటకుల బస్సు నదిలో పడిపోయింది. దీంతో అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. ఏడుగురికి గాయాలయ్యాయి. ఇంకా, 10 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో నది పొంగిపొర్లుతుంది.

## చైనా సదస్సులో సంతకం చేసేందుకు భారత్ నిరాకరణ

ఉన్న ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఉగ్రవాద అంశంపై సదస్సులో భిన్నాభిప్రాయాలు రావడంతో సమావేశం అనంతరం రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను ఆర్గనైజేషన్ రద్దు చేసింది. పాకిస్థాన్ వల్లే ఈ జాయింట్ డాక్యుమెంట్ నుంచి పహల్గాం ప్రస్తావనను మినహాయించి ఉంటారనే సంకేతాలు కన్పిస్తున్నాయి. ఈ సదస్సుకు చైనా అధ్యక్షత వహిస్తోంది. అంతకుముందు ఈ సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాద విధానాన్ని సాధనంగా వాడుకుంటున్నాయని పరోక్షంగా దాయాదిని దుయ్యబట్టారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకుతగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పవన్నారు.పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ రక్షణమంత్రులు ఎదురుపడటం ఇదే తొలిసారి. అయితే, ఈ సదస్సులో వీరిద్దరి మధ్య ఎలాంటి పలకరింపులు జరగలేదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇక, 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నుంచి భారత రక్షణ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ ఆర్గనైజేషన్‌లో బెలారస్, చైనా, భారత్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.

## రైలు పట్టాలపై కారు నడిపి..

### రంగారెడ్డి జిల్లాలో యువతి హల్‌చల్

**రంగారెడ్డి (జనంసాక్షి):**రంగారెడ్డి జిల్లాలో రైలు పట్టాలపై ఓ యువతి హల్‌చల్ చేసింది. ఆమె నిర్వాకంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. నాగులపల్లి-శంకర్‌పల్లి మార్గంలో పట్టాలపై సుమారు 7 కి.మీ మేర యువతి కారు నడిపింది. కారును అడ్డగించిన స్థానికులను ఆమె చాకుతో బెదిరించింది. అదే మార్గంలో వస్తున్న ఓ రైలు లోకో పైలట్ గమనించి ట్రైన్‌ను ఆపారు. స్థానికులు అతికష్టం మీద యువతిని పట్టుకున్నారు. యువతి చేసిన పనితో సుమారు 2 గంటల పాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం శంకర్‌పల్లి పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టాలపై కారు నడిపిన యువతిని లఖ్‌నవూకి చెందిన రవికా సోనీగా గుర్తించారు. రీల్స్ కోసమే ఈ నిర్వాకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆమె హైదరాబాద్‌లోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించినట్లు సమాచారం. ఇటీవల రవికా సోనీని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ క్రమంలో ఆమె మతిస్థిమితం కోల్పోయిందా? డ్రగ్స్ తీసుకుందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం యువతిని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



# డాకింగ్ సక్సెస్..

తెలిపారు. భారరహిత స్థితిలో ఎలా నడవాలో చిన్నపిల్లాడిలా నేర్చుకుంటున్నానని అన్నారు. "అంతరిక్షం నుంచి అందరికీ నమస్కారం. తోటి వ్యోమగాములతో కలిసి ఇక్కడ ఉండటం చాలా ఆనందంగా ఉంది. ఇదో గొప్ప ప్రయాణం. 30 రోజుల క్వారంటైన్ తర్వాత ఐఎస్ఎస్‌కు చేరుకోబోతున్నాం. ఈ ప్రయాణంలో నాకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. మాతో పాటు ఈ రైడ్‌కు జాయ్ (ఒక బేబీ హంస బొమ్మ) కూడా వచ్చింది. భారత సంప్రదాయంలో హంసను విజ్ఞానంగా సూచిస్తారు" అని శుక్లా ఆనందం వ్యక్తంచేశారు."భారరహిత స్థితికి ఇప్పుడిప్పుడే అలవాటుపడుతున్నా. అంతరిక్షంలో ఎలా నడవాలి, ఎలా తినాలి అనే విషయాలను చిన్నపిల్లాడిలా నేర్చుకుంటున్నా. ఇక్కడున్న ప్రతీ క్షణాన్ని ఆస్వాదిస్తున్నా. నా భుజంపై మువ్వన్నెల పతాకం ఉంది. అది చూస్తున్నప్పుడు ఈ ప్రయాణంలో నేను ఒంటరి కాను.. కోట్లాది మంది భారతీయులు నాకు తోడుగా ఉన్నారనే భావన కలుగుతుంది. రోదసియానంలో నాది చిన్న అడుగే కావొచ్చు. కానీ, భారత మానవ సహిత అంతరిక్ష యాత్రలకు ఘనమైన ముందడుగు. వీలైనంత ఎక్కువ సమయం గడుపుతా. నా అనుభవాలను మీతో పంచుకునేందుకు ఎదురు చూస్తున్నా" అని శుభాంశు అన్నారు. దాదాపు 15 నిమిషాల పాటు ఈ లైవ్‌కాల్ సాగింది.భారత కాలమానం ప్రకారం బుధవారం 12.01 గంట లకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుభాంశుతో పాటు మొత్తం నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు బయల్దేరిన సంగతి తెలిసిందే. గురువారం సాయంత్రం 4.30 గంటలకు వీరి వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం అవుతుంది. ఈ బృందం 14 రోజులపాటు ఐఎస్ఎస్‌లో ఉండి పలు పరిశోధనలు చేస్తారు. 41 ఏళ్ల తర్వాత భారతీయుడొకరు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి.

# 'జూరాల'కు డేంజర్‌బెల్స్

విడుదల చేసే క్రమంలో డ్యామ్ 9వ గేట్ రోప్ తెగిపోయిన ఉదంతం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో పాటు మరో రెండు రోప్స్ బలహీనపడటం స్థానిక ప్రజానీకంలో, ఆయకట్టు రైతులలో భయాందోళనలు సృష్టిస్తోంది. ఊహించని ప్రమాదం పొంచి ఉందనే భయం వారిని వెంటాడుతోంది. ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో రుతుపవనాలు చురుగ్గా కదులుతూ కుండపోత వర్షాలను కురిపిస్తున్నాయి. ఈ భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి అనుబంధంగా ఉన్న వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా.. తెలంగాణ రాష్ట్రంలో కృష్ణా నదిపై నిర్మించిన తొలి ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాలకు అనూహ్యమైన స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో జలాశయం గరిష్ట నీటిమట్టానికి చేరువ కావడంతో, ఇంజనీర్లు వెంటనే అప్రమత్తమై నీటి మట్టాన్ని నియంత్రించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా.. ప్రాజెక్టుకు ఉన్న మొత్తం గేట్లలో 12 గేట్లను ఎత్తివేసి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు, శ్రీశైలం జలాశయం వైపు విడుదల చేస్తున్నారు. అయితే.. ఈ ప్రక్రియలో ఊహించని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాజెక్టు గేట్లను పైకి లేపుతున్న సమయంలో.. 9వ నెంబర్ గేటుకు సంబంధించిన బలమైన ఉక్కు మోకులు ఒక్కసారిగా తెగిపోయాయి. ఈ పరిణామంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఉలిక్కిపడ్డారు. దీనికి తోడు, 12వ, 16వ నెంబర్ గేట్లు కూడా అత్యంత బలహీనంగా, ప్రమాదకర స్థితిలో ఉన్నాయని సమాచారం. ఈ వార్త క్షణాల్లో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలకు, ఆయకట్టు గ్రామాలకు పాకిపోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం: కేటీఆర్**

జూరాల ప్రియదర్శిని ప్రాజెక్టులోని తొమ్మిదో నెంబర్ గేట్ రోప్ తెగిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. ఒక్క ఇటుక పేర్చడం కూడా చేతకాని ముఖ్యమంత్రికి.. కనీసం ఉన్న ప్రాజెక్టు నిర్వహణ కూడా రాకపోవడం వల్లే ఇవాళ జూరాల ప్రాజెక్టు డేంజర్‌లో పడిందన్నారు. ప్రతిఏటా వరద వస్తుందని తెలిసినా స్పిల్ వే వద్ద మెయింటెనెన్స్ పనులు చేయించడంలో రేవంత్ సర్కారు నిర్లిప్తత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జూరాలకు క్రమంగా వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడాలని హితవు పలికారు. ఇప్పటికే ఈ ప్రభుత్వ అసమర్థత వల్ల ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని.. పెద్దవాగుకు గండిపడి 16 గ్రామాలు ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. వట్టెం పంప్‌హౌస్ మునిగిపోయిందని.. సుంకిశాల రిటైనింగ్ వాల్ కుప్పకూలి వందల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. తాజాగా జూరాల 9వ నంబర్ గేట్ రోప్ తెగిపోవడంతోపాటు ఇతర గేట్ల రోప్‌లు బలహీనంగా ఉండడం ప్రాజెక్టును ప్రమాదంలోకి నెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, ఎగువ నుంచి పెరుగుతున్న ఇన్ ఫ్లోను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పకడ్బందీగా వ్యవహరించాలని, జూరాల ప్రాజెక్టుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని 'ఎక్స్' పోస్ట్ ద్వారా సూచించారు.

## అణచివేత నుంచి ఆదివాసీలను కాపాడాలి

పోలీసులు ఆదివాసీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తరతరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న ప్రజలను అరెస్టులు, కేసుల బెదిరింపులతో గూడేలను ఖాళీ చేయించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఆదివాసీ బిడ్డ, మాజీ నక్సలైట్‌గా ప్రాచుర్యంలో ఉన్న సీతక్క సొంత నియోజకవర్గంలో ఈ విధంగా జరగడం సిగ్గుచేటు, అవమానకరమని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న ధనసరి అనసూయ ఎందుకు ఆదివాసీల గురించి మాట్లాడడం లేదనేది అందరూ మాట్లాడుకుంటున్నారని తెలిపారు. భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌పై, 1996లో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన పీసా చట్టంపై, 2006లో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఎఫ్ఆర్ఏ, 1/70 చట్టాన్ని సీతక్క మరచిపోయిందా.. అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ఆదివాసీలు, భారత రాజ్యాంగం గురించి పదే పదే మాట్లాడుతున్నది రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు అర్థం కావడం లేదా అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు పూర్తి బాధ్యత సీతక్క వహించాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, బుద్ధిజీవులు కొన్ని వేల సంవత్సరాలుగా ఈ దేశ సందపను కాపాడుతున్న ఈ దేశ మూలవాసులైన ఆదివాసీలను కాపాడుకోవడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఆదివాసీలు అడుగుతున్నది భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు, నిర్ణయాధికారంతో అభివృద్ధిని కోరుకుంటున్నారని, అందరూ వారి హక్కుల అమలు కోసం అండగా ఉండాలని జగన్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

## పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.దీంతో దాయాది దేశానికి నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో పశ్చిమ నదుల నుంచి నీటిని మరింత సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్న భారత్.. సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి సారించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు చర్చలు తుది దశలో ఉన్నాయన్న విషయాన్ని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమవుతోందని, ఏడాదిలో పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అయితే, ఈ నదుల నుంచి భారత్ వాటాను మరింత సద్వినియోగం చేసుకునేందుకు అనేక ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని సంబంధిత అధికారి ఒకరు పేర్కొన్నారు. పడమరవైపు ప్రవహించే నదుల్లో ఒకదాని నుంచి నీటిని పంజాబ్, హరియాణాకు మళ్లించే అవకాశం కూడా పరిశీలనలో ఉందన్నారు.సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు మాత్రమే ఉన్నాయి.

# మరో మూడేళ్లు సీఎం రేవంత్ రెడ్డే




**ఆ తరవాత ఛాన్స్ కోసం నేను ప్రయత్నిస్తా**

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**

**హైదరాబాద్, జూన్26 (జనంసాక్షి) :** మరోమూడేళ్లు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం పదవిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రతి విషయాన్ని రాద్దాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బీఆర్ఎస్‌లో ఉంటే ఏంటి.. బయటకు వస్తే ఏంటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని.. ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదనే తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకి ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు. లిక్కర్ స్కాంలో పైసలు పెట్టడానికి కవితకి ఇన్ని వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని జగ్గారెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

# కేసీఆర్‌తో కలిసి కవిత కూడా చేపల పులుసు తిన్నారు



**బనకచర్లకు నాంది పలికిందే కేసీఆరే..**

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**

**హైదరాబాద్, జూన్ 26 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కాంగ్రెస్ యువ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారా లేదా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ వద్ద మార్కుల కోసమే కవిత తరచూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్, హరీష్ రావుకు ఇప్పటికే సవాల్ విసిరారు. ఫామ్‌హౌజ్‌లో చిల్ అవుతూ వాళ్లు ఇప్పటివరకూ స్పందించలేదని మండిపడ్డారు. మాజీ మంత్రి రోజా ఇంట్లో చేపల పులుసు పెట్టినప్పుడు కేసీఆర్ పక్కన కవిత కూడా ఉన్నారు. కవిత కూడా లొట్టలేసుకుంటూ తిన్నారని హాట్ కామెంట్స్ చేశారు. రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ చెప్పినప్పుడు కవిత పక్కనే ఉన్నారని గుర్తుచేశారు. బనకచర్లకు నాంది పలికిందే కేసీఆరే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుంటే.. తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారని సీరియస్ అయ్యారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఇస్తే కవితకు కనబడటం లేదా..? అని అడిగారు. ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ కవితకు కనిపించడం లేదా? ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులు తీర్చడానికే మా ప్రభుత్వం అప్పులు చేస్తున్నదని చెప్పారు. ప్రజలు పదేళ్లు అవకాశం ఇస్తే.. ప్రతిపక్ష నేతలు ఫోన్లు ట్యాపింగ్ చేసి పబ్బం గడిపే ప్రయత్నం చేశారని అన్నారు. కవిత ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందని కీలక వ్యాఖ్యలు చేశారు. భార్యాభర్తల సంభాషణలు విన్నారు. కొంతమంది భార్యాభర్తలు విడిపోవడానికి కారణమయ్యారు. కుటుంబాల్లో గొడవలు పెట్టి పైశాచిక ఆనందం పొందారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కవితకు కొంచమైనా మానవత్వం ఉంటే ట్యాపింగ్ చేసిన వారిని చెప్పుతో కొట్టాలి.. ఆ తర్వాత బయటకు వచ్చి మాట్లాడితే ప్రజలు నమ్ముతారని అన్నారు.

# పరకాల పట్టణాభివృద్ధికి సహకరించాలి

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**పరకాల (జనంసాక్షి) :** పరకాల పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పరకాల పట్టణంలో టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం సీఎంఎస్ గోదాం కాలనీ, యూనియన్ బ్యాంక్ ప్రాంతం, బస్టాండ్ పరిసర తదితర ప్రాంతాలను పరిశీలించారు. డిపిఆర్ కి అనుగుణంగా పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరకాల మున్సిపాలిటీని సుందరీకరణ చేసి అభివృద్ధిలో ముందు ఉంచాలని, మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు, కొత్త అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని ఎంఎల్ఏ అధికారులను ఆదేశించారు.

# ఆరోగ్యశాఖలో మరో 2 జాబ్ నోటిఫికేషన్లు విడుదల

**డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ ఫాథాలజిస్ట్ పోస్టులకు వెలువడిన నోటిఫికేషన్లు**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి మరో 2 నోటిఫికేషన్లను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం విడుదల చేసింది. ఇందులో డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులు ఉన్నాయి. డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 48 ఉండగా, స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులు 4 ఉన్నాయి. స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు జూలై 12 నుంచి 26వ తేదీ వరకూ.. డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు జూలై 14 నుంచి 25వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పోస్టుల వివరాలు, విద్యార్హతలు, ఇతర వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో **(https://mhsrb.telangana.gov.in/MHSRB/home.htm)** అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు.

గత 18 నెలల కాలంలో ప్రభుత్వ దవాఖాన్లలో 8 వేలకుపైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఇందులో డాక్టర్స్, స్టాఫ్ నర్స్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్స్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్ తదితర పోస్టులు ఉన్నాయి. మరో 6 వేలకుపైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్ 1284, మల్టీ పర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్, 1930, ఫార్మసిస్ట్ 732, నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్) 2322, తదితర పోస్టులు ఉన్నాయి. తాజాగా 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్, 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. త్వరలో మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల అవనుంది.

# ప్రైవేట్ బస్సు బోల్తా

**పలువురికి గాయాలు**

**మహబూబ్‌నగర్, జూన్ 26 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో దోమలపెంట వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడింది. శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బ్రేకులు ఫెయిల్ అయి అదుపుతప్పి బోల్తాపడడంతో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. భక్తులు హైదరాబాదు నుండి శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. ట్రాఫిక్ కు అంతరాయం కలగడంతో క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యం

**నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల**



**నిర్మల్ బ్యూరో, జూన్ 26 (జనంసాక్షి)** మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని జిల్లా ఎస్పీ జానకి షర్మిల గురువారం పత్రిక ప్రకటనలో తెలిపారు.. గంజాయి,మాదక ద్రవ్యాల నిర్మూలనకై పౌరులు, యువత కృషి చేయాలనీ ఆమె పిలుపునిచ్చారు. భావితరాలకు మంచి సమాజాన్ని అందించాలన్న సదుద్దేశ్యంతో జిల్లాలో గత వారం రోజులుగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, వాటి వల్ల కలిగే నష్టాల గురించి జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, స్లోగన్ రైటింగ్, డ్రాయింగ్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. యువత మాదక ద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే నష్టాలను గుర్తెరగాలని, మత్తులో జీవితాలకు చిత్తవుతాయని గుర్తించాలని అన్నారు. మిషన్ గాంజా గస్తీ కార్యక్రమాన్ని అమలు చేయడం వల్ల జిల్లాలో ఇది వరకు తో పోలిస్తే చాలా గంజాయి కేసులు చాలా తగ్గు ముఖం పట్టాయని తెలిపారు. ఒకవేళ మాదక ద్రవ్యాలకు సంబంధించి ఏవైనా అనుమానాస్పద కార్యక్రమాలను గమనించినపుడువెంటనే 8712659599 నంబరు కు సమాచారం ఇవ్వాలనీ విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడుతాయని ఎస్పీ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

# హుజూర్ నగర్, కోదాడలో నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన



**హైదరాబాద్ (జనం సాక్షి) :** జన పహాడ్, బెట్టెతండాలో జరుగుతున్న ఎల్ఐ పనులను పరిశీలించడానికి నేడు హెలికాప్టర్‌లో రానున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గరిడేపల్లి మండలంలోని ఆర్ అండ్ బి, పిఆర్ రోడ్లకు శంకుస్థాపనలు లేదా ప్రారంభోత్సవాలు కూడా చేయనున్నట్టు పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లో కొత్త జూనియర్, డిగ్రీ కళాశాలలకు కూడా శంకుస్థాపనలు, కోదాడలో జరుగుతున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని పరిశీలన, కొనసాగుతున్న ఎంబిసి, రాజీవ్ గాంధీ లిఫ్ట్ పథకాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో ఇలాంటి ఇతర కార్యక్రమాలకు కూడా హాజరు కానున్నట్టు తెలిపారు.


# నగరంలో ఆషాడ బోనాల సందడి

**గోల్కొండలో తొలిబోనం సమర్పించిన కవిత**



**హైదరాబాద్, జూన్ 26(జనంసాక్షి) :** ఆషాఢ మాసం బోనాలు భాగ్యనగరంలో ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటపై వెలిసిన జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో తొలి బోనంతో బోనాల సందడి ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నగరంలో సందడి మొదలయ్యింది. ఈ క్రమంలో గోల్కొండ జగదాంబిక మహంకాళి, ఎల్లమ్మ తల్లికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బోనం సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కవిత పేర్కొన్నారు.

# రాష్ట్ర టీఎన్‌జీవో కార్యవర్గంలోకి ఖమ్మం జిల్లా టిఎన్జీఓ నాయకులు




**ఖమ్మం (జనం సాక్షి) :** గురువారం హైదరాబాద్ నాంపల్లి టిఎన్జీఓ భవన్ లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఖమ్మం జిల్లా కి చెందిన టీఎన్జీఓ నాయకులు గంగవరపు బాలకృష్ణ ,జడ్ ఎస్ జయపాల్ విజయకుమార్ లను ఇరువురి ని రాష్ట్ర కార్యవర్గం లో కి ఎంపిక చేశారు. గతం లో వీరు ఖమ్మం జిల్లా కార్యవర్గం లో కీలక బాధ్యతలు నిర్వహించినారు. రాష్ట్ర కార్యవర్గం లో కీలక పదవులు ఇచ్చి ఖమ్మం జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చినందు కు ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్, ముజీబ్ గార్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రస్తుతం ఎన్నిక కాబడిన ఇరువురు పూర్తి స్థాయి లో ఉద్యోగుల కు అందుబాటు లో ఉంటారని తెలియజేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డిఎ ఉద్యోగుల పిఆర్సి కి సంబంధించి అనేక విషయాలు ఈ కార్యవర్గ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా టీఎన్జివో నాయకులు కొమరగిరి దుర్గాప్రసాద్, యర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భీమదేవరపల్లి సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు




**భీమదేవరపల్లి, జూన్ 26 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని సబు రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలపై పలువురు అనుమానాలు వ్యక్తం చేయడంతో పనిచేస్తున్న అధికారులు సిబ్బందిపై జిల్లా డీజీ రిజిస్ట్రార్ ఆదేశానుసారం గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్స్ ద్వారా చెల్లించాల్సిన రుసుము కంటే ఎక్కువ చెల్లిస్తున్నారని సమాచారంతో తనిఖీ చేయగా డాక్యుమెంట్ రైటర్స్ దగ్గర దాదాపు 97 వేల రూపాయలు పట్టుకున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం డాక్యుమెంట్ రైటర్స్ కార్యాలయంలోపలికి రాకూడదని, కానీ ఎస్ ఆర్ ఓ అనుమతితోనే తాము లోపలికి వచ్చినట్లు వారు తెలిపారని అన్నారు. సంబంధిత సభ్యులు సీజ్ చేసినట్లు, అలాగే కార్యాలయాన్ని తనిఖీ చేయగా 2023 – 24 డాక్యుమెంట్లు సమర్పించలేదని తెలిపారు.

# అర్హత గల ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ ఫలాలు అందించాలి

- **రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 26 (జనంసాక్షి) :** అర్హత గల ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద, పార్లమెంట్ సభ్యులు నగేష్, మంచిర్యాల, కొమురం భీం అసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, రాజర్షి షా, అభిలాష అభినవ్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు కోవ లక్ష్మి, గడ్డం వినోద్, పాయల్ శంకర్, మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, అనిల్ జాదవ్, రామారావు పటేల్, హరీష్ రావు లతో కలిసి జిల్లా అధికారులతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హత గల ప్రతి లబ్దిదారుడికి అందించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అమలు చేసే బాధ్యత అధికారులదేనని, ఎలాంటి జాప్యం లేకుండా పథకాలు అమలు చేయడంలో సమన్వయంతో పని చేయాలని, గ్రామసభలలో సేకరించిన లబ్దిదారుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించేందుకు అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వం తలపెట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాకు మంజూరైన 10 వేల 128 ఇందిరమ్మ ఇండ్లలో 3 వేల 355 ఇండ్లకు బేస్మెంట్ మార్కింగ్ చేయడం జరిగిందని, 458 ఇండ్లకు సంబంధించిన బేస్మెంట్ స్థాయి బిల్లులు చెల్లించడం జరిగిందని తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని, ఓరియంట్ సిమెంట్ యాజమాన్యంతో మాట్లాడి సిమెంట్ రాయితీతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా చరిత్రలో నిలిచింది

- **స్టేషన్ ఘనపూర్‌లో లెదర్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తా**
- **స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 26 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తొమ్మిది రోజుల్లో రైతు భరోసా మొత్తం వేసి రికార్డు సృష్టించిందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చిల్పూర్ మండలంలోని చిన్న పెండ్యాలగ్రామంలో ఎంపీ ల్యాడ్స్ నిధుల నుండి 20లక్షల అంచనా విలువతో నిర్మించను న్న రెడ్డి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు ఎంపీ కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గత పాలకులు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని, నియోజకవర్గం మాకు కన్నతల్లి లాంటిదని, రాజకీయ జన్మనిచ్చిన స్టేషన్ ఘనపూర్ ను మరింత అభివృద్ధి చేస్తామ ని, నియోజకవర్గంలో లెదర్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ రాష్ట్ర వనరులను దోచుకుని భూకబ్జాలకు పాల్పడిందని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని విర్రవీగిన వారు ఈరోజు కాలేశ్వరం, ఫార్ములా ఈ–రేస్ కెసుల్లో ఈసీబీ, ఈడీ చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, తాహసిల్దార్ సరస్వతి, మార్కె ట్ డైరెక్టర్ మాదిరెడ్డి యశ్వంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చిల్పూర్ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్,రెడ్డి సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ మామిడాల లింగారెడ్డి, నాయకులు తాళ్లపెల్లి సమ్మయ్య, యాదవ రెడ్డి, రవీందర్ రెడ్డి, తాళ్ల పెల్లి సంపత్, బొమ్మిశెట్టి బాలరాజు, పోలపెల్లి రంజిత్ రెడ్డి, ఇల్లందుల విజయ్, ఇల్లందుల యాదగిరి, దామోదర్, భూక్య రమేష్ నాయక్,రంగు రమేష్, లక్ష్మారెడ్డి, మల్లా రెడ్డి,నరసింహా, రవీందర్, శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతిని ధులు, అధికారులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I, LOKESH NAIK, H.NO.4-31, KATTUKALVA THANDA GP, KOTHUR(POST), BOMRASPET (MANDAL), VIKARABAD (DIST), TELANGANA STATE, PIN:509338, CHENGED MY NAME AS FOR SSC MEMO CERTIFICATE VANKDOVATH LOKESH S/O VANKDOVATH RAVI NAIK

# స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు సాధ్యమయ్యేనా?

తెలంగాణ రాష్ట్రం స్థానిక సంస్థల పోరుకు సిద్ధమవుతోంది. ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. సంవత్సరం దాటిన గ్రామాలలో సర్పంచులు లేక గ్రామ పరిపాలన కుంటుపడింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులు స్తంభించాయి. ఇటీవల తెలంగాణ హైకోర్టు సైతం సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎలక్షన్ నిర్వహించాలని నిర్దేశించినది. అధికార వికేంద్రీకరణకు కేంద్ర బిందువు అయిన స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగితేనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుంది. కానీ ఈ అధికార వికేంద్రీకరణలో అట్టడుగు వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ మొదలైనది. ఇప్పుడు రాజకీయ పార్టీలు సైతం ఆ దిశగా అడుగులు వేసే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ దేశంలో మొదట కులగణన అంశం తెరపైకి తెచ్చింది. ఎన్నికల మేనిఫెస్టో లో కూడా చేర్చింది. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన ప్రక్రియ పూర్తిచేసి బీసీ వర్గాలకు స్థానిక సంస్థలు, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అసెంబ్లీలో బిల్లు ఆమోదించినది. ఈ బిల్లును కేంద్రానికి పంపినా... ఇప్పటికీ ఆమోదం పొందడం లేదు. దేశంలో రిజర్వేషన్లు 50 శాతం మించరదని కోర్టు నిర్దేశించిందని కేంద్ర ప్రభుత్వం దాటవేస్తున్నారు. మరోవైపు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సైతం జనగణనతో పాటు కులగణన చేయడానికి సిద్ధపడింది. ఇది ఒక ప్రజా డిమాండ్ గా ముందుకెళ్లడంతో కేంద్రం ఆ దిశగా అడుగులు వేయక తప్పలేదు. కాని తెలంగాణకు సంబంధించిన 42 శాతం స్థానిక సంస్థల ఎలక్షన్ రిజర్వేషన్ బిల్లును ఆమోదం సాధ్యం కానప్పుడు ఈ కులగణన చేయడం వృధా కాదా?. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2011 జనాభా లెక్కల్లో సామాజిక ఆర్థిక కులగణన చేయడం జరిగింది. అయినా అది రాజకీయ సంక్లిష్టత నేపథ్యంలో విడుదల చేయలేదు. మరి ఇప్పుడు ఈ సోషల్ జస్టిస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలవుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

> **42 శాతం స్థానిక సంస్థల ఎలక్షన్ రిజర్వేషన్ బిల్లును ఆమోదం సాధ్యం కానప్పుడు ఈ కులగణన చేయడం వృధా కాదా?. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2011 జనాభా లెక్కల్లో సామాజిక ఆర్థిక కులగణన చేయడం జరిగింది.**

జనంసాక్షి

**రిజర్వేషన్లు ఇవ్వనప్పుడు కులగణన ఎందుకు?**

ఏళ్ల చరిత్ర గల ఈ రాజకీయ పార్టీల సామాజిక న్యాయ సూత్రం అమలు దిశగా అడుగులు వేస్తున్నట్టు ప్రకటనలు చేస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ లో రెడ్డి ఎమ్మెల్యేల ఆధిపత్యం ఉన్నప్పటికీ...బీసీ ,ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇది మంచి పరిణామమే. కానీ రాజకీయాల్లో బడుగు బలహీన వర్గాలకు పదవులు లభించినా...అధికారాలు ఇస్తారా ? అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ధనస్వామ్య ప్రజాస్వామ్యంలో జనరల్ స్థానంలో ఒక నిరుపేద బిడ్డ గెలిచే అవకాశం లేదు. తెలంగాణలో మెజార్టీ నామినేటెడ్ పదవులను, ఉన్నత అధికారులలో తమకు అనుచరులుగా ఉండే అగ్రకులాలే వారినే ఇచ్చారు. ఒక శాతం లేని వెలమలు 10 సంవత్సరాలు రాష్ట్రాన్నీ పరిపాలించారు, ఇప్పుడు 5 శాతం ఉన్న రేడ్లు పాలిస్తున్నారు. మరి 90 శాతం ఉన్న బిసీ, ఎస్సీ, ఎస్టీలు పాలితులుగానే మిగిలిపోయారు. బిజెపిలో కూడా అగ్రకులాలకే ముఖ్య పదవులు ఇచ్చారు. మొత్తంగా అన్ని పార్టీలు ఒకటే. కింది కులాలకు పదవిలిచ్చినప్పటికీ అవి కీలుబొమ్మలాంటివే . రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ అసెంబ్లీలో ఆమోదించిన బీసీ రిజర్వేషన్స్ బిల్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెండింగ్ లోనే పెట్టింది. వెనుకబడిన వర్గాలకు పదవుల్లో ప్రాధాన్యమిచ్చే ఈ బిల్లు ఎటు తేలికముందే రాష్ట్రం స్థానిక సంస్థల ఎలక్షన్లకు సిద్ధపమవుతుంది. ఈ రకంగా ముందుకు వెళితే వెనుకబడిన వర్గాలు నష్టపోక తప్పదు. కేవలం ప్రజలను మభ్య పెట్టడానికి మాత్రమే ఈ సాధ్యం కానీ బిల్లులు, ప్రకటనలు చేస్తున్నారా అనిపిస్తుంది. అంటే ఈ పార్టీలలో సామాజిక న్యాయం ఏముంది. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప. దేశం, రాష్ట్రాలు కుల గణన చేయడమంటే సామాజిక న్యాయం, వనరుల సమాన పంపిణీకి విధాన రూపకల్పనగా చెప్పవచ్చు. ఎవరి వాటా ప్రకారం వారికి అన్నింటిలో అవకాశాలు, అధికారాలు ఇవ్వాలి. అప్పుడే కులగణన సిద్ధాంతానికి అర్థం. ఈ దేశ నిర్మాణంలో తన రక్త మాంసాలు దార పోసిన బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలు అధికారంలోకి రావడమే నిజమైన సామాజిక న్యాయం. ఇది జరగాలంటే బడుగు బలహీన వర్గాలు ఓటు చైతన్యంతో ముందుకెళ్లాలి. గ్రామ పరిపాలన బడుగు బలహీన వర్గాల చేతిలోకి వచ్చినప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమైతుంది. ఇది ఈ స్థానిక సంస్థల ఎలక్షన్ నుంచి ఆరంభం కావాలి.



**సంపతి రమేష్ మహరాజ్**
**సామాజిక విశ్లేషకులు, 7989578428**

# ప్రజలే చరిత్ర నిర్మాతలు

ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరుగిన, జరుగుతున్న తాజా ఘర్షణల పరిణామాలు ఒక విశేష మలుపు తిరిగాయి. హఠాత్తుగా కాల్పుల విరమణ ఒప్పందం ఇరుదేశాల మధ్య కుదిరింది. ఇది తుదివిజయం కాదు. కానీ, ప్రజల నిరంతర పోరాటానికి లభించిన ఒక కీలక విజయ ఘట్టంగా చెప్పుకోవాలి. ప్రపంచ దృష్టిలో ఇజ్రాయిల్, అమెరికా కూడబలుక్కుని,తోడు దొంగల్లా ఇరాన్ మీద దాడి చేయడం అన్యాయమన్న ప్రజాభిప్రాయ మే సర్వత్రా వెల్లువెత్తింది. ఈ పరిణామం నరహంతక నాయకులకు ఎదురైన ప్రజా విరోధ భావనకు సంకేతం. మొత్తానికి అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాద లక్ష్యాల పరాజయం జనబాహుళ్య హర్షాతిరేకానికి కారణం అయింది.

జనంసాక్షి

ఇరాన్ చరిత్ర అనేది కేవలం మత పరమైనదే కాదు.అది ఒక జాతీయ స్వాభిమానం. యూరోపియన్ సామ్రాజ్యవాదానికి తలొగ్గని ధీరోదాత్త చరిత్ర కలిగింది. సుమారు మూడువేల ఏళ్ల నాగరికతా, సంస్కృతులతో విలసిల్లిన రాజ్యం. 'సైరస్ ద గ్రేట్,' 'దరయస్' పాలనల నుండి ఇప్పటివరకు పర్షియన్ సంస్కృతి ఎన్నో యుద్ధాలను, పోరాటాలను ఎదుర్కొన్నా, ఎవరికీ తలవంచలేదు. బ్రిటన్, అమెరికాల వలస పాలనా కాంక్షలకు, సైనికంగా ఎదురైన సవాళ్ళకు ఎదురొడ్డి నిలిచిన దేశాల్లో ఇరాన్ ముందు వరుసలో నిలిచింది. ముఖ్యంగా 1953లో "మోసాదిక్" నాయకత్వంలోని ప్రజాస్వామ్య సర్కార్‌ను అమెరికా కూలగొట్టిన ఘటన చరిత్రలో ఒక మాయని మచ్చగా నిలిచింది.ఆయిల్ సంపద కోసం సాగిన ఈ కుట్రల తర్వాత 1979లో ఇస్లామిక్ విప్లవం రూపంలో జనం తిరుగుబాటు చేశారు. ఇది మతవాద పోరాటం కాదు, ఒక జాతీయ విమోచన ఉద్యమం. ప్రపంచ వ్యాప్తంగా "డెత్ టు అమెరికా" నినాదానికి జనమద్దతు అప్పుటి నుండే మొదలైంది.

ఇప్పుడు ట్రంప్, నెతన్యాహు లాంటి నేతలు ప్రజాస్వామ్య ముసుగు కప్పుకొన్న నియంతలు అదే చరిత్రను పునరావృతం చేయాలనుకున్నారు. ఇరాన్ అణు స్థావరాలపై దాడులు చేసి తాము ప్రపంచ హీరోలం కావాలనుకున్నారు. కానీ భిన్నమైన ప్రపంచ వాతావరణంలో అది చెల్లు బాటు కాలేదు. ఇరాన్ కు బలమైన ప్రజా సమర్థన ఉంది. సాంకేతికంగా ఎంతో అభివృద్ధిని సాధించింది.అధునాతన టెక్నాలజీతో రూపొందిన క్షిపణుల ద్వారా నెత్తన్యాహు పాలనలోని ఇజ్రాయెల్ మీద తీవ్ర ప్రతీకార దాడులు చేసింది. టెల్ అవీవ్ అంతర్జాతీయ విమానాశ్రయం, హైఫా ఓడరేవుపై జరిపిన దాడులు, నిత్యం సైరన్ల మోతతో ప్రజలు భీతిల్లి బంకర్లలో దాగి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడటం ఇజ్రాయెల్ చరిత్రలోనే తొలిసారి.

ఇరాన్ ప్రజలు కూడా తమ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఎటువంటి నష్టం వాటిల్లినా , విపత్కర పరిస్థితి వచ్చినా భరించేందుకు సిద్ధమని రోడ్ల మీదకి వచ్చారు. "మనకూ అణ్వస్త్రాలు కావాలి" అనే నినాదాలు కూడా మొదలయ్యాయి. ఇది అమెరికా-ఇజ్రాయెల్ కూటమికి ఒక రాజకీయ, మానసిక పరాజయం. గల్ఫ్ ప్రాంతంలో హౌతీ సంస్థలు, షియా మిలీషియాలు, హిజ్బుల్లా వంటి మిత్ర బలగాల నుండి ఇరాన్‌కి సంపూర్ణ మద్దతు, ప్రపంచ యావత్తు సంఘీభావం పెరగడం ట్రంప్, నెతన్యాహు కుట్ర పూరిత వ్యూహాలకు ఎదురు దెబ్బతీసింది.

స్వయంగా ఇజ్రాయెల్ ప్రజలే తమ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ప్రశ్నించటం ప్రారంభించారు. "ఇరాన్ మీద దాడులు ఆపండి, లేకపోతే మిమ్మల్నే ఎదుర్కొంటాం" అనే వాఖ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఉద్రిక్తతలతో 'అబ్రహాం ఒప్పందాలు' తారుమారయ్యే పరిస్థితి ఏర్పడింది. అమెరికా సైనిక స్థావరాలపై దాడుల భయంతో అరబ్ సర్కార్లే వెనక్కి తగ్గుతున్నాయి.

ఇక ట్రంప్ పాలనలోని అమెరికా ఘనత ఏమిటి? సైనిక దాడి చేసి, మరుసటి రోజే కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడమేనా? ప్రపంచానికి నిత్యం శాంతి , సుస్థిరత, అభివృద్ధి అని నీతులు చెప్పే ఇదే అమెరికా హిరోషిమా , నాగసాకి అనే రెండు జపాన్ పట్టణాలపై అణుబాంబులు వేసిన నీచ చరిత్ర ఉంది. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ మీద దాడుల పేరుతో లక్షల మంది పౌరులను చంపిన నర హంతకుల చరిత్ర ఉంది. ఇప్పుడు మాత్రం ఇరాన్ ఒత్తిడికి లొంగిపోయింది. కారణం స్పష్టమే అక్కడ ప్రజల ఒత్తిడి.

అమెరికా, ఇజ్రాయెల్ దేశాల్లో ప్రజల నిరసనలు, వ్యతిరేకతలు తీవ్రంగా వెల్లివిరిగాయి. యుద్ధం కొనసాగితే తమ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందని వారికి స్పష్టమైంది. అంతర్జాతీయంగా ఐరోపా దేశాలు, చైనా, రష్యా, ఇస్లామిక్ దేశాలూ అమెరికా చర్యలపై మండిపడ్డాయి. ఇదే పరిస్థితి కాల్పుల విరమణ ఒప్పందానికి దారితీసింది.

ఈ ఘట్టం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది: ప్రజలే చరిత్రను నిర్మిస్తారు.అవసరం అయితే మారుస్తారు. ఏ దేశాధిపతి దారుణమైన విధానాలను అనుసరించినా, ఆ మార్గం ప్రజలను చెలింప చేయగలదు. ఇది ఒక తాత్కాలిక మజిలీ మాత్రమే. అనేక మజిలీలు, విజయాల కోసం ప్రయాణం కొనసాగాలి. యుద్ధం చేయడమే సామ్రాజ్యవాద లక్షణమైతే, శాంతి కోసం పోరాడడమూ ప్రజాస్వామ్య లక్ష్యం. ప్రజలు కలిసివస్తే చరిత్రలో మార్పులు తప్పవు.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## సంకల్ప సిద్ధిరస్తు..!!

అడుగులు కదిపిన ప్రతి సంకల్పం
విజయపు బాటలో పయనించాలి
నమ్మకం కుదిరిన ప్రతి మనసు
కలుపుకుపోతూనే గెలిచి తీరాలి
గాలి బుడగ జీవితం పగలకముందే
సంకల్ప బలానికి వెన్ను తట్టాలి

మాట నిలకడ మీద నడుస్తూనే
నిశ్శబ్ద విజయానికి నాందీ చేయాలి
గురి తప్పని మనో వాంఛ సిద్ధికై
నిరంతరం అన్వేషణ సాగించాలి
ప్రయత్న లోపానికి కళ్లెం తొడిగి
పట్టుదలతో పిడికిలి బిగించాలి

అవరోధాలను చిరునవ్వుతో
నిరంతరం ఆస్వాదిస్తూనే
తరాలకు తరగని పేరు ప్రఖ్యాతిని
దిగంతాలకు ఎగసి వెళ్ళినా కూడా
పుట్టిన గడ్డపై సజీవంగా నిలబడాలి
ఆశీర్వదించే చేతుల నీడలోనే
జీవన సౌందర్యాన్ని పొందాలి

జనంసాక్షి

వెనుదిరగని ధృడ సంకల్పంతో
ముళ్ళు బాటను కూడా
పూల బాటగా మలుచుకోవాలి
అదిలించే తారతమ్యాలను నిరోధిస్తూ
ఒకే త్రాటిపై నమ్మకాన్ని నడపాలి
వెనక్కి లాగే శక్తులను దాటుకుంటూ
స్వయంప్రకాశివై వెలిగిపోవాలి

మమకారపు లోగిలి ముందు
మానవత్వపు తులసి మొక్కలా
ఎల్లప్పుడూ పూజింపబడుతుండాలి
సంకల్ప సిద్ధిరస్తు అంటూ
పదిమంది ఆశిస్సుల మధ్యలో
కాంతి పుంజమై మెరిసిపోవాలి

**నరెద్దుల రాజారెడ్డి**
**సెల్ : 9666016636**

## ఓ మానవుడా!




ఒకరివి
జాతి గొడవలు
మరొకరివి నేల గొడవలు
ఒకరివి భాష గొడవలు
మరొకరివి మత గొడవలు
ఇవి మానవుని హక్కులా?
కాదు మానవుని నాశనాలు
సృష్టి వినాశనాలు
జీవిని సృష్టించలేని మానవునికి
విశ్వ సృష్టి చేయలేని మానవునికి
లోకం మీద ఎలాంటి అధికారం లేదు
ఇది తెలియక నీవు అజ్ఞానంలో బ్రతకకు
ఇది తెలియక నీవు అంధకారంలో మునగకు
తప్పక చేసిన యుద్ధమే
వీర యుద్ధమవుతుంది
ధర్మ యుద్ధమవుతుంది
కాని అనవసర అహంకార యుద్ధం
మానవుని పతనమవుతుంది
ఓ మానవుడా!
ఎంత కాలమైంది నీవొకరిని ప్రేమించి?
ఎంత కాలమైంది నీవు సృష్టిని ఆస్వాదించి?
వీటిలోని మాధుర్యాన్ని నీవు మరువకు
మానసిక ప్రశాంతతని నీవు విడువకు
శాంతిని అన్వేషించే పరిపక్వత
నీలోనే ఉంది
మానవుడే మహనీయుడిగా
వెలిగిన చరిత్ర మనది
నీవు దిగజార్చి మూర్ఖుడవకు
నీవు యుద్ధం చేయకు
నీవే దగ్ధమవకు

జనంసాక్షి

**కోటం త్రిశూల్**
**8523005678**

# నిహారిక...

కథానిక



జనంసాక్షి

**బిఎస్ రాములు**
**8331966987**



**తెల తెలవారుతున్నది. నీహారిక తొందరగా లేచింది.** పక్కబట్టలు మడత పెట్టింది. నవారు మంచం ఎత్తి గోడ పక్కకు పెట్టింది. వాకిట్లోకి నడిచింది. అప్పటికే వీధి వాకిల్లు ఊడుస్తున్నారు. బకెట్ లో పేడ కలిపిన నీళ్లతో అలుకు (సాన్పు) చల్లుతున్నారు. పక్కింట్లో సుజాత బర్రె పాలు పిండుతున్న శబ్దం వినిపిస్తున్నది. ఇత్తడి పాల సర్వ నిండినట్టుంది. పాలు పిండుతున్న శబ్దం లయాత్మకంగా సంగీతంలా వినిపిస్తున్నది. బాత్రూంకు వెళ్లి బ్రష్ పేస్టు కోసం చూసింది నీహారిక. ఎందుకో చేయి వెనక్కి తీసుకుంది. ముందు అలుకు చల్లాలి అనుకుంది. ముహం మీద నీళ్లు చల్లుకుని బకెట్ తీసుకొని వాకిట్లోకి వచ్చింది. పక్కింటికి వెళ్లి పెండకడి తీసుకొని వచ్చింది. ఆ పెండ తాజాగా చేతులకు వెచ్చగా వుంది.

" పాలు పిండుడు ఇంకా అయిపోలేదా?" నవ్వుతూ పలకరించింది నీహారిక.

ఇత్తడి చిన్న సర్వ ఇంటిలో పెట్టి కొంగుతో ముఖం తుడుచుకుంట వచ్చింది సుజాత.

"పాలు పిండటానికి మిషిన్లు వచ్చినయంటివి గదనే ! ఎపుడు చూపిస్తవు? ఎపుడు తెప్పిస్తవు?" అంటూ దూడను తల్లి పాలకోసం తనుగు విప్పింది సుజాత.
దూడ చెంగున దుంకుతూ తల్లి పొదుగు కుమ్మింది.

"నేను కూడ చెప్పంగ విన్న ముచ్చటనే! చూడలేదు. ఆ మిషన్లు మనకు పల్లెల పనికస్తయో లేదో కూడ చూడాలె. ఈ సారి మీటింగుకు పోయినపుడు అన్ని వివరాలు తెలుసుకుంట" అంటూ పెండకడి తీసుకొని ఇంటివైపు నడిచింది. ఇంటి ముందున్న నల్లా నీల్లు బకెట్లో పట్టింది. పేడ కలిపింది. అలుకు చల్లింది. కాల్లు చేతులు కడుక్కొంది. టూత్ బ్రష్ వేసుకొని ముఖం కడుక్కొని వచ్చి వాకిట్లో చక్కని ముగ్గు వేసింది. ఆ మధ్య ఓసారి ముగ్గుల పోటీలో నీహారిక ప్రైజ్ కొట్టేసింది. దాంతో తన ప్రతిభ చూపే తీరొక్క ముగ్గులు వేస్తుంది నీహారిక.

ఇల్లు ఊడ్చి తుడిచింది. స్నానం చేసి జుట్టు తల నీళ్ళు సుతారంగా టవల్ తో తుడుచుకుంది. మంచి చీర వెతికి తీసుకుని కట్టుకుంది. నొసట చిన్న బొట్టు బిల్ల పెట్టుకుంది. సుజాత తాజా పాలు తొమ్మిదేండ్ల బిడ్డతో పంపింది.

" నిన్న సార్లందరు వచ్చిన్రా దివ్యా?" పాలు గిన్నెలో పోసుకుంటూ అడిగింది నీహారిక.
"ఇద్దరు సార్లు బస్సు లేట్ గ వచ్చిందని లేట్ గ వచ్చిన్రు. రజని మేడం రాలేదు. లీవు పెట్టిందట!" అంది దివ్య. దివ్య నాలుగో తరగతి చదువుతున్నది.

నీహారిక చాయ్ చేసుకుంది. ప్లాస్కులో పోసి పెట్టి మూత పెట్టింది. ఎవరైనా వస్తే మల్లా చాయ్ పెట్టడం కుదరదని ఫ్లాస్కులో పోసి రెడీగ పెట్టుకుంటుంది నీహారిక.

అరుగు మీద కుర్చీలో కూర్చుని చాయ్ తాగుతూ ఏదో ఆలోచనలో పడింది నీహారిక.

రెండిండ్లవతల ముసలమ్మ మూలుగు వంటి ఏడ్పు సన్నగా వినపడుతున్నది. అది విజయత్త ఏడుపు.

విజయత్తకు ఏదో ఒక పరిష్కారం చూపాలె అనుకుంది. ఎవరికో ఫోన్ కలిపింది. సమస్య వివరిస్తూ కొంచెం సేపు మాట్లాడింది నీహారిక.

"నన్నడిగితే సీనియర్ సిటిజన్నుకు ఊరికో ఆనందనిలయం పెట్టాలె. ఆసరా పథకం నగదు తీసుకునెటోల్లు నగదు తీసుకుంటరు. అవసరం ఉన్నోళ్లు ఆనంద నిలయంలో ఉంటరు. అంతేగాని రెండు వేల రూపాయలు ఇవ్వంగనే అయిపోతదా? ముసలోల్ల ఆలనా పాలనా ఎవరు చూడాలె?" అంది నీహారిక.

"మీవన్నీ ఆదర్శ భావాలు మేడమ్! మీ సూచన కరెక్టు . జిల్లా పరిషత్ మీటింగ్ కు ఇంచార్జి మినిస్టర్ వచ్చినపుడు గ్రౌండ్ రియాలిటీ చెప్పి ఊరికో ఆనంద నిలయం పెట్టాలని చెప్పండి" అన్నాడు సుధీర్.

"ఆనంద నిలయం, అంగన్ వాడి స్కూలు పక్క పక్కనే వుండాలి. పిల్లలకు, ముసలోల్లకు మంచిగ టైంపాస్ అయితది. ముసలోల్లకు పిల్లలంటే చాలా ఇష్టం వుంటది. అట్లే ఆనంద నిలయంల కుట్టు పని , ఇస్తార్లు కుట్టుడు, వంటి అల్కటి పనులు చేసుకునే ఏర్పాటు చేయాలె." అంది నీహారిక.

నీహారిక చెప్పులు వేసుకొని ఫ్లాస్కు తీసుకొని విజయత్త ఇంటికి బయలు దేరింది

అప్పటికి పారిశుధ్య కార్మికులు రోడ్లు ఊడుస్తున్నారు. పశువులు ఒకటొకటి బయటకు వస్తున్నాయి. గౌడులిద్దరు. మోకులు తీసుకొని తాల్లెక్కడానికి సైకిల్ల మీద బయలు దేరారు.

"విజయత్తా! లేసినవా?" అంటూ ఇంటిలోకి నడిచింది నీహారిక.

విజయమ్మ మూలుగుతున్నది. రాత్రి వంట చేసుకున్నట్టు లేదు.
" అత్తా ! ఇట్ల వంట చేసుకోక ఉపాసం ఉంటే ఎట్ల? నేను ఒక్క దాన్నే ఉంటి.
మా ఇంటికి రావద్దా? నేను దూరపు దాన్నయిపోయిన్నా? నువ్వొస్తే ఇద్దరం వండుకొని తిందుంటిమి గద."

"రాత్రంతా కడుపు పిసుకుతున్నదే. నిద్ర వడుత లేదు. తింటె అరుగుత లేదు" మెల్లిగా మంచంలోంచి లేచి కూర్చుంది విజయమ్మ.ఫ్లాస్కులోంచి ఓ కప్పులో చాయ్ పోసి " కొంచెం చాయ్ తాగు" అని అందించింది.

"కొడుకుల దగ్గరికి పొమ్మంటే పోవు. నా ఇంట్ల నేనుంట అంటవు" నిష్టూరంగా అంది నీహారిక.

"ఏందోగని ! సిటీల ఎక్వ రోజులు ఉండబుద్దికాదు. ఊరి మీదికి పానం కొట్టుకుంటది. కష్టపడ్డ చేతులు. ఉత్తగ కూసుండి తినబుద్ధి కాదు. కొడుకు కోడలు డ్యూటీకి పోయిరి.
మనుమలు బడికి పోయిరి. ఎవల పని మీద వాల్లు పోతరు.. తలుపులేసుకొని ఒక్కదానికి ఉండబుద్ది కాదు. అక్కడ గాలి ఆడనట్టనిపిస్తది. "

"అట్లని ఇక్కడ ఉపాసాలుండుకుంట పానం మీదికి తెచ్చుకుంటవ? నీ కోసం ఆనంద నిలయం వాల్లతోటి మాట్లాడిన. రమ్మన్నారు. అక్కడ నీ లాంటోల్లు యాభయి అరవై మంది ఉంటరు. మంచిగ టైంపాసైతది. అన్ని యాల్లకు పెడుతరు. ఏ పని చేయనక్కర లేదు. ఓపికుంటే కూరగాయలు కోసియ్యవచ్చు. చిక్కుడు కాయ నార తీయవచ్చు". అంది నీహారిక.

"కొడుకు కోడలు మా పరువు తీస్తవా ఏందే? దిక్కు లేనట్టు వద్దాశ్రమంల ఉంటవా? ఉంటే మాతోటి వుండు. లేకపోతే ఇంటికాడ వుండు అనవట్టిరి. ఆల్ల పరువు పోతదంట నేను ఆశ్రమంల వుంటె. ఏంజెయ్యాల్నే? నడుమ నా సావుకు వచ్చింది" బాధ వెళ్ల బోసుకుంది విజయమ్మ.
" బావతో, అక్కతో మాట్లాడుత. లోకం మారుతున్నది. పాత భావాలు మారాలె. ఆశ్రమంలో వుంటే ఎక్కడికి పోతున్నవు. వారానికోసారి ఇంటికి వచ్చి పోవచ్చు. వాల్లే చూసుటానికి రావచ్చు. ఎవరు వద్దంటరు? "

అంటూ ఫోన్ కలిపింది నీహారిక. వాల్లను ఒప్పించి ఫోన్ మాట్లాడుమని విజయత్తకిచ్చింది. విజయమ్మ మాట్లాడి సరే అంది.
చాలా రోజులుగా నానుతున్న సమస్య పరిష్కారమైనట్టు నీహారిక దీర్ఘంగా నిట్టూర్చింది.

**విజయత్త జీవితం గురించి ఆలోచిస్తూ రోడ్ మీద నడుస్తోంది నీహారిక.**

విజయత్తకు ఇద్దరు కొడుకులు ఒక బిడ్డ. బిడ్డ టీచర్ పని చేస్తున్నది. పెద్ద కొడుకు పూనాలో ఏదో పెద్ద పనే చేస్తున్నడు. చిన్నకొడుకు బాగానే చదువుకున్నాడు గానీ అనుకున్న ఉద్యోగం రాలేదు. కొడుకు కోడలు చెరో పని చేస్తున్నారు. అందరికీ పిల్లలయ్యారు. అందరూ సంతోషంగా బతుకుతున్నారు. విజయత్తమ్మను అందరు తండ్రి పోయిన తరువాత తమ దగ్గరనే వుండుమన్నారు. జీవితమంతా కష్టపడి పిల్లల్ని పెంచి పెద్ద జేసింది. అందరి పెండ్లిల్లు చేసింది.

ఐదెకరాల పెరడుంటే తోట చేసింది. తెల్లారకముందే తోట కాడికి పోతుండె. నీళ్లు పెడుతుండె. కూరగాయలు పండిస్తుండె. లచ్చన్న మామ సైకిల్ మీద పోయి అమ్ముకస్తుండె. లచ్చన్న మామ బయటి పనులు అన్ని చేస్తుంటె, ఇంటి పనులు, తోటపని, పిల్లల చదువులు, వంటలు, పండుగలు అన్ని పనులు విజయత్తమ్మే చూసుకుంది. బిడ్డ సరిత తన తీరుగ బీడీలు చేసుకుంటనే చదువుకుంది. సరిత తనతోటే బీఈడి కూడ చేసింది. సరితకు తొందరగనే టీచర్ ఉద్యోగం వచ్చింది. కాలం గడిచి ఒక కుటుంబం మూడు కుటుంబాలైనయి. విజయత్తది మరో కుటుంబం. అందరు మంచిగ బతుకుతున్నారు.

"మంచిగనే బతుకుతున్నారు గాని చెట్టుకొకరు పుట్ట కొకరైరి" అని విజయత్త బాధ. యాభయి ఏండ్లల్ల ఎండాకాలం తప్ప ఎప్పుడు విశ్రాంతి అనేది లేకుండ పని చేసింది విజయమ్మ. ఎండాకాలం కూడ ఉత్తగ కూసోకుండ మోతుకాకు తెచ్చి విస్తార్లు కుడుతుండె.

"నమస్తే మేడమ్! అని పలకరించడంతో ఆలోచన కట్టిపెట్టి పారిశుధ్య కార్మికురాలు మహాలక్ష్మిని చూసి ప్రతి నమస్కారం చేసింది నీహారిక.

బర్రెలు మందకు బయలుదేరినై. బడి పిల్లలు బడికి బయలుదేరుతున్నారు. పెద్ద పిల్లలు పక్కూరులో పదో తరగతి చదువుతున్నారు. బస్ కోసం చూస్తున్నారు. కొందరు విష్ చేస్తున్నారు.
"అక్కా! మన ఊర్లెనే పదవ క్లాస్ పెట్టియ్యాలె. అది నీ హయాంలనే కావాలె. నీ తోటి అయితది" నవ్వుతూ పలకరించింది తేజస్వి.
"తప్పకుండా చేద్దాం. పర్మిషన్ మాఇస్తారుగానీ స్టాఫ్ నివ్వరు. విద్యా వలంటీర్లను పెట్టాలె. సరె చూద్దాం" అంది నీహారిక.

"నువ్ కూడ చెప్పవచ్చు గద అక్కా? వేరే ఎవలెందుకు? " అని చనువుగా అంది తేజస్వి.
"సరే ! తప్పక చెప్త. ముందు క్లాస్ రూం కట్టించాలె గద" అంటూ ముందుకు నడిచింది.
సఫాయి కార్మికురాలు మహాలక్ష్మి మర్యాదపూర్వకంగా నీహారిక వెంట నడిచింది.

"మహా లక్ష్మీ! ఈ నెల రేషన్ కార్డు బియ్యం తీసుకున్నవా?"
"తీసుకున్న మేడమ్"

"కొందరు బియ్యం దొడ్డుగున్నయని పది పదిహేను రూపాయలకు అమ్మి సన్న బియ్యం కొనుక్కున్రట! పైసలెక్కువైనయా? వెనకట అన్ని దొడ్డు బియ్యమే గద! అసలు వరి అన్నమే కషంగ ఉండెనట! మక్క గడుక తిన్నరట . మా నాయన చెపుతుండె!"
" నిజమే మేడమ్. మేం మొనటి దాక మక్క గడుకనే తిన్నం. ఎవరో రేషన్ బియ్యం అమ్ముకుంటే అందరికి బదునాం రావట్టే. బియ్యం మంచిగున్నయి. అన్నం మంచిగ ఎదుగుతది" అంది మహా లక్ష్మి.

" మాలచ్మీ! గీ చెత్తకుప్ప ఇక్కన్నుంచి తియ్యే" అంటూ ఆ చెత్తలో మరింత చెత్త పోస్తూ పిలిచింది ఈశ్వరమ్మ.
"సరేనమ్మ! ఉంట మేడం" అంటూ ఆగిపోయింది మహా లక్ష్మి.
గుడిసె హెూటల్లో టిఫిన్ చేస్తూ చాయ్ తాగుతున్నవారల్లా నీహారిక రావడంతోటి లేచి నిలబడ్డట్టు చేసి పలకరించారు. మోరి నీల్లకు చీర కుచ్చిల్లు కొంచెం పట్టుకొని అడుగులేసింది.

**అక్కా! గీ మోరి నీళ్లు రోడ్డు మీద పారుతున్నయి. మోరి కట్టియ్యాలె" అన్నారిద్దరు.**
" అవును మీరు రోడ్డుమీద పారవోసి రోడ్ పాడు చెయ్యాలె. మేం మోరి కట్టియ్యాలె. రెండు పాత బకెట్లు లేకపోతే అంపుల గోలెం పెట్టి సాయంత్రం తీసుకపోయి మోరిలో పోయాల్నని ఎన్ని సార్లు చెప్పిన. మన ఊరు మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలి" అని హితబోధ చేసి ముందుకు నడిచింది నీహారిక.
చాకలమ్మ మాసిన బట్టలు తీసుకొని వస్తూ కనిపించింది.
" నీరజా! తల్లిగారింటి నుండి ఎపుడు వచ్చినవు?" అంటూ చాకలమ్మ నీరజను పలకరించింది నీహారిక.
" మొన్న ఆదివారం వచ్చి తోల్కచ్చుకున్నడు మీ తమ్ముడు" అంటూ నవ్వింది నీరజ.
**" ఇపుడు ఎన్నో నెల?"**
**" ఆరోనెల అక్కా! "**
**" నెల నెల మందులు వాడుతున్నవా? "**
**" వాడుతున్న అక్క."**
**" కొంచెం మంచి తిండి తినాలె"**
**" ఏడి కెల్లి మంచి తిండి. అందరు పెట్టిందే ! గదే తిండి. పని చేసి చేసి అందరికి ఉతికిన బట్టలిచ్చి ఇంటికి పోయినంక వంట చేసుడు చాతగాదక్కా! "** బాధ వెల్ల బోసుకుంది నీరజ. తల్లి గారింటి కాడ కొంత రెస్టు దొరుకుతుందనుకుంటే పదిరోజులకే తోల్కచ్చె అంటూ వాపోయింది.
నీహారికకు ఏం చెప్పాలో తోచ లేదు.

(తరువాయి భాగం రేపటి సంచికలో..)

# కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల విచారణ వేగవంతం చేయాలి



**రేషన్ షాపులను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి**

**పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష**

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 26(జనంసాక్షి) :** కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ధాన్య సేకరణ, సిఎంఆర్ డెలివరీ, రేషన్ పంపిణీ, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు, పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య , జిల్లా సివిల్ సప్లై శాఖ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. 2023-24 రబీ సీజన్ కింద సిఎంఆర్ (సీఎంఆర్) కింద బియ్యం పట్టడం 94 శాతం లక్ష్యం పూర్తయ్యిందని, మిగిలిన 6 శాతం సిఎంఆర్ పూర్తి చేయాలని సివిల్ సప్లై అధికారులు తెలిపారు. తొమ్మిది మిల్లుల నుండి సరఫరా కావలసిన సిఎంఆర్ తక్షణమే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.. 2024-25 ఖరీఫ్, రబీ సీజన్లలో సిఎంఆర్ డెలివరీ లక్ష్యాలపై ప్రణాళికలు ముందుగానే వ్యూహాత్మక గా రూపొందించుకోవాలని, కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇప్పటివరకు రైతుల నుండి మొత్తం 1,47,290 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని ఈ సందర్భంగా సివిల్ సప్లై శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలోనే డబ్బులు వారి వారి బ్యాంకు కలలో జమాయినట్లు అధికారులు వివరించారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ విధానం ఎలా సాగుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి నాణ్యమైన బియ్యం అందించాలని అన్నారు. ప్రజా పాలన, మీ సేవా కేంద్రాల ద్వారా అందిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులపై విచారణ తక్షణమే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అసలైన లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా కార్డులు జారీ చేయడం అత్యవసరం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీటీ సివిల్ సప్లై అధికారులు, రేషన్ షాపులను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలనీ, నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న షాపులపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులు సమయానికి అందేలా పర్యవేక్షణ మరింత మెరుగుపర్చాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు, విద్యాశాఖతో సమన్వయంతో గ్యాస్ కనెక్షన్ల కోసం అవసరమైన డాక్యుమెంటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, జిల్లా సివిల్ సప్లై అధికారిని బాల సరోజ, సివిల్ సప్లై మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోట్ల పోకడ




**బిల్డింగ్ ఫండ్ పేరుతో ఇష్టారీతిన వసూళ్లు**

- నిబంధనలకు విరుద్ధంగా సభ్యుల చేరికలు, తీసివేతలు
- వసూలు చేసిన డబ్బుకు లెక్కలు అడిగే వారే కరువాయె!
- కలెక్టర్ పర్యవేక్షణా లోపంతో ఏం చేసినా చెల్లుబాటు
- ఖమ్మం జుబ్లీక్లబ్‌కు రెండేళ్లుగా ఎన్నికలు లేవు
- దశాబ్దాలుగా పాతుకుపోయిన ఉద్యోగులకు స్థాన చలనమే లేదా..?
- జాబిల్లిగా మారిన జుబ్లీ తీరుపై విచారణ నిగ్గు తేలేదెప్పుడో..?

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనంసాక్షి)**

చల్లని వెన్నెల కురిపించే ఆ జాబిల్లిలోనూ "మచ్చ" ఉంటుందన్న సంగతి అందరికీ తెలిసిందే. ఖమ్మంలోని జూబ్లీ క్లబ్ తీరు కూడా జాబిల్లి చందంగానే మారింది. అందులో ఓ "పోట్ల" గిత్త పోకడకు అడ్డు అదుపు లేకుండా పోయింది. రెండేళ్లకోసారి జరగాల్సిన ఎన్నికలు గాడి తప్పడంతో జూబ్లీ క్లబ్ పాలకవర్గ పోకడ పొగరెక్కిన "పోట్ల" గిత్తను మించి కనిపిస్తోంది. బిల్డింగ్ ఫండ్ పేరుతో వసూలు చేసిన డబ్బులకు లెక్కా పత్రం లేకుండా పోయింది. తమకు అనువుగా ఉన్న వారిని సభ్యులుగా చేర్చుకోవడం, ప్రశ్నించే వారిని తొలగించడం ఇక్కడ ఆనవాయితీగా మారిపోయింది. ఇక క్లబ్లో పని చేసే ఉద్యోగులు దశాబ్దాల పాటు పాతుకుపోయి ముదురు కంకెలుగా మారిన తీరు జూబ్లీ క్లబ్ నిర్వహణపైనే నీళ్లు నీడలు అనుముకునేలా చేశాయి. ఈ వ్యవహారాలపై అధికారిక విచారణ ఏ కొలిక్కి చేరిందో అంతు చిక్కడం లేదు.

పెద్దల సభగా చెప్పుకునే రాజ్యసభ మాదిరిగా ఖమ్మం నగరంలో ప్రముఖులుగా పేరుపొందిన ధనికులు, ప్రముఖులు సభ్యులుగా ఉండే క్లబ్ గా ఖమ్మం జూబ్లీ క్లబ్ కు పేరుంది. ఈ జూబ్లీ క్లబ్లో సభ్యత్వం అనగానే ఎవరైనా ఎంతో ఆశగా ప్రయత్నిస్తారు. అలాంటి ఈ జూబ్లీ క్లబ్ ఇప్పుడు చెప్పుకోవడానికి అలవి కాని క్లబ్ గా మారిపోయింది. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఎక్స్ అఫీషియల్ చైర్మన్ గా ఉండే ఈ క్లబ్ నిర్వహణపై నీలి నీడలు అలుముకున్నాయి. సకాలంలో ఎన్నికలు జరగకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పకనే చెప్పవచ్చు. ప్రతి రెండేళ్లకోసారి ఎన్నికలు జరగాల్సిన జూబ్లీ క్లబ్ కు గడిచిన రెండేళ్లుగా ఎన్నికల నిర్వహణ లేకుండా పోయింది. కరోనా సమయంలో క్లబ్ కు కార్యదర్శిగా పని చేసిన పోట్ల శ్రీకాంత్ మూడేళ్లు సెక్రటరీగానే కొనసాగడు.రెండేళ్ల కాల పరిమితి పూర్తి అయినప్పటికీ కరోనా కారణంగా మరో ఏడాది సెక్రటరీగా ఆయనను పొడిగించారు. కరోనా గడ్డుకాలం గట్టెక్కి ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ జూబ్లీ క్లబ్ కు ఇంకా ఎన్నికలు నిర్వహించకపోవడమే శోచనీయంగా కనిపిస్తోంది. కలెక్టర్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా జడ్జి, జడ్పీ చైర్పర్సన్ దీనికి గౌరవ ఉపాధ్యక్షులుగా ఉంటారు. ఇలాంటి ప్రముఖులు పర్యవేక్షణలో నిర్వహణ కొనసాగాల్సిన జూబ్లీ క్లబ్ ఇప్పుడు ఆలనా పాలన లేకుండా మారిపోయింది. ఇంకా పోట్ల గిత్త పోకడలోనే మగ్గుతోంది. దీనికి కారణాలు ఏంటనే అంశంపై జూబ్లీ క్లబ్ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది.



**వసూలు చేసిన డబ్బులు ఎటు పాయే...?**

పదవీ కాలం పూర్తయినప్పటికీ జూబ్లీ క్లబ్ కు సెక్రటరీగా పని చేసిన పోట్ల శ్రీకాంత్ ఒంటెద్దు పోకడ క్లబ్ లో మెజారిటీ సభ్యులకు జీర్ణించుకోలేని పరిస్థితిగా మారిపోయింది. బిల్డింగ్ ఫండ్ పేరుతో వసూలు చేసిన లక్షల కొద్ది డబ్బు లెక్క పత్రాలపై తాజాగా నీలి నీడలు అలుముకున్నాయి. ఈ ఫండ్ పేరుతో వసూలు చేసిన డబ్బులు ఎంత..? అవి ఏ ఖాతాలో జమ చేశారు.? అనే అంశాలపై స్పష్టత లేకపోవడంతో సభ్యుల్లో గందరగోళ స్థితి నెలకొంది. జూబ్లీ క్లబ్ లో 3 వేల మంది సభ్యత్వం కలిగి ఉంటారు. కాగా బిల్డింగ్ ఫండ్ పేరుతో 370 మంది సభ్యులను చేర్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో చాలా కాలం నుంచి కొనసాగుతున్న సభ్యులను కొందరిని తొలగించి తన ఆధిపత్య ధోరణిని పోట్ల చాటుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తనకు వ్యతిరేకంగా ఉన్న, ప్రశ్నించే తత్వం కలిగిన సభ్యులను నిరంకుశంగా తొలగించి వేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి డిసిఓ కు ఫిర్యాదులు సైతం అందినప్పటికీ దీనిపై తుది ఫలితం ఇంకా తేలలేదు. విచారణకు సంబంధించిన నివేదిక జిల్లా కలెక్టర్ కు అందినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ చర్యలు మాత్రం శూన్యంగా మారాయి.

**పాతుకుపోయిన ఉద్యోగులు..**

ఏ ఉద్యోగి అయినా ఒకే చోట ఎక్కువ కాలం పని చేస్తే అవినీతికి, అక్రమాలకు పాల్పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఈ కారణంగానే ఉద్యోగులకు స్థానాచలనం తప్పనిసరిగా చేయాల్సిన అవసరం ఉంది. కాగా ఖమ్మం జూబ్లీ క్లబ్లో మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఉద్యోగులు ఇంకా తిష్ట వేసుకుని కూర్చోవడం విస్మయం కలిగిస్తోంది. ఒకరిద్దరి మినహా దాదాపు ఉద్యోగులంతా 30 ఏళ్లకు పైగా ఇదే చోట పని చేస్తున్నట్లు స్పష్టమవుతుంది. వీరి వేతనాల చెల్లింపు విషయం కూడా వివాదాస్పదంగా మారింది. గతంలో క్లబ్ చైర్మన్ చెక్కుపై సంతకం చేస్తేనే వీరికి వేతనాల చెల్లింపు జరిగేది. తాజాగా ఈ వ్యవహారం రాంగ్ రూట్లో చెల్లింపులకు దారి తీసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే నిబంధనల ప్రకారం బార్ అండ్ రెస్టారెంట్లో సభ్యులకు మాత్రమే ప్రవేశ అనుమతి ఉంటుంది. కానీ బయట వ్యక్తులు కూడా ఇష్టారీతిన లోపలికి వచ్చి వెళుతున్నట్లు స్పష్టమవుతుంది. మొత్తం మీద జూబ్లీ క్లబ్ నిర్వహణ తీరుతెన్నులపై జిల్లా కలెక్టర్ కాస్త అలసత్వం ప్రదర్శిస్తున్న కారణంగా క్లబ్ నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా మారిపోయింది. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని క్లబ్బును చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**మల్దకల్ జూన్ 26 (జనంసాక్షి)** మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నర్సింహులు అన్నారు. గురువారం మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఒకటి రెండు ఆధ్వర్యంలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంపై మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులు గుర్తించి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. మత్తుపదార్థాలు అమ్మే వారి గురించి సమాచారం అందించడం పౌరుల బాధ్యతగా పేర్కొన్నారు. డ్రగ్స్ బారిన పడిన యువతకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. 17-18 ఏళ్లలోపు యువత డ్రగ్స్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్నందున, ఈ దశలో వారికి సరైన మార్గదర్శకం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి, శారీరకంగా-మానసికంగా బలంగా ఉండాలని సూచించారు.మత్తు పానీయాలు,సిగరెట్లు,గుట్కాలు, గంజాయి వంటివి యువత ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు యువత ముందుకు వచ్చి సమాజానికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఓ రామాంజనేయులు గౌడ్, అధ్యాపకులు గోవర్ధన్ శెట్టి, మాధురి,బాలకృష్ణ,నీలవేణి, సుధాకర్ టీచింగ్ స్టాఫ్ శ్రీనివాసులు, హనుమంతు విద్యార్థులు పాల్గొన్నారు.

# నిఖార్సైన జెండామోసిన కార్యకర్తలకే పదవులు దక్కాలి

**కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా అంకితభావంతో పనిచేశా**

**డిసిసి పదవి ఇవ్వాలని అధిష్టానానికి డి కిరణ్‌కుమార్ అభ్యర్థన**

**వనపర్తి బ్యూరో జూన్ 26 (జనంసాక్షి) :** నిఖార్సైన జెండా మోసిన కార్యకర్తలకే పదవులు దక్కాలని,కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా అంకితభావంతో పనిచేశానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి. కిరణ్ కుమార్ అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జిల్లా అధ్యక్షుల ఎన్నికను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేపట్టారు. అందులో భాగంగా జిల్లా నాయకుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.అందులో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని కెడి ఆర్ నగర్ లోని ఆయన నివాస గృహంలో గురువారం నాడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డి. కిరణ్ కుమార్.మాట్లాడుతూ వనపర్తి జిల్లా నుంచి జిల్లా అధ్యక్ష పదవీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. క్రమశిక్షణ అంకితభావంతో కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన నికాసైన కార్యకర్తన్నారు.వనపర్తి డిసిసి అధ్యక్షుడు పదవికి తాను అర్హుడినని నిఖార్సైన సీనియర్ కోర్ కాంగ్రెస్ కార్యకర్తగా నిబద్ధతతో పనిచేశానని, అధిష్టానం గుర్తించి తనకు డిసిసి పదవి ఇవ్వాలని మాజీ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీకి తాను విధేయుడిగా నిబద్ధతతో పనిచేశానని, పార్టీ అధికారంలో ఉన్న లేకపోయిన కష్టకాలంలో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డానని తెలిపారు. వనపర్తి డిసిసి అధ్యక్షుడు పదవికి తాను అర్హుడినని డిసిసి అధ్యక్షుడిగా తనకు పదవి ఇవ్వాలని పార్టీకి ప్రజలకు మరింత సేవ




చేయడానికి తాను ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ నిఖార్సైన కార్యకర్తలకే పదవులు దక్కాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గవర్నమెంట్ ప్లీడర్ గా ఉన్నానని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి పదవి కోసం గవర్నమెంట్ పదవికి రాజీనామా చేస్తానని ఖారాఖండిగా తేల్చి చెప్పారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, పార్టీ ఇంచార్జ్ లకు పెద్దలను అందరిని అభ్యర్థిస్తున్నానని, డిసిసి పదవి అభ్యర్థిగా తనకు మద్దతు తెలిపి ప్రజలకు సేవ చేయడానికి ఒక అవకాశం కల్పించాలని పత్రికాముఖంగా కాంగ్రెస్ పార్టీ నాయకులను అభ్యర్థిస్తున్నాని తెలిపారు.

# అవినీతి అధికారులే.. ఆరోపణలు చేయడం విడ్డూరం

**నిజాలు వెలుగులోకి తెస్తే బెదిరింపులకు దిగుతారా?**

**జిహెచ్ఎంసిఉన్నతాధికారులకు జర్నలిస్టు సంఘాలు ఫిర్యాదు**

**ఖైరతాబాద్, జూన్ 26 (జనం సాక్షి) :** ఇటీవల జనంసాక్షి ప్రచురించిన వరుస కథనాల నేపథ్యంలో జిహెచ్ఎంసి సర్కిల్ 18 అసిస్టెంట్ సిటీ ప్లాన్ (ఏసీపీ) టౌన్ ప్లానింగ్ ఇంజ శ్రీనివాస్ విలేకరులపై సోషల్ మీడియాలో హెచ్చరిక పోస్టులు పెట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం నాయకులు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు విలేకరులైన కుల్ల రవీందర్, కిరణ్‌గౌడ్‌లనుద్దేశించి తప్పుడు ఆరోపణలు చేస్తూ


జర్నలిస్టు సంక్షేమ సంఘం
Telangana Journalists Sankshema Sangham

పాత్రికేయుల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా వ్యవహరించారు. దీంతో పలువురు జర్నలిస్టులు జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వాట్సప్‌లో అవమానపరిచేలా వ్యవహరించడంపై విచారణ జరపి, టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారం రోజుల క్రితం కూడా ఆయన లిఖితపూర్వక ఫిర్యాదు చేశారని, వార్తా కథనాలను భరించలేక ఆక్రోశంతో విలేకరులను నిందించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వివరణ ఇవ్వకుండా మీడియాపై వ్యక్తిగత కక్షతో ఎదురుదాడికి దిగడం ఓ ఉన్నతాధికారికి భావ్యమేనా అని వినతిలో పేర్కొన్నారు. ఏవైనా ఇబ్బందులుంటే పైఅధికారులకు చెప్పి సమస్యలు పరిష్కరించుకోవాలిగానీ వ్యక్తిగత పోకడలకు పోవడం, నకిలీ విలేకరులని బద్నాం చేయడం ఏంటని అడిగారు. కొందరితో ఒకలా, ఇంకొందరితో మరోలా ప్రవర్తించడం సమంజసమేనా అని లేఖలో తెలిపారు. అక్రమ నిర్మాణాలను అరికట్టలేక సీజ్ చేసిన కొన్ని బిల్డింగులను వెంటనే సెటిల్మెంట్ చేసుకుని, అన్‌సీజ్ చేస్తున్న ఏసీపీకి ఇప్పటివరకు మెమోలు జారీచేయకపోవడం విడ్డూరంగా మారిందని వినతిలో గుర్తుచేశారు. ఇకనైనా సర్కిల్ 18లో జరుగుతున్న తతంగాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఏసీపీ చేస్తున్న అవినీతిలో ఎంతవరకు నిజమనేది తేల్చాల్సిన అవసరం ఉందని కోరారు. అవినీతి అక్రమ కట్టడాలను వెలుగులోకి తెస్తున్న రిపోర్టర్ల పట్ల కక్షపూరితంగా వ్యవహరించకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం నాయకులు, జీహెచ్ఎంసీ వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌గౌడ్, జనరల్ సెక్రటరీ కీర్తి రాజు, ట్రెజరర్ సతీష్, కుల్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైలు పట్టాలపై కారు నడిపిన యువతి

**శంకర్‌పల్లి జూన్ 26(జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున 6 గంటలకు కొండకల్ రైల్వే గేట్ నుంచి బుల్కాపూర్ చిన్న శంకర్పల్లి మీదుగా శంకరపల్లి రైల్వే స్టేషన్ వరకు సుమారు 7 కిలోమీటర్లు రైల్వే పట్టాలపైనే కారు నడిపి తీవ్ర సంచలనం రేపింది. ఆమె నిర్వాకంతో పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. అప్రమత్తమైన రైల్వే గేట్మెన్ శంకర్పల్లి స్టేషన్ మాస్టర్ కు సమాచారం అందించగా స్టేషన్ మాస్టర్ ఆ ట్రాక్ గుండా వెళ్లే రైలు నిలిపివేశారు. సమాచారం అందుకున్న శంకర్పల్లి పోలీసులు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చాకచక్యంగా పట్టాలను క్రాసింగ్ చేయడంతో కారు శంకర్పల్లి రైల్వే స్టేషన్ సమీపంలోకి వచ్చి ఆగిపోయింది. కారు అద్దాలను పగలగొట్టి యువతిని అదుపులోకి తీసుకొని పట్టాలపై ఉన్న కారును ప క్కకు తోసివేశారు. రెండు గంటల పాటు సాగిన ఈ హై డ్రామాకు స్థిరపడడంతో శంకర్పల్లి పోలీసులతో పాటు రైల్వే పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.





**లక్నో నగరానికి చెందిన యువతి**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో నగరానికి చెందిన విజయలక్ష్మి సుధీర్ కుమార్ ల కూతురు ఓమికా సోని (34) నగరంలోని పుప్పాలగూడలో గల హిల్ క్రెస్ట్ అపార్ట్మెంట్లో 2019 సంవత్సరం నుంచి ఉంటుంది. ఆమె క్యాప్ జెబినీ కంపెనీలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పని చేస్తూ సుమారు నెలకు రూ. 1.50 లక్షలు సంపాదిస్తూ జీవించేది. అయితే ఆమెకు 2022 సంవత్సరంలో భర్తతో విడాకులు కాగా అప్పటినుంచి ఆమె ఒంటరిగానే జీవిస్తుంది. మూడు నెలల క్రితం ఉద్యోగం పోవడంతో ఆమె ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు ఉందని సమాచారం. రెండు నెలల నుంచి తమతో సైతం ఫోన్లో కూడా మాట్లాడకుండా మతిభ్రమించినట్లు వ్యవహరిస్తుందని తల్లిదండ్రులు వాపోయారు. అయితే ఆమె గురువారం తెల్లవారుజామున తన కియా సోనేట్ (టీ ఎస్ 07కే బీ 1604) నెంబర్ గల కారులో రింగ్ రోడ్డు పైనుంచి నాగులపల్లి మీదుగా శంకర్పల్లి మండలం కొండకల్ గ్రామానికి ఉదయం 6:50 కి వచ్చింది. కొండకల్ రైల్వే గేటు వద్ద కారుతో వెళ్తున్నా ఆమె కారును రైలు పట్టాలు ఎక్కించి శంకర్పల్లి రైల్వే స్టేషన్ సమీపం వరకు రాగా అప్పటికే సమాచారం అందుకున్న రైల్వే అధికారులు పట్టాలను క్రాసింగ్ చేయగా కారు ముందుకు వెళ్లకుండా ఆగిపోయింది. ఈ క్రమంలో ఆమె తన వద్ద ఉన్న నాన్ చాక్ చూపుతూ బెదిరించింది. ఆమె స్వతహాగా మారథాన్ రన్నర్ కావడం బలిష్టంగా ఉండటంతో అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు అపసోపాలు పడ్డారు. పోలీసులు రైల్వే అధికారులు ఆమె చేతులకు టవల్తో కట్టివేసి శంకరపల్లి పోలీస్ స్టేషన్కు తరలించారు.

**ఆమెను విచారించిన శంకర్పల్లి పోలీసులు**

కారులో వచ్చిన యువతిని పోలీసులు అదుపులోకి తీసుకొని శంకర్పల్లి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఆమెను కొద్దిసేపు విచారించగా ఎలాంటి వివరాలు తెలపలేదు. తండ్రి ఫోన్ నెంబర్లు మాత్రం పోలీసులకు తెలపడంతో పోలీసులు ఆయన నంబర్కు మాట్లాడి వివరాల సేకరించారు. తదనంతరం ఆమెను చికిత్స నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**వైద్యానికి సహకరించని యువతి**

అదుపులోకి తీసుకున్న యువతి చికిత్స నిమిత్తం చేవెళ్ల ఆసుపత్రికి తరలించగా ఆమె వైద్యం చేయడానికి సహకరించకపోవడంతో పోలీసులు ఆమెను ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రికి తర నించారు. ఈ విషయమై నాంపల్లి రైల్వే సిఐ శ్రీనివాసులు వివరణ కోరగా ఓమికా సోని ఆత్మహత్య చేసుకోవడానికి కాలుతో రైల్వే ట్రాక్ పైకి వెళ్లిందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా పోలీసులను దుర్భాషలాడినందున భూమికాసోనిపై శంకర్పల్లి పోలీసులు మరో కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## నిలిచిపోయిన పలు రైళ్లు ఇబ్బందుల్లో ప్రయాణికులు

**నిలిచిపోయిన పలు రైళ్లు - ఇబ్బందుల్లో ప్రయాణికులు**

రైల్వే ట్రాక్ పై కారు లో యువతి హల్చల్ చేయడంతో రైల్వే అధికారులు హైదరాబాద్ నుంచి వికారాబాద్ వికారాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే పలు రైళ్లను నిలిపివేశారు. వికారాబాద్ నుంచి శంకర్పల్లి మీదుగా నగరానికి వెళ్లే గూడ్స్ రైళ్లు, చిత్తాపూర్ సికింద్రాబాద్ ప్యాసింజర్ రైలు, బీదర్ హైదరాబాద్ ప్యాసింజర్ రైలు మరియు హైదరాబాద్ వైపు నుంచి శంకర్పల్లి మీదుగా వికారాబాద్ వైపు వెళ్లే నాందేడ్ -రాయచూర్, ఫలక్ నుమా వాడి ప్యాసింజర్ రైళ్ళను రైల్వే అధికారులు నిలిపివేశారు. దీంతో వివిధ పనుల నిమిత్తం వికారాబాద్ తాండూరు వైపు, బీదర్ వైపు, లింగంపల్లి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.


**శ్రీకాకుళం జిల్లా నుంచి ఒరిస్సా..**

## పూరి రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

పూరీ జగన్నాథుని రథయాత్ర.. యావత్ భక్తులకు ఆధ్యాత్మికంగా ఎంతో పవిత్రమైన వేడుక. ప్రతి సంవత్సరం ఆశాఢ మాసంలో నిర్వహించే ఈ రథోత్సవం కోసం లక్షలాది మంది భక్తులు పూరీ చేరుతుంటారు. ఇలాంటి సమయంలో భక్తుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు శ్రీకాకుళం జిల్లా వాసుల కోసం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం, పలాస ప్రాంతాల నుంచి పూరీకి రథయాత్ర సందర్భంగా ప్రయాణించే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో వారి ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మార్చేందుకు ఈ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

## కొల్చారంలో రూ. 4 కోట్ల 60 వేల విలువైన పనులు

**అవకతవకలు లేకుండా ఉపాధి హామీ పనులు**




**కొల్చారం, జూన్ 26( జనం సాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలంలో 2024-25 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన 15వ విడత ఆడిట్ ప్రజా వేదిక గురువారం కొల్చారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏ పీడి రంగాచారి, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీడీ రంగాచారి మాట్లాడుతూ క్షేత్ర సహాయకులు మాస్టర్లు రాసే క్రమంలో దిద్దుబాటులో మాస్టర్ లో ఉండొద్దని సూచించారు. చిన్నచిన్న పొరపాట్లు మినహ 15వ సామాజిక తనిఖీలు కొల్చారం మండలంలో ఎక్కడ అవకతవకలు జరగలేదని సామాజిక తనిఖీ బృందం నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు చేసిన మస్టర్ దిద్దుబాటు చర్యలకు గాను రూ.6,322 జరిమానా విధించినట్లు తెలిపారు. 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో కొల్చారం మండలంలో నాలుగు కోట్ల 60 లక్షల రూపాయల విలువైన ఉపాధి హామీ , పంచాయతీరాజ్, అటవీ శాఖ ల ఆధ్వర్యంలో పనులు జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కృష్ణవేణి, ఏపీఓ మహిపాల్ రెడ్డి, సాంకేతిక సహాయకులు సుధాకర్, సుదర్శన్ మండలంలోని వివిధ గ్రామాల క్షేత్ర సహాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# నూతన మున్సిపాలిటీలతో సమగ్ర అభివృద్ధి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**




**పటాన్చెరు, జూన్ 26 (జనం సాక్షి)**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పరచడం ద్వారా సమగ్ర అభివృద్ధితో పాటు భవిష్యత్తు తరాలకు మెరుగైన పరిపాలన అందించడం సాధ్యమవుతుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు మండల పరిధిలోని ఇంద్రేశం కేంద్రంగా నూతన మున్సిపాలిటీగా ఏర్పరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా.. ఇంద్రేశం గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు బుధవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పెద్ద ఎత్తున కాలనీలు ఏర్పడుతున్నాయని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్ గ్రేడ్ చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్‌తో పాటు నూతనంగా ఇంద్రేశం, జిన్నారం కేంద్రాలుగా మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీల ద్వారా పరిపాలన వికేంద్రీకరణ జరగడంతో పాటు.. అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు మంజూరు కావడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీ ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలు ఏర్పాటయితే పన్నుల భారం పెరుగుతుందని ప్రజలు అపోహలకు గురికావద్దని కోరారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం గ్రామ మాజీ సర్పంచ్ రామచంద్ర రెడ్డి, శివారెడ్డి, హరినారాయణ గౌడ్, నరసింహ రెడ్డి, గ్రామ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం

**నంగునూర్, జూన్ 26 (జనం సాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా జరిగే పాలీసెట్ 2025 ప్రవేశాల కౌన్సెలింగ్ స్థానిక రాజగోపాల్ పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభం అయినట్టుగా ఆ కళాశాల ప్రధానాచార్యులు ఎ గోవర్ధన్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, పాలీసెట్-2025లో ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు ఇంజనీరింగ్ డిప్లొమా విద్యను అభ్యసించడానికి వీలుగా, పాలీసెట్ -2025 ప్రవేశ పరీక్షను ఈ సంవత్సరం మే నెల 13వ తేదినాడు నిర్వహించినారు. పాలీసెట్ - 2025లో ఉత్తీర్ణులు అయిన విద్యార్థిని విద్యార్థులు ఇంజనీరింగ్ డిప్లొమాలో ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌ను ఈనెల 26 నుండి 29వ తేదీ వరకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అలుగోజు గోవర్ధన్



సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కౌన్సిలింగ్ ప్రక్రియలో బి అభినవ్ పర్యవేక్షణలో వై రాజు, వి రామకృష్ణ, సయ్యద్ షహభాజ్, పాతూరి శ్రీనివాసరెడ్డి, విజయకుమార్, రాజమౌళి, కవిత, మధుబాబు, వాణి తదితరులు పాల్గొన్నారు.

**దేవస్థాన భూముల్లో ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ**

# త్వరలో ఇందిరమ్మ ఇండ్లు

**ఎమ్మెల్యే, టిపిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



**చారకొండ, జూన్ 26 (జనంసాక్షి)**

దేవస్థాన భూముల్లో ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ త్వరలో ఇందిరమ్మ ఇండ్లు ఎమ్మెల్యే, టిపిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ భరోసా కల్పించారు. చారకొండ మండల పరిధిలోని శిరసరగండ్ల సీతా రామచంద్రస్వామి దేవస్థాన భూముల్లో నిర్మించుకున్నటువంటి నిరుపేద ప్రజల ఇండ్లను హైకోర్టు ఉత్తర్వుల ద్వారా దేవాదయ ధర్మాదాయ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో ఇటీవల కాలంలో 33 ఇండ్లను ఖాళీ చేయించి కూల్చివేతలో ఇండ్లను కోల్పోయిన బాధితులను ఎమ్మెల్యే వంశీకృష్ణ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండ్లు కూలిపోయిన బాధితులు ఎవరు అధైర్య పడవద్దునని ఆయన మనోధైర్యాన్ని కల్పించారు. శిరసనగండ్ల గుట్ట శివార్లలో ప్రభుత్వ భూమిని పరిశీలించి బాధితులకు ఇంటి స్థలాలతో పాటు ఇండ్లను నిర్మించి ఇస్తామని అన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి అనవసరమైనటువంటి ఆందోళనలకు గురికావొద్దునని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయడానికి స్థానిక తాసిల్దార్ సునీతకి ఆదేశాలు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెడ్పి వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాసింగ్, ఉమామహేశ్వర చైర్మన్ మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండె వెంకట్ గౌడ్, కాయతి విజయసాయిరెడ్డి, మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాం గౌడ్, నాగర్ కర్నూల్ తాలూకా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు క్యామ మల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ జెల్ల గురువయ్య గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరుకలి గణేష్ గౌడ్, శిరసనగండ్ల మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, శిరసనగండ్ల మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, నారాయణ రమేష్ రెడ్డి, పెద్దాపురం జగన్ మహారాజ్, జెసిబి వెంకటయ్య, కంది కంటి సీనయ్య, గుండె శివ,పానుగంటి అంజయ్య, కుమ్మరి జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిశెట్టి నాగేంద్ర, కేశ మౌని శంకరయ్య, స్థానిక తాసిల్దార్ సునీత, ఆర్ ఐ భరత్, ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్, వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, వెల్దండ వంగూర్ ఎస్సైలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాధితులు గ్రామ ప్రజలు యువకులు తదితరులు ఉన్నారు.



# సాయి చందు సభా స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రులు

**అమరచింత, జూన్ 26 (జనం సాక్షి)**

అమరచింత మండల మున్సిపాలిటీ కేంద్రంలో, కొత్త బస్టాండ్ దగ్గర సాయి చందు విగ్రహం ఏర్పాటు స్థలాన్ని మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర మాజీ గిడ్డంగుల చైర్మన్ రజిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రజిని సాయి చందు అమరచింతలోని వార్డుల్లో వెళ్లినప్పుడు ప్రజల నుండి అపూర్వ స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు రాజేందర్ సింగ్, మాజీ పట్టణ అధ్యక్షులు నరసింహులు గౌడ్, రమేష్, బాలరాజ్, మాజీ కౌన్సిలర్ రాజ్ కుమార్, శేఖర్, ఎం.వి.రామన్ స్కూల్ అధినేత శ్రీధర్ గౌడ్, ఆత్మకూర్ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్, వీరేశలింగం, టైలర్స్ శ్రీనివాసులు, రవి, బిఆర్ఎస్ స్థానిక నాయకులు, సాయి చందు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

**చేర్యాల, జూన్ 26 (జనంసాక్షి) :**


చేర్యాల పోలీస్ స్టేషన్‌ను సిద్ధిపేట పోలీస్ కమిషనర్ సీపీ అనురాధ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చేర్యాల పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డ్, రైటర్ రూమ్‌లను పరిశీలించి తగు సూచనలు తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణ ప్రాంతంలో మొక్కలు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్ఐ నీరేష్, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి

**- అంబెడ్కర్ కరెన్సీ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరశురాం**

**- చేర్యాలకు చేరుకున్న లక్ష పోస్టుకార్డు ఉద్యమ యాత్ర**



**చేర్యాల, జూన్ 26 (జనంసాక్షి):** ఆర్బిఐ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కరెన్సీ అంబేద్కర్ ఫోటో ముద్రించాలని డాక్టర్ జైరిపోతుల పరశురాం అన్నారు. దేశవ్యాక్ష పుస్తకాలు ఉద్యమం ఈనెల 23న ఉస్మాన్ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైన యాత్ర గురువారం చేర్యాల పట్టణానికి చేరుకుంది. వారికి చేర్యాల నాయకులు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేరిపోతుల పర్శరాములు మాట్లాడుతూ.. 1921లో ఇంపిరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు డా.బిఆర్ అంబేద్కర్ రూపాయి దాని సమస్య పరిస్కార మార్గం అనే పుస్తకాన్ని వ్రాసి హిల్టాన్ యాంగ్ కమిషన్, రాయల్ కమిషన్,సైమన్ కమిషన్ బ్రిటిష్ ప్రభుత్వానికి ఇవ్వడం వల్ల ఇది వాస్తవం అని గ్రహించి 1935 ఏప్రిల్ 1 రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా ఏర్పడ్డది అంటే నాడు అంబేద్కర్ లేకుంటే నేడు అర్బీఐ లేదుఅని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 500 మందితో పోస్ట్ కార్డ్స్ పోస్ట్ బాక్స్‌లో వేశారు. జాతీయ జండ రూపాకల్పన కమిటీ ఏర్పడ్డరోజు జాతీయ జండాలో అశోక చక్రం పెట్టిన రోజు జూన్ 23 నుండి 26 జనవరి 2026 వరకు దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లక్ష మందితో పోస్ట్ కార్డ్ ఉద్యమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరెన్సీ పై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జిల్లా కన్వీనర్ మేడిపల్లి చందు, చేర్యాల మాజీ మున్సిపల్ సభ్యులు మంగోలు చంటి, వీరన్న పేట మాజీ సర్పంచ్ వల్లూరి శ్రీనివాస్, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ డివిజన్ ఇంచార్జి సనువాల ప్రసాద్, టీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు భూమిగారి రాజేందర్, మాల మహానాడు మండల నాయకులు కమలాపురం కిష్టయ్య, పాకనాటి భాస్కర్, శ్రీరామ్ వెంకటేష్, మద్దూరు కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ పాఠశాలకు 14 మంది ఎంపిక

**జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి**

**మెదక్, జూన్ 26 (జనం సాక్షి):**

తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్, నాలుగో తరగతిలో ప్రవేశానికి జిల్లా నుండి 08 మంది బాలికలు 06 మంది బాలురు మొత్తం 14 మంది జిల్లా స్థాయిలో ఎంపిక కావడం శుభ పరిణామం అని జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి వై దామోదర్ రెడ్డి తెలిపారు. గురువారం స్టేడియంలో తెలంగాణ క్రీడా పాఠశాలకు జిల్లాస్థాయి ఎంపికలు యువజన క్రీడల నిర్వహణ అధికారి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట్, ప్రాంతీయ క్రీడా పాఠశాల, కరీంనగర్ మరియు ఆదిలాబాద్‌లలో నాల్గవ తరగతిలో ప్రవేశానికి మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు మెదక్ అవుట్ డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపికలను



నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ఎంపికలలో మెదక్ జిల్లా నుండి 08 మంది బాలికలు 06 మంది బాలురు మొత్తం 14 మంది జిల్లా స్థాయిలో ఎంపిక అయ్యారని, వారిని రాష్ట్ర స్థాయికి ఎంపికలకు పంపడం జరుగుతుందని తెలిపారు. జూలై 1, 2వ తేదీలలో ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట్ నందు రాష్ట్ర స్థాయిలో ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ జర్నల్ సెక్రెటరీగా గిరిజ శెట్కార్

**సంగారెడ్డి, జూన్ 26 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ జర్నల్ సెక్రెటరీగా గిరిజ శెట్కార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. నారాయణ ఖేడ్‌కు చెందిన గిరిజ శెట్కార్ గత కొన్ని సంవత్సరాలుగా పార్టీలో క్రియాశీలక బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ అధి ష్టానం గిరిజ శెట్కార్ సముచిత స్థానం కల్పిస్తూ జర్నల్ సెక్రెటరీగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పెద్దలు మల్లికార్జున కార్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,



మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర్ రాజనర్సింహ, సురేష్ కుమార్ శెట్కార్‌లకు గిరిజ శెట్కార్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నారాయణఖేడ్ నియోజక వర్గం నాయకులు రాకేష్శెట్కార్, యూత్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాలి పటేల్ శివకాంత్, మనూరు, నాగల్గిద్ద, నారాయణఖేడ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంగమే శ్వర పాటిల్, సంతోష్ పటేల్,సోఫీ రహమాన్, సాయిచరణ్, సాయిలు గిరిజ శెట్కార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థులను "ఇన్స్ పైర్" చేయాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, జూన్ 26 (జనం సాక్షి):**

విద్యార్థులను ఇన్స్పైర్ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ కలెక్టర్ ఛాంబర్లో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తితో కలిసి "ఇన్స్ పైర్ మనక్" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో ఆలోచన శక్తిని పెంపొందించి పరిశోధనల వైపు మళ్లించేందుకు కేంద్ర విద్యా శాఖ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ ఆధ్వర్యంలో "ఇన్స్ పైర్ మనక్" అవార్డ్స్ పేరిట బాల శాస్త్రవేత్తలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులు ఉపయోగించుకునేలా ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధా కిషన్ మాట్లాడుతూ అన్ని యాజమాన్యాలలో విద్యనభ్యసిస్తున్న 6 నుండి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు వారి ప్రాజెక్టులను ఆన్లైన్లో www.inspireawards-dst.gov.in ద్వారా సెప్టెంబర్ 15వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థికి 10 వేల రూపాయలు మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి మరియు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డిలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి

**- జిల్లా కలెక్టర్ సంతోష్**



**గద్వాల నడిగడ్డ, జూన్ 26 (జనం సాక్షి) :** విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పిస్తూ, ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు నిబద్ధతతో బోధన చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ సూచించారు. గురువారం మల్దకల్ మండలంలోని అమరవాయి గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, పాఠశాలలోని తరగతులు,ల్యాబ్,మెస్, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భ ంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. వారికి బోధన సులభంగా అర్థమయ్యేలా స్పష్టంగా బోధించాలంటూ ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పూర్తి స్థాయిలో ఉండాలని తెలిపారు. ప్రతి విద్యార్థి యూనిఫారమ్‌లో ఉండాలని, ఎలాంటి ఇబ్బంది లేకుండా చదువుకోవడానికి అవసరమైన అన్ని మౌలిక వసతులు పాఠశాలలో ఉండాలన్నారు. స్మార్ట్ బోర్డుల ద్వారా బోధన కొనసాగుతున్న తీరును పరిశీలించారు. స్మార్ట్ బోర్డ్‌లను ఉపయోగిస్తూ ప్రతి రోజు పాఠాలు జరిగేలా చూడాలని ఆయన సూచించారు. సైన్స్,కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పాఠ్యాంశాలను అభ్యసిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విషయాలను సులభంగా అర్థం చేసుకునేలా, చురుకుగా పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలన్నారు. గోడపై మధ్యాహ్న భోజన మెనూను ఆకర్షణీయంగా చిత్రించిన ఉపాధ్యాయుడిని కలెక్టర్ ప్రశంసించారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు మెనూ ప్రకారం ప్రతి రోజు పౌష్టికాహారం ఇవ్వాలని,భోజనపదార్థాలు నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ, పాఠశాల ఫలితాలు మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ అందరూ కలిసి పనిచేయాలని కోరారు. మండల విద్యా శాఖాధికారి సురేష్, ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** సమిష్టి కృషితో నారాయణపేట ను డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు, యువత, విద్యార్థు లు కలిసికట్టుగా ముందడుగు వేయాలన్నారు. ప్రపంచ మత్తు పదార్థాల నిరోధక దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు పౌరులు, యువత, విద్యార్థులు కృషి చేయాలని ఆమె కోరారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మత్తు పదార్థాల నిరోధక విభాగాన్ని ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచారని తెలిపారు. తర్వాత యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా జిల్లాలోని ప్రభు త్వ పాఠశాలల్లో ఇటీవలే నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు, జిల్లా అధికారులు బహుమతులను అందజే శారు. అనంతరం జిల్లా కలె క్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ఐ యాం ఎన్ యాంటీ డ్రగ్స్ సోల్జర్ అంటూ సెల్ఫీ



పాయింట్ వద్ద ఫోటోలు దిగారు.డ్రగ్స్ నిర్మూలన కోసం సంతకాలు చేపట్టారు. అనంతరం అక్కడ పాఠశాలల విద్యార్థులతో కలిసి మానవ హారం ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ట్రైనీ కలెక్టర్ ప్రణ య్ కుమార్, జిల్లా అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డి.ఎస్.పి నల్లపు లింగయ్య, డీఈవో గోవిందరాజులు, ఆర్డీవో మేఘా గాంధీ, డిపిఆర్ఓ ఎం.ఏ. రషీద్, తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి**

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి బ్యూరో జూన్ 26 జనంసాక్షి**

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీ వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి అంబేద్కర్,రాజీవ్ చౌరస్తా నుండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరకు సాగిన ఈ ర్యాలీ జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌తో కలసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉన్న పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ జిల్లాలోని అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా అదనపు కలెక్టర్, డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వర రావు, డిఎస్పీ వెంకటేశ్వర్రావు, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, డి.ఈ .ఓ అబ్దుల్ ఘని, వనపర్తి సిఐ, కృష్ణయ్య, సిఐ, రాంబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, సిసిఎస్ సీఐ, రవిపాల్, తదితరులు పాల్గొన్నారు.

**యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు**

**- పి. ప్రావీణ్య జిల్లా కలెక్టర్**

**- ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ.**

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 26 (జనం సాక్షి)**

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో పోలీసు, శాఖల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్‌లు జెండా ఊపి ప్రారంభించారు . ఈ సందర్భం గా ర్యాలీ




అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ర్యాలీ కలెక్టరేట్ నుండిసంగారెడ్డి ఐబి వరకు కొనసా గింది. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవ్ రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు లలిత కుమారి, డిఇఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కంకణబద్ధులు కావాలి

- నగర మేయర్ గుండు సుధారాణి
- ర్యాలీని కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డిసిపి అంకిత్ కుమార్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించిన మేయర్




**వరంగల్ ప్రతినిధి, జూన్ 26(జనంసాక్షి):** మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించేందుకు కంకణబద్దులు కావాలని నగర మేయర్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ ఎంజీఎం చౌరస్తా నుండి పోచమ్మ మైదాన్ చౌరస్తా వరకు మాదక ద్రవ్య రహిత జిల్లా లక్ష్యంగా నిర్వహించిన అవగాహన ర్యాలీను మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి అంకిత్ కుమార్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగ్య స్వాములు కావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా కఠినమైన చర్యలు తీసుకుంటుందన్నారు. మాదకద్రవ్యాలను తీసుకోక ముందే వాటిని నివారించాలనే స్లోగన్ తో ముందుకెళుతున్నామని, మత్తు వల్ల కలిగే అనర్థాల గురించి చిన్నతనంలోనే పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో కాలేజీలలో యూనివర్సిటీలలో డ్రగ్స్ నివారణ కమిటీలు వేయాలన్నారు . యువత ఒత్తిడిని అధిగమించడానికి యోగ, శారీరక శ్రమ చేయాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుకు కష్టపడి చదివిస్తున్నారని వారి ఆశయాలను నేరవేర్చాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు యువత విద్యార్థులు కలసికట్టుగా ముందడుగు వేసి వరంగల్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని అన్నారు. సమాజంపై మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇతర అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణ, నిబద్ధత పట్టుదలతో జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవచ్చునని అన్నారు . సమాజంలో ఏ ఒక్కరు డ్రగ్స్ కు బానిస కాకుండా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఈ ఉద్యమంలో యువత సైనికుల్లా ముందుకెళ్లాలని, అధికారులు భాగస్వామ్యులై ఉన్నామని కలెక్టర్ తెలిపారు. డిసిపి అంకిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని, డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, అందువల్ల అందరూ బాధ్యతతో ముందుకు వచ్చి ప్రాణాంతకంగా పరిణమించే మాదకద్రవ్యాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని కోరారు.అనంతరం మాదకద్రవ్యాల నివారణకు కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిడబ్ల్యుఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పాయ్,అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ జన్ను శిభారాణి, ట్రైనీ కలెక్టర్లు జయసింహ, హరిప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జెడ్పి సిఈఓ రామిరెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, అధికారులు, సిడిపిఓలు, పోలీస్ అధికారులు, మెప్మా సిబ్బంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఆదిలాబాద్‌లో భారీ వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో వాగులు వంకలు పొంగి పొరలి ప్రవహిస్తున్నాయి. తలమడుగు మండలం సుంకిడి గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న బీమన్న వాగు వంతెన మీద నుంచి నీరు పొంగి ప్రవహిస్తుండడంతో రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో గంట పాటు ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు.

## గాజర్ల రవికి నివాళులు



**టేకుమట్ల (జనంసాక్షి) :** మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ మృతుడు గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ చిత్రపటానికి గురువారం భూపాలపల్లి గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా గాజర్ల రవి భారీ చిత్రపటాన్ని ఆయన సోదరులైన గాజర్ల అశోక్, సమ్మయ్య లకు అందించి ఆవిష్కరించారు. అనంతరం చిత్రపటాన్ని అక్కడే ఏర్పాటు చేసి పూలమాల వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. జోహార్ కామ్రేడ్ రవన్న అంటూ నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. పరామర్శించిన వారిలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు తడుక సుధాకర్ గౌడ్, ముత్యాల రాజబాబు గౌడ్, కంకటి రాజవీరు గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రావుల విష్ణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముంజాల రవీందర్ గౌడ్, బాలగోని రమేష్ గౌడ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరు మున్సిపల్ కమిషనర్‌గా వక్కాల శ్యాంసుందర్

**తొర్రూర్ (జనంసాక్షి) :** తొర్రూరు మున్సిపల్ కమిషనర్ గా వక్కాల శ్యాంసుందర్ గురువారం పదవి బాధ్యత స్వీకరించారు మున్సిపల్ ఉద్యోగులు సాదరంగా స్వాగతం పలికి బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వక్కాల శ్యాంసుందర్ మాట్లాడుతూ గతంలో మందమర్రి శానిటరీ ఇనస్పెక్టర్ గా విధులు నిర్వహించానని పదోన్నతిలో భాగంగా తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ గా ప్రమోషన్ రావడం తో సంతోషంగా ఉందన్నారు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని పట్టణ ప్రజలు కూడా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టస్వామి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సమర్కనం, సానిటరీ ఇన్స్పెక్టర్ కొమ్ము, వార్డ్ ఆఫీసర్లు పట్టాభి, ప్రభాకర్, కనకరాజు, సుధాకర్, పట్టాభి, రాంబాయి, లావణ్య, రేణుక, ఉపేంద్ర, శ్రీకాంత్, వీరేందర్, పవన్ కళ్యాణ్, బిల్ కలెక్టర్లు వెంకట్రాం, శంకర్, ప్రశాంత్, ఉపేందర్, కరెంట్ సోమయ్య, శ్యామ్, జవాన్లు, వెంకన్న, మురళి , మహేష్, నరసమ్మ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్యం మేర బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రతి సెక్టార్ కు నిర్దేశించిన లక్ష్యం మేర బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని బ్యాంకు రుణాల లావాదేవీలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, వార్షిక క్రెడిట్ ప్లాన్ 2024-25 ప్రకారం మార్చి 31 నాటికి బ్యాంకుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తం రుణాల లక్ష్యం రూ.2565.06 కోట్లు కాగా, రూ.1923.32 కోట్లు సాధించడం ద్వారా 74.98 శాతం పురోగతి సాధించారని వివరించారు. వ్యవసాయ రంగంలో రూ.2055.42 కోట్ల లక్ష్యంతో పోలిస్తే రూ.1219.48 కోట్లు మంజూరు చేసి, 59.33 శాతం పురోగతి సాధించారని తెలిపారు. షార్ట్ టర్మ్ క్రాప్ రుణాలు 1344.57 కోట్లు కాగా, 660.10 కోట్ల లక్ష్యం సాధించారని తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగంలో 96.73 కోట్ల రుణాలు మంజూరు లక్ష్యం కాగా, 60.77 కోట్ల రుణాలు ఇచ్చారని, విద్యా రుణాలు 18.01 కోట్ల లక్ష్యం కాగా, 7.23 కోట్ల రుణాలు ఇచ్చారని అన్నారు. గృహ నిర్మాణ రుణాలు 52.76 కోట్లు లక్ష్యం కాగా, 3.14 కోట్లు మాత్రమే ఇచ్చారని,రుణాల మంజూరు పురోగతితో వెనుకబడి ఉన్నదని లక్ష్యం మేర రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఇతర ప్రాధాన్యతా రంగాలకు 12.37 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, 38.48 కోట్ల రుణాలు మంజూరు చేశారని, అలాగే ప్రాధాన్యత రంగాలకు కూడా నిర్దేశించిన లక్ష్యం మేర రుణాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. నాన్ ప్రైయారిటీ రంగంలో రూ.330.77 కోట్ల లక్ష్యంతో పోలిస్తే, రూ.594.22 కోట్లు మంజూరు చేయడం ద్వారా 179.65 శాతం పురోగతి సాధించారని అన్నారు. బ్యాంకర్లు వ్యవసాయ, విద్యా, గృహ రుణాలు మంజూరు చేయాలని, గ్రామీణాభివృద్ధికి మరింత కృషి చేయాలని, ముఖ్యంగా హౌసింగ్ లోన్లు, విద్యా లోన్లలో పురోగతి పెంచాలని సూచించారు. రైతులకు, చిన్న, మధ్య తరహా వ్యాపారాల వారికి అవసరమైన క్రెడిట్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని బ్యాంకర్లను ఆదేశించారు. కొత్తపల్లి గోరి, చల్లగరిగే తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలపై రైతుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలానే ఉంటే స్టేట్ కమిటీకి ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి బ్యాంక్ లింకేజీ రుణాలు ఇవ్వాలని సూచించారు. అందరం ఒక టీములాగా పని చేసి ప్రజలకు అవసరమైన రుణాలను సకాలంలో అందించి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం 2025-26 జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2920.33 కోట్లను ఆమోదించి, వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం తిరుపతి, ఆర్బీఐ ఎల్డిఓ సాయి తేజారెడ్డి, నాబార్డు డిడిఎం చంద్ర శేఖర్, ఎస్బిఐ ఆర్ఎం సుబ్బారావు, టిజిబి ఆర్ఎం ప్రభుదాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి


- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్ బ్యూరో, జూన్ 26(జనం సాక్షి):** డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కోర్ట్, ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా ఎస్పీ సుదీర్ రాంనాథ్ కేకన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి పాల్గొని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళలు, ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీ ఎం.ఆర్.ఓ ఆఫీసు నుండి మీదుగా నెహ్రూ చౌరస్తా కోర్ట్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ మాట్లాడుతూ సమాజానికి మహమ్మారిలా మారిన మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా పాఠశాలల నుండే అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలని వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు చెబుతున్నాయని అన్నారు. మత్తు పదార్థాల భారీన పడినట్లయితే మళ్లీ వెనక్కు రాలేరని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకునే చర్యలతోనే మత్తు పదార్థాల నియంత్రణకు వీలు కలుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులతో నిరంతరం వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని, వారి అలవాట్లను గమనించాలన్నారు. ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణలో పోలీసు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు, పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్ పై అవగాహన పొందాలని తద్వారా డ్రగ్ రహిత సమాజాన్ని చూడగలుగుతామన్నారు. ఈ సందర్భంగా ప్లెడ్జ్ వాల్ పై డ్రగ్స్ నియంత్రణ కై సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ధనమ్మ, అడిషనల్ ఎస్పీ తిరుపతి రావు, ఎక్సైజ్ అధికారి కిరణ్, మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ చైర్మెన్ నాగావాణి, సఖీ సిబ్బంది, ఆశా వర్కర్లు, మహిళలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నివారణపై దృష్టి సారించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ రమేష్ బాబు
- భూపాలపల్లిలో మత్తు పదార్థాల నివారణ ర్యాలీ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మత్తు పదార్థాల నివారణలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ రమేష్ బాబు అన్నారు. గురువారం అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బిఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణం నుండి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు నిర్వహించిన అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ ర్యాలీలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే లతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ భూతాన్ని సమాజం నుండి తరిమేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లను నిశితంగా గమనించాలని, డ్రగ్స్ కు అలవాటుపడ్డ వారిలో వచ్చే మార్పులను గుర్తించడం సులువైన పని అని అన్నారు. ఇంటి నుండే మార్పు మొదలవ్వాలని తెలిపారు. డ్రగ్స్ భూతాన్ని తరిమేయడంలో సహాయం కావాల్సిన వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థను గాని, పోలీసు శాఖను గాని సంప్రదించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ డ్రగ్స్‌ను తరిమేయడంలో ప్రతి ఒక్కరి బాగస్వామ్యం అవసరమని అన్నారు. మత్తుపదార్థాల నిర్మూలన కోసం కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, అడీషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, అడీషనల్ కలెక్టర్ లు పి. అశోక్ కుమార్, విజయలక్ష్మి , అడీషనల్ ఎస్.పి. నరేష్ కుమార్, సింగరేణి జి.ఎం.రాజేశ్వర్ రెడ్డి, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, ఎక్సయిజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, విద్యా శాఖ అధికారి రాజేందర్, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి వి.శ్రావణ్ రావు, డి.ఎస్.పి లు సంపత్ రావు, సూర్యనారాయణ, న్యాయవాదులు, విద్యార్థులు, పోలీసు అధికారులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట జూన్ 26 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో నిర్మితమవుతున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వైద్యరంగ అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా స్థానిక ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.

## నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, జూన్ 26 (జనం సాక్షి):** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో గురువారం రోజున ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఇండ్లను నిర్మించుకోవాలని,ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక పంపిణీ చేస్తామని, 450రూ టన్ను కంకర అందజేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వలన ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు.అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూ గ్యాస్ సిలిండర్,ఏక కాలంలో రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు.

## అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు

- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



**బెల్లంపల్లి, జూన్ 26 (జనంసాక్షి) :** అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ముందు సమీకృత మార్కెట్ భవనంలో షెటర్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని ధర్నాకు దిగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని రంగాల్లో అవినీతి బాగా పెరిగిపోయిందన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో కూడా ప్రస్తుత ఎమ్మెల్యే గెలిచిన తర్వాత నియోజకవర్గ వ్యాప్తంగా అవినీతి హద్దు మీరిందని ఆరోపించారు. ఎమ్మెల్యే అండదండలతో ఎమ్మెల్యే అనుచరులు అన్ని రంగాల్లో తీవ్రస్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బెల్లంపల్లి కూరగాయలు మార్కెట్ సముదాయంలో స్టాళ్లు కేటాయింపులోనూ అవినీతి జరిగిందని, అర్హులకు కేటాయించాల్సిన స్థళ్లను ప్రస్తుత ఎమ్మెల్యే అనుచరులు అక్రమంగా వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు ఇప్పించుకున్నారని ఆరోపించారు. అర్హులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వ అధికారులు కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, బెల్లంపల్లి మున్సిపల్ తాజామాజీ వైస్ చైర్మన్ సుదర్శన్, బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్, బెల్లంపల్లి మాజీ ఎంపీపీ సుభాష్ రావు, బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

- టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి

**మహబూబాబాద్ బ్యూరో, జూన్ 26(జనం సాక్షి):** జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్స్ కొరత ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏ మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డికి మెమోరండం ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు తగ్గకుండా ఉండాలంటే సబ్జెక్టు టీచర్స్ కొరత లేకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్య అన్ని పాఠశాలలో ప్రారంభించుటకు అనుమతి ఇవ్వాలని, బడిబాటలో భాగంగా విద్యార్థుల సంఖ్య పెరిగిన పాఠశాలలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. జిల్లాలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు తెప్పించి ఇవ్వాలని, రాని టైటిల్స్ పుస్తకాలను కూడా తెప్పించి వెంటనే అందజేయాలని, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు తెప్పించి ఇవ్వాలని కోరారు.

## మున్సిపల్ కమిషనర్‌పై మాజీ కౌన్సిలర్ దౌర్జన్యం

**పరకాల, జూన్ 26 (జనం సాక్షి):** పరకాల మున్సిపల్ కమిషనర్ కదారి సుష్మ పై పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఆర్పీ జయంతి లాల్ దౌర్జన్యానికి పాల్పడగా, కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పరకాల సిఐ క్రాంతి కుమార్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో బుధవారం ప్రైవేటు వ్యక్తులకు చెందిన ప్రహరీ గోడ వివాదంలో జయంతి లాల్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్న బిల్డింగ్ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి పై దురుసు గా ప్రవర్తించడం జరిగిందన్నారు. అనంతరం మీతో పని లేదంటూ పరకాల పట్టణ కమిషనర్ కదారి సుష్మ చాంబర్ కు అనుమతి లేకుండా దురుసుగా తలుపులు తోసుకుంటూ వెళ్లి విధులు నిర్వహిస్తున్న కమిషనర్ సుష్మను అనుచిత మాటలతో దూషించి నువ్వు ఎట్లా జాబ్ చేస్తావో నీ అంతు చూస్తా అంటూ బెదిరింపులకు పాల్పడటంతో పాటు అతనికి సంబంధంలేని విషయంలో గొడవకు పాల్పడ్డట్టు తెలిపారు. మునిసిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు ఆర్పీ జయంత్ లాల్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు.

## సంక్షిప్తంగా..



### ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**రామన్నపేట, జూన్ 26 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.రెండు గంటల పాటు అన్ని సమస్యల్ని క్షుణ్ణంగా పరిశీలించారు.రోగులు, ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్యూటీలో ఉన్నట్టు చూపిస్తూ ఐదుగురు డాక్టర్లు గైర్హాజరైన తీరుపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. రోగులు తాగడానికి మంచినీళ్లు లేక బయట నుండి నీళ్లు తెచ్చుకుంటుంటే ఏం చేస్తున్నారని అన్నారు. విధులు సక్రమంగా నిర్వహించని డాక్టర్లకు షోకాజు నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.డెంటల్ డాక్టర్ రోజు రాకున్నా రెగ్యులర్గా వచ్చి వైద్యం చేస్తున్నట్లు రికార్డులో ఉండటం ఏంటని ప్రశ్నించారు. పేదలకు వైద్యం అందించే ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. రోగులపట్ల ప్రేమగా ఉండాలని, బయటికి మందులు రాయవద్దని, దురుసుగా మాట్లా డవద్దని స్టాఫ్ నర్సులకు సూచించారు.

### డ్రగ్స్ శరీరాన్ని, మనసును కోలుకునలేనంతగా దెబ్బతీస్తాయి..



**చౌటుప్పల్, జూన్ 26(జనంసాక్షి ):** డ్రగ్స్ శరీరాన్ని, మనసును కోలుకున లేనంతగా దెబ్బతీస్తాయని చౌటుప్పల్ ఏసీపీ, సీఐలు అన్నారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్‌డే సందర్భంగా పట్టణ కేంద్రంలో గురువారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తాయన్నారు. సమాజంలో మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే లక్ష్యంలో యువత భాగస్వాముం కావాలని అన్నారు. గంజాయి డ్రాక్స్ వంటి మాదకద్రవ్యాలను నేటి యువత బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజం మొత్తం కలిసి డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు యాదగిరి, కృష్ణ మాల్,నార్సి రెడ్డి పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

### సంస్థాన్ లో నకిలీ స్టాంపులు ఫోర్జరీ సంతకాల దందా

**సంస్థాన్ నారాయణపురం. జూన్ 26. (జనం సాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో మీసేవ, నెట్ సెంటర్ నిర్వాహకులు మెడికల్ ఆఫీసర్ స్టాంపులు సంతకాలను ఫోర్జరీ చేశారు. బర్త్ సర్టిఫికేట్, కళ్యాణ లక్ష్మి, డెత్ సర్టిఫికెట్లకు గెజిటెడ్ సంతకాలు అవసరమవుతాయి. నెట్ సెంటర్ మీసేవ నిర్వాహకులు గెజిటెడ్ అధికారుల వద్దకు సంతకం కోసం పంపించకుండా వారే నకిలీ స్టాంపులు గెజిటెడ్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి కొంతమంది అధికారుల కనుసన్నల్లో నకిలీ సర్టిఫికెట్లను తయారు చేసి సామాన్య ప్రజల నుండి ఒక్కొక్క సర్టిఫికేట్ కు ఒక్కో రేటు నిర్ణయించి, అందిన కాడికి దండుకుంటున్నారు. మెడికల్ ఆఫీసర్ రవి న రెవెన్యూ అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో శేఖర్ రెడ్డి నెట్ సెంటర్,మీసేవ సెంటర్ల పై ఎంక్వయిరీ నిర్వహించగా, ప్రస్తుతం 20 కల్యాణ లక్ష్మి దరఖాస్తులలో ఫోర్జరీ జరిగినట్టు, గుర్తించారు. నకిలీ స్టాంపులు, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, ఆర్డిఓ తెలిపారు. బర్త్ సర్టిఫికెట్లు, గత రెండు సంవత్సరాలుగా నారాయణపురం మండల కేంద్రంలో బర్త్ సర్టిఫికెట్ తీసుకున్న ప్రతి ఒక్కరు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఒరిజినలా నకిలీ ఆ చెక్ చేసుకోవాలని, నకిలీ బర్త్ సర్టిఫికేట్ వల్ల భవిష్యత్తులో మీ పిల్లల ఉద్యోగ అవకాశాలు కోల్పోయి, పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు అవుతాయని, ఆర్డీవో తెలిపారు.



# యువత మాదకద్రవ్యాల కు దూరంగా ఉండాలి

- రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..
- నల్గొండ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం : జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్..

**నల్గొండ బ్యూరో జనం సాక్షి:** భవిష్యత్తు బాగుండాలంటే యువత మాదకద్రవ్యాల కు దూరంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.

గురువారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలో జిల్లా పోలీస్ యంత్రాంగం, సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవంలో భాగంగా ఎన్ జి కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ఎన్జీ కళాశాల వద్ద జెండా ఊపి ప్రారంభించారు.



ఈ సందర్భంగా క్లాక్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కరోనా తర్వాత డ్రగ్స్ వాడకం పెరిగిందని, స్టూడెంట్స్ డ్రగ్స్ కు బానిసలుగా మారుతున్నారని, తెలంగాణను డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చుదామని పిలుపునిచ్చారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా నల్గొండ లో 34 కోట్లతో స్కిల్ సెంటర్ కట్టిస్తున్నామన్నారు. ఈ స్కిల్ సెంటర్ ను త్వరలోనే సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. విద్యార్థులు చదువు, స్పోర్ట్స్, యోగా పై దృష్టిపెట్టాలని కోరారు. విద్యార్థులు, యువత సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని, చదువు పైనే దృష్టి సారించాలని, పోటీ పరీక్షలు రాస్తూ ఉద్యోగాలు పొందాలని సూచించారు. ప్రకాశం బజార్ లో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల నిర్మిస్తున్నామని, డిజిటల్ తరగతుల తో పాటు, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. భవిష్యత్ బాగుండాలంటే డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, విద్యార్థులకు ఏం కావాలన్న ప్రతీక్ ఫౌండేషన్ తో పాటు మంత్రి గా తన సహకారం అందిస్తామన్నారు. హైదరాబాద్ లో డ్రగ్స్ పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల కు దూరంగా ఉండాలన్నారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ మిషన్ పరివర్తన కింద వారం రోజులపాటు మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత ఒక్కసారి డ్రగ్స్ తీసుకుంటే బానిసలు అవుతారని, అందువలన డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, డ్రగ్స్ పై చేస్తున్న యుద్ధంలో అందరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ గురించి ఏదైనా సమాచారం అందితే డయల్ 100 కు ఫోన్ చేయాలని సూచించారు. నల్గొండ జిల్లా ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ వాడడం చట్టరీత్య నేరమని, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడవద్దని కోరారు.

ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆదనపు ఎస్పీ రమేష్, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, జిల్లా ఎస్పీ కార్యక్రమంలో పాల్గొన్న వారితో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

# ఎర్రజెండాలన్నీ ఏకం కావాలి



- వందేళ్ళ చరిత్ర కలిగిన ఒకే ఒక్క పార్టీ సిపిఐ
- మావోయిస్టులు వనం వీడి జనంలోకి రావాలి
- ఖమ్మం-కొత్తగూడెం కేంద్రంగా ఇక ప్రజా ఉద్యమాలు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- అట్టహాసంగా సిపిఐ 14వ మండల మహాసభ

**ఖమ్మం రూరల్, జూన్ 26 (జనంసాక్షి) :** దేశంలోని కమ్యూనిస్టు పార్టీలన్నీ ఒకటై ఢిల్లీలో ఎర్రకోటపై ఎర్ర జెండాను ఎగరవేద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద తండాలోని రామ్ లీలా ఫంక్షన్ లోని పొటు ప్రసాద్ ప్రాంగణంలో సిపిఐ 14వ మండల మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేళ్లచెరువు లలిత, మొహమ్మద్ గౌస్ పాషా, లింగా వెంకటనారాయణ, బత్తిని సీతారాములు, జగన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కూనంనేని మాట్లాడారు... ప్రజలు ఇచ్చిన అధికారంతో అమిత్ షా వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మావోయిస్టులు చర్చలకు వస్తామన్నప్పటికీ మారణకాండ చేస్తుండటం సరికాదన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి బిజెపి రైతు వ్యతిరేకిగా పదే పదే వ్యవహరిస్తూనే ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిదంతోనే బిజెపి కల్లు లొట్టబోయే గెలిచి మరలా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. ఆపరేషన్ కగర్కు వ్యతిరేకంగా మావోయిస్టులకు మద్దతుగా నిలిచింది సిపిఐ పార్టీనే అన్నారు. మావోయిస్టులు వనం వీడి జన ప్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా అర్థం చేసుకోవాలని కార్పొరేట్ ప్రభుత్వాలను నమ్ముకుంటే మావోయిస్టులను చంపినట్టే ప్రజలను సైతం చంపుతారన్నారు. రాజకీయ మేధావులు, విశ్లేషకులు, ప్రజలు కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకతను గుర్తుతెరిగారని చెట్టు లాంటి కమ్యూనిస్టును పెంచుకుందామన్నారు. వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అని ఖమ్మంలో డిసెంబర్ 26న 5 లక్షల మందితో వేడుకలను నిర్వహించ బోతున్నట్లు తెలిపారు. ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం కేంద్రంగా ఇక ప్రజా ఉద్యమాలు నిర్మించబోతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజా బలాన్ని కూడగట్టేలా కామ్రేడ్స్ పని చేయాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . అలాగే పలు తీర్మానాలను ప్రవేశపెట్టుకొని ఆమోదింప చేసుకున్నారు . ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణ కుమార్ , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, అజ్మీరా రామ్మూర్తి, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్ , ఉన్నం రంగారావు ,ఎడ్లపల్లి శంకరయ్య ,చెరుకుపల్లి భాస్కర్ ,బానోతు రామకోటి, పగిళ్ల వీరభద్రం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సింగ్ నరసింహారావు, గాదె లక్ష్మీనారాయణ, సీతామాలక్ష్మి, మండల సమితి సభ్యులు పసంగుల చంద్రరావు ,ఏలూరి భాస్కర్ ,మామిడి శంకర్ రెడ్డి , బట్టా బాబు, మేళ్లచెరువు వీరబాబు, వెన్నం భాస్కర్, యువజన సంఘం సభ్యులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, ఉసికాల రవికుమార్, గణపరపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సలాబత్ పూర్ చెక్ పోస్ట్ పై ఏసీబీ అటాక్

- ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఏసీబీ
- రెడ్ హ్యాండెడ్ గా దొరికిన ఏఎంవీఐ కవిత, మరో సిబ్బంది



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 26 (జనం సాక్షి) :** తెలంగాణ -మహారాష్ట్ర రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతమైన సలాబత్ పూర్ చెక్ పోస్ట్ లో ఏసీబీ డిఎస్పి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సోదాలను నిర్వహించారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని మండలం లోని సలాబత్ పూర్ చెక్ పోస్ట్ కార్యాలయం లో ఎసిబి డిఎస్పి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు బుధవారం రాత్రి మెరుపు దాడి చేశారు. లారీల వద్ద నుంచి అక్రమంగా 92 వేల రూపాయలను వసూలు చేసినట్లు ఏసీబీ అధికారుల విచారణలో తేలింది. దీంట్లో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. రవాణా శాఖలో ఏఎంవీఐ గా పనిచేస్తున్న కవిత, మరో సిబ్బందిపై విచారణ జరుపుతున్నారు. అంతర్ రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయంలో భారీ ఎత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ డిఎస్పి రాజశేఖర్ గౌడ్ చెక్ పోస్ట్ పై ఆకస్మిక మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో రవాణా శాఖకు సంబంధం లేని ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. ఆ ఇద్దరు వ్యక్తుల చేత వాహనాలలో డబ్బులు అక్రమంగా వసూలు చేయిస్తున్నట్లు ఏసీబీ అధికారుల విచారణలో వెల్లడైంది. ఇంకా రవాణా శాఖ కార్యాలయం లో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. ఇద్దరు అధికారులు ఉండి కూడా వారు కాసులకు కక్కుర్తి పడి, అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఇద్దరి అధికారులపై కూడా వేటు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రవాణా శాఖ కార్యాలయం పై గతంలో కూడా అవినీతి నిరోధక శాఖ నిఘా పెట్టింది. గురువారం తెల్లవారుజామున పక్క సమాచారం మేరకు ఏసిబి అధికారులు రవాణా శాఖ కార్యాలయం పై మెరుపు దాడులు చేశారు. పూర్తి సమాచారం త్వరలో వెల్లడిస్తామని ఎసిబి డిఎస్పి శేఖర్ గౌడ్ వెల్లడించారు.

# వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

**కల్లూరు మున్సిపాలిటీలో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఆధునీకరణ అభివృద్ధి పనులు ఆకర్షణీయంగా చేపట్టాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**కల్లూరు జూన్ 26 (జనంసాక్షి)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్, డివైడర్ల ఎత్తు పెంపు పూల మొక్కల పెంపకం, డ్రైనేజీల ఆధునీకరణ వంటి అభివృద్ధి పనులు ఆకర్షణీయంగా ఉండే విధంగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. గురువారం సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్గమధ్యంలో కల్లూరు పట్టణ మెయిన్ సెంటర్లో కొద్దిసేపు ఆగి జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ,రహదారి స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ మున్సిపాలిటీకి మంజూరైన 15 కోట్ల నిధులకు సంబంధించి చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక నివేదికను మంత్రి తుమ్మలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల పలు సూచనలు చేశారు. జాతీయ రహదారిపై ఉన్న డివైడర్ ఎత్తు పెంచి దానిపై అందమైన పూల మొక్కలు పెంచాలని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, డ్రైనేజీ ల నిర్మాణం సుందరంగా ఆహ్లాదకరంగా ఉండే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. కల్లూరు మున్సిపాలిటీలో రహదారులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ కమిషనర్ సంపత్ కుమార్ ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. అనంతరం ఇంచార్జ్ కమిషనర్ సంపత్ కుమార్ మున్సిపాలిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కల్లూరు మున్సిపాలిటీ డెవలప్మెంట్ కోసం ప్రభుత్వం 15 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పట్టణంలోని జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ డివైడర్ల అభివృద్ధికి గాను కోటి 50 లక్షలు మంజూరైనాయని, జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాలలో రహదారుల అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజీల నిర్మాణం , తదితర అంశాలకు సంబంధించి చేపట్టనున్న అభివృద్ధి పనుల నిమిత్తం యాక్షన్ ప్లాన్ తయారు తయారు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదేశాల మేరకు త్వరలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చంద్రరావు,కల్లూరు మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ సంపత్ కుమార్, ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు మున్సిపాలిటీ సిబ్బంది, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి : షబ్బీర్ అలీ






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 26 (జనంసాక్షి)** కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం మాచారెడ్డి మండల కేంద్రం లోని బాలాజీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.ఏఐసీసీ సెక్రటరీ విష్ణు నాథన్. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షట్కర్ గారు అబ్జర్వేర్ లు. కత్తి వెంకటస్వామి. సత్యనారాయణ గౌడ్. వేణుగోపాల్ యాదవ్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని, 9 రోజుల్లో 9,000 కోట్లు రైతు భరోసా అందించి రికార్డు సాధించిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు నియోజకవర్గానికి 3500 ఇంద్రమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని, పెద్దలు తినే సన్న బియ్యం పేదలకు అందించి వారికి కడుపు నింపుతున్న ప్రభుత్వమని,బిజెపి వాళ్లు కేంద్ర ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని,బిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని చెప్పాలన్నారు.బీజేపీ రాష్టానికి చేసిందేమీ లేదని. ప్రజలను రెచ్చగొట్టి అధికారం లోకి రావాలని చుస్తుందే తప్ప ప్రజలకోసం పనిచేయడం లేదన్నారు.చిన్న చిన్న గొడవలు పక్కన పెట్టీ రాబోయే స్థానిక ఎన్నికల్లో కొత్త పాత నాయకులు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్ళాలన్నారు.ఇన్ని రోజులు కార్యకర్తలు మన గెలుపు కోసం కష్టపడ్డారు ఇప్పుడు వారి రుణం తీర్చు కోవడానికి సమయం ఆసన్నమైందని, వారికోసం పనిచేసి వారిని గెలిపించి నాయకులు గా తీర్చిదిద్దుతాం అన్నారు. అందరూ పార్టీ సమావేశాలు తప్పకుండా రావాలన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు గ్రామ, మండల,బ్లాక్ కమిటీలు ఏర్పాటుకు అందరూ సహకరించా లని, కార్యకర్తలకు బాధ్యత లు, పదవులు ఇవ్వడమే మా లక్ష్యం, అన్నారు.భూ భారతీ ద్వారా రైతుల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. కెసిఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో కమిషన్లు తిన్నారని. అన్నారు. అనంతరం ఏఐసీసీ సెక్రెటరీ విష్ణు నాథన్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని,మోడీ గుజరాత్ రాష్ట్రం దేశము లోనే రోల్ మోడల్ గా చేస్తా అన్నారు.అదే రేవంత్ రెడ్డి దేశంలోనే తెలంగాణ ను రోల్ మోడల్ గా చేసి చూపించారని తెలిపారు.కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్నో సంస్కరణలు చేశారు సోనియా గాంధీ నాయకత్వంలో ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చారని, ఆహార భద్రత కార్డు తీసుకువచ్చి పేదలను ఆదుకున్నార న్నారు. గిరిజనులకు దళితులకు భూములు అందించారని ,దేశవ్యాప్తంగా 71 వేల కోట్ల రుణమాఫీ రైతులకు అందించారన్నారు.చేనేత కార్మికులకు కూడా దేశవ్యాప్తంగా 5000 కోట్ల రూపాయలు రుణమాఫీ చేశారన్నారు.బిజెపి ప్రభుత్వంలో రైతులపై నల్ల చట్టాలు తీసుకొచ్చి 700 మంది ప్రాణాలు తీసుకున్నారని విమర్శించారు.కుల మతాల మధ్య చిచ్చులు పెట్టి రెచ్చగొట్టి అధికారం రావడం తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదని, ప్రజలు అన్ని గమనించారు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం పుంజుకొని అధికారంలోకి వస్తుందన్నారు.జై బాపు జై భీం జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమము గ్రామ గ్రామాన తీసుకు వెళ్తున్నారు ఈ కార్యక్రమాన్ని ఇంకా గట్టిగా ప్రజల్లోకి తీసుకుపోవాలిఅన్నారు. అనంతరం ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే విధంగా కాంగ్రెస్ నాయకులు లక్ష్యం పెట్టుకోవాలని,యంత్రాంగం లో జరిగే తప్పులను సరిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.చిన్న చిన్న గొడవలకు వివాదాలు చేస్తే పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని అన్నారు.కార్యకర్తలు ఐక్యంగా ఉంటే అందరికీ పదవులు ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు.మన వాళ్ళు వేరే వాళ్ళు అనే తేడా లేకుండా ప్రతి పేదవాడికి ఇల్లు అందిస్తామని. ఇల్లు నిర్మాణ పనులను బట్టి నిధులు మంజూరు అవుతాయన్నారు.పార్టీ లేకుంటే కండువా లేకుంటే మనకు అవకాశం ఇచ్చేది ఎవరని.రాబోయే ఎన్నికల్లో పార్టీ బలంగా నిలబడాలంటే ముందుగా మన ప్రభుత్వం అధికారంలో ఉండాలి.కావున మనలో మనం కలిసి ఉండాలి. పాత కొత్త అనే తేడా ఉండకూడదని. పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మనపైన ఉందన్నారు.ఎవరైతే కింది స్థాయిలో పార్టీ జెండా మోసి బలోపేతానికి పనిచేశారో వారిని గుర్తించి వారికి పదవులు ఇస్తామన్నారు.క్రమశిక్షణ కలిగిన వారికే పార్టీ పదవులు వస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు,మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి లు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.




# సూచీలు రయ్..రయ్..

## హ్యాట్రిక్ లాభాల్లో మార్కెట్లు..
## సెన్సెక్స్ 1000 పాయింట్లు జంప్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది.అమెరికా డాలర్ ఇండెక్స్ మూడేళ్ల కనిష్ఠానికి చేరడంతో మన ఈక్విటీ మార్కెట్‌లోకి పెట్టుబడులు వెల్లువెత్తొచ్చన్న అంచనాలు కూడా తోడయ్యాయి. మెటల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ స్టాక్స్ ప్రధానంగా రాణించాయి. దీంతో సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,550 స్థాయికి చేరువైంది.



సెన్సెక్స్ ఉదయం 82,882.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,755.51) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కదలాడిన సూచీ.. ఆఖర్లో మరింత దూసుకెళ్లింది. ఇంట్రాడేలో 83,812.09 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1000.36 పాయింట్ల లాభంతో 83,755.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 304.25 పాయింట్ల లాభంతో 25,549 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.68గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ట్రెంట్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67.81 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,352 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# బంగారం ధరల హ్యాట్రిక్ తగ్గుదలకు బ్రేక్..



**జనంసాక్షి:**దేశంలో కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. మూడు రోజులుగా వరుసగా తగ్గి హాట్రిక్ కొట్టిన పసిడి ధరలకు నేడు (జూన్ 26) బ్రేక్ పడింది. దీంతో ఇంకాస్త తగ్గుతుందనుకున్న కొనుగోలుదారులకు నిరాశ ఎదురైంది. ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ ధరల్లో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, వడ్డీ రేట్ల హెచ్చుతగ్గులు, జువెలరీ మార్కెట్లతో సహా అనేక అంతర్జాతీయ అంశాలతో బంగారం రేట్లు ఆధారపడి ఉంటాయి. జూన్ 26 నాటికి దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్, 22 క్యారెట్ బంగారం ధరలు ఈ విధంగా ఉన్నాయి..

తెలంగాణ,ఆంధ్రాల్లో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,950.22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,070.హైదరాబాద్, విజయవాడ సహా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, స్థానిక జ్యువెలరీ షాపుల్లో మేకింగ్ ఛార్జీలు,జీఎస్టీ కారణంగా కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. నిన్నటితో పోలిస్తే వీటి ధరల్లో నేడు ఎటువంటి మార్పూ లేదు.

ఢిల్లీలో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.99,100.22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,850.ఢిల్లీలో బంగారం ధరలు రవాణా ఖర్చులు, స్థానిక ట్యాక్స్‌ల కారణంగా కొంత ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ నగరంలో బంగారం కొనుగోలుదారులు హాల్‌మార్క్ ఆభరణాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిన్నటితో పోలిస్తే వీటి ధరల్లో నేడు ఎటువంటి మార్పూ లేదు.

చెన్నైలో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,950.22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,070. చెన్నైలో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే కొంచెం ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ పోర్ట్ సౌకర్యాలు, డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేస్తున్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరల్లో నేడు ఎటువంటి మార్పూ లేదు.

ముంబైలో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,950.22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,070.ముంబైలో బంగారం ధరలు స్థానిక డిమాండ్, జ్యువెలరీ డిజైన్‌లపై ఆధారపడి మారుతూ ఉంటాయి. ఈ నగరంలో బంగారం కొనుగోలు చేసే ముందు పలు జ్యువెలరీ షాపుల ధరలను సరిపోల్చడం మంచిది. నిన్నటితో పోలిస్తే వీటి ధరల్లో నేడు ఎటువంటి మార్పూ లేదు.

బెంగళూరులో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.98,950.22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.90,070.బెంగళూరులో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి, కానీ స్థానిక ఆర్థిక పరిస్థితులు, ఫెస్టివల్ సీజన్ డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేయవచ్చు.

# ఇంటెల్‌లో కోతల మోత

### ఉద్యోగాల తొలగింపు ప్రారంభం

**జనంసాక్షి:**ఇంటెల్ కొత్త సీఈఓ లిప్-బు టాన్ నేతృత్వంలో కొనసాగుతున్న కంపెనీ వ్యయ నియంత్రణ, పునర్నిర్మాణ ప్రణాళికలో భాగంగా కాలిఫోర్నియాలో ఉద్యోగుల తొలగింపు ప్రారంభించారు.శాంటా క్లారా ప్రధాన కార్యాలయంలో ఉన్న 107 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ఇంటెల్ పేర్కొంది. 30 రోజుల్లో 50 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించినప్పుడు నోటిఫికేషన్ జారీ చేసేలా కాలిఫోర్నియా వార్న్ చట్టం నిర్దేశిస్తుంది. దీని ప్రకారం కంపెనీ సమర్పించిన ఫైలింగ్‌లో ఉద్యోగాల కోతలు ప్రారంభం కానున్నాయని తెలిసింది.జర్మనీలోని మ్యూనిచ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఆటోమోటివ్ చిప్ వ్యాపారాన్ని కూడా ఇంటెల్ మూసివేయనుంది. దాంతో ఇంటెల్ ఎక్స్‌పర్ట్ జాక్ వీస్ట్ నేతృత్వంలోని ఈ యూనిట్




ఉద్యోగుల్లో చాలా మంది కొలువులు కోల్పోయే అవకాశం ఉంది. బాధిత ఉద్యోగులకు 60 రోజుల నోటీసు లేదా నాలుగు వారాల నోటీసుతో పాటు తొమ్మిది వారాల పరిహారం, ఇతర వేతన ప్రయోజనాలను అందిస్తామని కంపెనీ తెలిపింది. మరోవైపు, జులై మధ్యలో ఇంటెల్ కాలిఫోర్నియాలోని గ్లోబల్ ఫ్యాక్టరీ కార్యకలాపాలను ప్రభావితం చేసే చర్యలు తీసుకోబోతుందని అధికారులు తెలిపారు. అప్పుడు కంపెనీ తన ఉద్యోగుల్లో మరో 20 శాతం మందిని తొలగిస్తుందని భావిస్తున్నారు.తాజాగా ప్రకటించిన ఉద్యోగ కోతల్లో ఇంటెల్ చిప్ అభివృద్ధికి కీలకమైన పలు ఇంజినీరింగ్ ఉద్యోగులను తొలగించడం గమనార్హం. వీరిలో ఫిజికల్ డిజైన్ ఇంజినీర్లు, లాజిక్ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టులు, క్లౌడ్ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌లు ఉన్నారు. ఇంజినీరింగ్ మేనేజర్లు, బిజినెస్ లీడ్లు, ఐటీ వైస్ ప్రెసిడెంట్ వంటి అనేక సీనియర్ లీడర్‌షిప్ రోల్స్‌లో సేవలందిస్తున్న వారున్నారు. శాంటా క్లారా సైట్‌లోని ఉద్యోగులు సీపీయూ, జీపీయూ డిజైన్ ప్రాజెక్టుల్లో పనిచేస్తారని కంపెనీ తెలిపింది. ఇప్పటికే ఇంటెల్ 2024లో 15,000 మంది ఉద్యోగులను తొలగించింది. మొత్తం ప్రధాన టెక్ కంపెనీల్లో 2025లో ఇప్పటివరకు 62,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారని లేఆఫ్స్.ఎఫ్‌వైఐ తెలిపింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా వంటి ప్రధాన సంస్థలు వ్యయాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఉద్యోగాల కోతను ప్రకటించాయి.

# మినిమమ్ బ్యాలెన్స్ లేకపోతే మోతే..
## ఈ బ్యాంకులో కొత్త ఛార్జీలు

**(జనంసాక్షి):**కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు మినిమమ్ బ్యాలెన్స్ నిర్వహణ ఛార్జీలను తొలగిస్తున్నప్పటికీ మరికొన్ని ప్రైవేట్ బ్యాంకులు మాత్రం ఖాతాదారులపై కనీస బ్యాలెన్స్ ఛార్జీలను మోపుతున్నాయి.తాజాగా డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ సింగపూర్ (డీబీఎస్) ఇండియా సేవింగ్స్ ఖాతాలో అవసరమైన నెలవారీ సగటు బ్యాలెన్స్‌ను నిర్వహించకపోతే ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 1 నుండి బ్యాంకు సేవింగ్స్ ఖాతాలో అవసరమైన నెలవారీ సగటు బ్యాలెన్స్‌ను నిర్వహించకపోతే ఎంత అయితే లోటు ఉంటుందో దానిపై 6% రుసుము చెల్లించాలి. డీబీఎస్ బ్యాంక్ ఇండియా వెబ్సైట్ ప్రకారం.. బ్యాలెన్స్ నిర్వహించనందుకు ఛార్జీలు లోటులో 6% ఉంటాయి. ఇది గరిష్టంగా రూ .500 ఉంటుంది. డీబీఎస్ బ్యాంక్ రెగ్యులర్ సేవింగ్స్ ఖాతాలో సగటు నెలవారీ బ్యాలెన్స్ (ఏఎంబీ) రూ .10,000 నిర్వహించాల్సి ఉంటుంది.కాగా డీబీఎస్ బ్యాంక్ ఇప్పటికే ఏటీఎం నగదు ఉపసంహరణ రుసుమును పెంచింది. ఉచిత పరిమితికి మించి ఏటీఎం నగదు ఉపసంహరణ లావాదేవీలకు గరిష్టంగా రూ .23 వసూలు చేయడానికి బ్యాంకులను అనుమతించే ఆర్బీఐ నోటిఫికేషన్ తరువాత, డీబీఎస్ బ్యాంక్ తన రుసుమును అప్డేట్ చేసింది. మే 1 నుండి ఉచిత పరిమితికి మించి నాన్ డీబీఎస్ బ్యాంక్ ఏటీఎం నగదు ఉపసంహరణ లావాదేవీలపై రూ.23 వసూలు చేస్తోంది. అయితే డీబీఎస్ బ్యాంక్ ఏటీఎంలలో ఎటువంటి రుసుము లేకుండా అపరిమితంగా నగదును ఉపసంహరించుకోవచ్చు.

### యూనియన్ బ్యాంక్ ఈడీకి ఊహించని షాక్..

న్యూఢిల్లీ: యూనియన్ బ్యాంక్ ఈడీ పంకజ్ ద్వివేదికి ఊహించని అనుభవం ఎదురైంది. జనరల్ మేనేజర్‌గా ఆయన హోదాను తగ్గిస్తూ కేంద్ర ఆర్థిక సేవల విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది.పూర్వపు హోదాలో జనరల్ మేనేజర్‌గా పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌కు పంపించింది.ఢిల్లీ హైకోర్టులో ద్వివేదికి వ్యతిరేకంగా కేసు పెండింగ్‌లో ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. యూనియన్ బ్యాంక్ ఈడీగా ద్వివేది నియామకాన్ని సవాలు చూస్తే ఢిల్లీ హైకోర్టులో గతేడాది ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది.విజిలెన్స్ క్లియరెన్స్ లేకుండా ఈడీగా నియమించడం నిబంధనల ఉల్లంఘనంటూ పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విజిలెన్స్ విభాగం ఆమోదం లేకుండా నియామకం ఎలా చేశారని ప్రశ్నించారు

# మెసేజ్ ఎంత పెద్దదైనా చిటికెలో సారాంశం

మెటా వాట్సప్‌లో కొత్త ఏఐ ఆధారిత ఫీచర్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపింది. వాట్సప్‌లో చదవని మెసేజ్‌ల సంక్షిప్త సారాంశాన్ని తెలుసుకునేందుకు మెటా ఏఐ సాయం చేయనుందని పేర్కొంది.ఈ ఫీచర్‌లో భాగంగా యూజర్లు నిత్యం పెద్ద టెక్ట్స్ మెసేజ్‌లను స్క్రోల్ చేసి పూర్తిగా చదవకుండా మెటా ఏఐ అందులోని సంక్షిప్త సారాంశాన్ని అందిస్తుంది. ఇంగ్లిష్ సపోర్ట్‌తో పనిచేసే ఈ ఫీచర్ ప్రస్తుతం అమెరికాలోని వాట్సప్ యూజర్లకు అందుబాటులో ఉన్నట్లు మెటా తెలిపింది. ఈ ఏడాది చివర్లో క్రమంగా మరిన్ని ప్రాంతాలతోపాటు ఇతర భాషలకు ఈ ఫీచర్‌ను విస్తరిస్తామని స్పష్టం చేసింది.మెటా తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఫీచర్ వన్-ఆన్-వన్, గ్రూప్ చాట్స్ రెండింటికీ అందుబాటులో ఉంటుంది. నిత్యం మెసేజ్‌లు వచ్చే గ్రూప్‌లు, వ్యక్తులకు ఈ ఫీచర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కంపెనీ తెలిపింది. ఏఐ మెసేజ?లు చదివే క్రమంలో యూజర్ల కంటెంట్‌పట్ల భద్రత పాటిస్తామని వాట్సప్ హామీ ఇచ్చింది. ఏఐ ఫీచర్ డేటాను బాహ్య సర్వర్లకు ప్రసారం చేయకుండా లేదా కంపెనీ సిస్టమ్‌లకు బహిర్గతం చేయకుండా ప్రాసెస్ చేస్తుందని తెలిపింది. యూజర్ల ప్రాధాన్యతలను గౌరవించడానికి వాట్సప్ డిఫాల్ట్‌గా ఈ ఫీచర్‌ను ఎనేబుల్ చేయదని చెప్పింది. మాన్యువల్‌గానే దీన్ని యాక్టివేట్ చేసుకోవాలని పేర్కొంది. ఇది ఆప్షనల్ ఫీచర్‌గా మాత్రమే ఉంటుందని తెలిపింది. అడ్వాన్స్‌డ్ చాట్ ప్రైవసీ కంట్రోల్స్‌లో యూజర్లు తమ సెట్టింగ్స్‌ను మార్చుకోవచ్చని స్పష్టం చేసింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.45 | ₹ 5.47 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 90,700 (22 క్యారెట్లు) | ₹ 98,950 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,18,000

# ఖమేనీ ఎక్కడ?
## ఇరాన్ ప్రజల ఆందోళన..



టెహ్రాన్: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగాయి. ఇదే సమయంలో ఇరాన్‌పై అమెరికా సైతం ఆకస్మిక దాడులకు దిగింది. దీంతో, మూడో ప్రపంచ యుద్ధం జరుగుతోందా?అన్న భయాందోళన నెలకొంది. కానీ, అనూహ్య పరిణామాలతో యుద్ధ వాతావరణం సద్దుమణిగింది. అయితే, వారం రోజులుగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఇప్పటి వరకు కనిపించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇక, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అదృశ్యమయ్యారు. వారం రోజులుగా ఖమేనీ బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. యుద్ధం కొనసాగుతున్న సమయంలో కూడా ఖమేనీ వాయిస్ కూడా బయటకు వినిపించలేదు. దీంతో ఇరాన్ నేతలు, ప్రజలు ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా తీవ్రమైన ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, యుద్ధం ప్రారంభం తర్వాత సుప్రీం లీడర్ ఖమేనీని రహస్య భూగర్భ బంకర్‌కు తరలించారని వార్తలు బయటకు వచ్చాయి. ఆయనను ఎవరూ టార్గెట్ చేయకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌కు దూరంగా ఉంచినట్టు సన్నిహిత అధికారులు చెబుతున్నారు.ఇరాన్ ప్రభుత్వ అగ్రశ్రేణి వ్యక్తులకు కూడా ఆయనతో ప్రత్యక్ష సంబంధం తెగిపోయినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. మంగళవారం ప్రైమ్-టైమ్ ఇరాన్ స్టేట్ టెలివిజన్ షో హోస్ట్ ఖమేనీ కార్యాలయంలో సీనియర్ అధికారి మెహదీ ఫజేలీని సుప్రీం లీడర్ ఆచూకీ గురించి అడిగారు. ఈ సందర్భంగా ప్రజలు సుప్రీం లీడర్ గురించి చాలా ఆందోళన చెందుతున్నారు. ఆయన ఎలా ఉన్నారో మాకు చెప్పగలరా? అని ప్రశ్నించారు. కానీ ఫజేలీ.. మాత్రం ఆ ప్రశ్నను పక్కనపెట్టి మనమందరం ప్రార్థన చేయాలి. సుప్రీం లీడర్‌ను రక్షించే పనిలో ఉన్నవారు తమ పనిని చేస్తున్నారు అని చెప్పుకొచ్చారు.ఇదిలా ఉండగా.. దశాబ్దాలుగా ఇరాన్‌ను మకుటం లేని మహారాజులా ఏలుతున్న 86 ఏళ్ల ఖమేనీ కోసం ఇజ్రాయెల్ నిఘా వర్గాలు వేట సాగిస్తున్నాయి. ఆయనకు విదేశాల్లోనే కాదు, సొంత దేశంలోనూ శత్రువులున్నారు. ఖమేనీ ఆచూకీ దొరికితే సజీవంగా బంధించి, చట్టప్రకారం శిక్షించడమో లేక అక్కడికక్కడే అంతం చేయడమో తథ్యమని పశ్చిమ దేశాల మీడియా అంచనా వేస్తోంది. ఇరాన్‌లో తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్టించాలంటే ఆయన ప్రాణాలతో ఉండడానికి వీల్లేదని ఇజ్రాయెల్, అమెరికా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఖమేనీ భౌతికంగా లేకుండాపోతేనే ఈ యుద్ధం ముగుస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేయడం గమనార్హం. ఖమేనీ ఆధునిక హిట్లర్. అతడు బతికి ఉండడానికి వీల్లేదని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు.

**చావుకు భయపడే మనిషి కాదు..**

ఇరాన్‌లో ఈ నెల 12న ఇజ్రాయెల్ సైన్యం హఠాత్తుగా దాడికి దిగింది. ఆ వెంటనే ఖమేనీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గుర్తుతెలియని ప్రాంతంలో అత్యంత పటిష్టమైన భద్రత కలిగిన బంకర్‌లో ఆయన క్షేమంగా ఉన్నట్లు ఇరాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. సుశిక్షితులైన బాడీగార్డులు ఆయనకు రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొంటున్నాయి.

# చైనా కొత్త ఎత్తుగడ

### భారత్‌కు సరఫరా చేసే స్పెషాలిటీ ఫర్టిలైజర్స్ ఎగుమతుల నిలిపివేత..!

చైనా నుంచి భారత్‌కు ప్రత్యేక ఎరువుల ఎగుమతి గత రెండు నెలలుగా నిలిచిపోయింది. మరో వైపు బీజింగ్ ఇతర దేశాలకు మాత్రం వీటిని సరఫరా చేయడం గమనార్హం.ముఖ్యంగా పండ్లు, కాయగూరలు, ఇతర పంటల్లో కాపును గణనీయంగా పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఈ రకం ఎరువులను ఎగుమతి చేయాలంటే సదరు ఫ్యాక్టరీ షిప్‌మెంట్లను చైనా అధికారులు తనిఖీలు చేయాలి. ఈ నేపథ్యంలో భారత్‌కు షిప్‌మెంట్స్‌ను వారు తనిఖీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. స్పష్టమైన నిషేధం ఏదీ విధించకుండానే.. ఎగుమతులను అడ్డుకొనేందుకు బీజింగ్ ఈ ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది.మొక్కలు, చెట్లకు భూ,వాతావరణ పరిస్థితుల ఆధారంగా కొన్ని రకాల పోషకాలను అందించి ఫలసాయం సాధించేందుకు తయారు చేసిన వాటిని ప్రత్యేకమైన ఎరువులుగా వ్యవహరిస్తారు. వీటిల్లో పలు రకాలు ఉంటాయి. ఈ రకం ఎరువులను పెద్ద ఎత్తున తయారు చేసుకొనే సామర్థ్యం భారత్‌కు లేదు. చిన్న మొత్తాల్లో స్థానికంగా తయారు చేస్తుంటారు. కానీ, ఆర్థికంగా ఇవి వారికి లాభదాయకం కాదు. భారత్ వినియోగించే వాటిల్లో 80శాతం చైనా నుంచే దిగుమతి అయ్యేవి. నాలుగైదు ఏళ్లుగా భారత్‌కు ఈ సరఫరాలను చైనా నియంత్రిస్తోంది. ఈ సారి మాత్రం పూర్తిగా ఆపేయడం గమనార్హమని సోలబుల్ ఫర్టిలైజర్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజిబ్ చక్రబర్తి పేర్కొన్నారు.భారత్ జూన్ నుంచి డిసెంబర్ మధ్యలో 1,50,000-1,60,000 టన్నుల స్పెషాలిటీ ఎరువులను దిగుమతి



చేసుకొంటుందని డేటా చెబుతోంది. భూసారాన్ని కాపాడుతూ.. ఫలసాయాన్ని పెంచేందుకు వీటిని వినియోగిస్తారు. ఈ రంగంలో దీపక్ ఫర్టిలైజర్స్, ప్రదీప్ ఫర్టిలైజర్స్, నాగార్జున ఫర్టిలైజర్స్ కంపెనీలు అధికంగా వ్యాపారం చేస్తున్నాయి. దీంతో భారత్ ఇప్పుడు పశ్చిమాసియా, ఐరోపాలోని ఉత్పత్తి దారుల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.గత ఐదేళ్లుగా భారత్-చైనా మధ్య దౌత్యపరమైన విభేదాలు తలెత్తడం, ఇస్లామాబాద్‌తో బీజింగ్ సంబంధాలు బలోపేతం కావడం వంటివి దీనికి కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికే చైనా రేర్ ఎర్త్ మాగ్నెటిక్స్ ఎగుమతులపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

# ఎస్‌ఎస్‌లో సంతకానికి భారత్ నిరాకరణ

బీజింగ్/న్యూఢిల్లీ: 2025 జూన్ 26న చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంతో ఉమ్మడి ప్రకటన పత్రంపై సంతకం చేయడాన్ని ఆయన నిరాకరించారు. చైనా పర్యటనలో ఉన్న భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి, సీమాంతర ఉగ్రవాదం గురించి ఆయన కీలక ప్రసంగం చేశారు. అనంతరం సమావేశానికి సంబంధించిన జాయింట్ డాక్యుమెంట్‌ను ఆయన ముందు ఉంచారు. అయితే..అందులో పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంతో ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేయాల్సి వచ్చింది. చైనాలోని క్వింగ్డావోలో షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు చైనా అధ్యక్షత వహిస్తోంది. ఇందులో ఆతిథ్య దేశంతో పాటు భారత్, పాకిస్థాన్‌తో పాటు 10 సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. బెలారస్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ ఈ ఆర్గనైజేషన్‌లో సభ్య దేశాలుగా ఉన్నాయి. సదస్సు అనంతరం రూపొందించిన జాయింట్ డాక్యుమెంట్.. జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న పహల్గాం ఉగ్రదాడి ఘటనను అందులో ప్రస్తావించలేదు. అదే సమయంలో బలోచిస్థాన్ అంశాన్ని చేర్చి భారత్‌ను నిందించే ప్రయత్నం జరిగింది.దీంతో ఉగ్రవాదంపై భారత వైఖరిని నీరుగార్చేలా ఉన్న ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఈ భిన్నాభిప్రాయాల నేపథ్యంతో రక్షణ మంత్రుల సంయుక్త

# న్యూయార్క్ మేయర్ అభ్యర్థిపై కంగనా ఘాటు విమర్శలు

న్యూఢిల్లీ: న్యూయార్క్ మేయర్ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీపై బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ ఘాటు విమర్శలు చేశారు. డెమొక్రటిక్ ప్రైమరీ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన మమ్దానీ గెలుపొందిన తర్వాత అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించగా, కంగనా రనౌత్



సైతం అతని గెలుపును ఉద్దేశిస్తూ మండిపడ్డారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ఎక్స్' ద్వారా మమ్దానీ భారతీయుడి కంటే పాకిస్తానీగానే ఎక్కువగా కనిపిస్తున్నాడని ఆరోపించారు కంగనా. ఏమమ్దానీ తల్లి మీరా నాయర్.. భారత అత్యుత్తమ చిత్ర నిర్మాణ రంగానికి కృషి చేసి పేరు సంపాదించారు. పద్మశ్రీ కూడా గెలుచుకున్నారు. ఆమె న్యూయార్క్‌లో ఉన్నప్పటికీ భారత్‌లో పుట్టి పెరిగారు.గుజరాత్‌కు చెందిన మెహ్మూద్ మమ్దానీని మ్యారేజ్ చేసుకుని న్యూయార్క్‌లో సెటిల్ అయ్యారు. మెహ్మూద్ మమ్దానీకి కూడా రచయితగా మంచి గుర్తింపు ఉంది. మరి జోహ్రాన్ మమ్దనీ మాత్రం పాకిస్తానీలాగా కనిపిస్తున్నాడు. భారత మూలాలు ఎక్కడ కనిపించడం లేదు. అతని భారత మూలాల్లో జరిగిందేదో జరిగింది. కానీ మమ్దానీ మాత్రం యాంటీ ఇండియన్ కాబోతున్నాడు' అని కంగనా రనౌత్ రాసుకొచ్చారు. కాగా, 33 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ డెమొక్రాటిక్ మేయర్ ఎన్నికల్లో విజయం సాధించి రేసులో నిలిచాడు. ఉగాండాలో భారతీయ మూలాలున్న కుటుంబంలో జన్మించారు. తండ్రి ప్రొఫెసర్ మహ్మూద్ మమ్దానీ, తల్లి ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్. భార్య సిరియా మోడల్ రమా దువాజీ రాజకీయ నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా న్యూయార్క్ మేయర్ రేసు ప్రచారంలో తొలి నుంచి.. ఉచిత బస్సు ప్రయాణం హామీతో బాగా పాపులారిటీ సంపాదించుకున్నాడు.అలాగే పిల్లల సంరక్షణ, సంపన్నులపై అధిక పన్నులు లాంటి హామీలతో ప్రచారంలో ఏడాదిగా దూసుకుపోతున్నాడు. అలెగ్జాండ్రియా ఒకాసియో-కార్టెజ్, బెర్నీ సాండర్స్ వంటి ప్రముఖులు ఇతనికి మద్దతుగా నిలిచారు. అయితే.. పాలస్తీనా మద్దతుతో పాటు పరిపాలనా అనుభవం లేమి వంటి అంశాలపై విమర్శలూ ఎదుర్కొన్నాడు.అయితే జోహ్రాన్ మమదానీకి జనాల్లో మాత్రం విపరీతమైన ఆదరణ ఉంది. మరీ ముఖ్యంగా యువతలో. సోషల్ మీడియాను ఏడాది కాలంగా బాగా ఉపయోగించుకుంటూ ప్రచారాన్ని సమర్థవంతంగా నిర్వహించుకుంటున్నారు. మద్దతుదారులతో డ్యాన్స్ చేస్తూ, మజ్జిగ పంచుతూ సంబరాలు చేస్తూ వీడియోలు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఎన్నారై కమ్యూనిటీని ఆకట్టుకునేందుకు బాలీవుడ్ సాంగ్స్, డైలాగులతో షార్ట్ వీడియోలతో సైతం ప్రచారం నిర్వహిస్తూ ఆకట్టుకుంటున్నారు.

### అతనితో అమెరికాకే ప్రమాదం!
ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు

వాషింగ్టన్:న్యూయార్క్ నగర మేయర్ అభ్యర్థిగా.. డెమొక్రటిక్ పార్టీ జోహ్రాన్ మమ్దానీ విజయాన్ని ప్రస్తావిస్తూ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో డెమొక్రటిక్ పార్టీ పైనా.. ఆ పార్టీలోని నేతలపైనా ఆయన సెటైర్లు వేశారు. "చివరకు అనుకున్నదే జరిగింది. డెమొక్రట్స్ గీతను దాటేశారు. జోహ్రాన్ మామ్దానీ అనే వ్యక్తి 100 శాతం కమ్యూనిస్ట్ పిచ్చోడు. అలాంటి వ్యక్తి ఆ పార్టీ మేయర్ అభ్యర్థిత్వానికి జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో విజయం సాధించే.. రేసులో నిలబడ్డాడు. అతనేం చురుకైన వ్యక్తేం కాదు. చూడటానికే భయకరంగా ఉంటాడు. అతని స్వరమూ కఠోరంగా ఉంటుంది. అతనికి మద్దతు ఇస్తున్నవాళ్లంతా డమ్మీలే. అలెగ్జాండ్రియా ఒకాసియో-కోర్టెజ్ తోపాటు చివరకు మా గ్రేట్ పాలస్తీనా సెనేటర్ చక్ షూమర్ సహా. అతను గెలిస్తే దేశానికే ముప్పు" అంటూ వ్యంగ్యంగా ట్రంప్ ఓ పోస్ట్ చేశారు.ఈ విమర్శ ఇక్కడితోనే ఆగిపోలేదు. మరో పోస్టులో డెమొక్రటిక్ పార్టీ నాయకత్వాన్ని విమర్శిస్తూ.. "డెమొక్రాట్లు రాజకీయంగా తిరిగి కీలక పాత్రలోకి రావాలంటే నా దగ్గర ఓ ఆలోచన ఉంది. ఆ పార్టీలో కొందరిని సంవత్సరాలుగా పక్కన పడేశారు. మరీ ముఖ్యంగా 2024 అధ్యక్ష ఎన్నికల్లో చారిత్రక పరాజయం ఎదురైన తర్వాత. డెమొక్రటిక్ మహిళా నాయకురాలు జాస్మిన్ క్రాకెట్ అనే తక్కువ తెలివి గల అభ్యర్థిని అధ్యక్ష పదవికి నామినేట్ చేయాలి. అలెగ్జాండ్రియా ఒకాసియో-కోర్టెజ్‌తో పాటు మిగిలిన ముగ్గురు వరుసగా ఉపాధ్యక్ష, కేబినెట్‌లో ఉన్నత పదవుల్లో ఉండాలి. వీళ్లతో పాటు న్యూయార్క్‌కు భవిష్యత్తులో కమ్యూనిస్టు మేయర్‌గా గెలిస్తే.. దేశం నాశనం అవుతుంది!" అని అన్నారు



# వారానికి 32 గంటలు చాలు

### యూఎస్ సెనేటర్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ ఉద్యోగుల తొలగింపు అధికమవుతోంది. టెక్ కంపెనీలు వ్యయం ఆదా చేసుకొని ఇతర విభాగాల్లో పెట్టుబడి పెట్టేందుకు ఏఐ తోడ్పడుతుంది. కృత్రిమ మేధ వ్యాపారాలకు సహాయం చేస్తుంటే, వాటి సామర్థ్యాన్ని పెంచుతుంటే ఆయా సంస్థలు ఉద్యోగుల వర్క్-లైఫ్ సమతుల్యతను మెరుగుపరచాలని సెనేటర్ బెర్నీ శాండర్స్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఏఐ ఆటోమేషన్ పెరుగుతున్న తరుణంలో ఉద్యోగులు వారానికి నాలుగు రోజులు మాత్రమే పనిచేసేలా వాతావరణాన్ని సృష్టించాలన్నారు.జో రోగన్ ఎక్స్‌పీరియన్స్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన బెర్నీ శాండర్స్ వారానికి 32 గంటల పనిదినాలు ఉండాలని చెప్పారు.

# పోటీ చేయని రాజకీయ పార్టీలపై ఈసీ కొరడా

లేవని ఈసీ గుర్తించి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలు ఉన్నాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల సంఘం వద్ద సుమారు 2800కి పైగా గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి. సాధారణంగా ఒక పార్టీ గుర్తింపు పొందాలంటే సాధారణ ఎన్నికల్లో కనీసం 6% ఓట్లను లేదా నిర్దిష్ట సంఖ్యలో సీట్లను గెలుచుకోవాలి. మిగిలిన పార్టీలను నమోదిత గుర్తింపులేని పార్టీలుగానే పరిగణిస్తారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27 జూన్ 2025

## చేరికలకు ఆహ్వానం..
# తలుపులు తెరిచిన ఎంఐఎం



- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో చేరికలకు గ్రీన్ సిగ్నల్ అధినేత ఓవైసీ
- స్థానికసంస్థల, మున్సిపల్ ఎన్నికల వరకు ఎంఐఎంను బలోపేతం చేయాలి
- గులాం అహ్మద్ హుస్సేన్‌కు ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఆదేశం

**కరీంనగర్, జూన్ 26 (జనంసాక్షి) :** రాబోయే స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, ఎంఐఎం పార్టీని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంస్థాగతంగా బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సంస్థాగతంగా నిర్మాణ పరంగా బలోపేతం చేయాలని ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ను ఆదేశించారు. గురువారం ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీని హైదరాబాద్లోని ఎంఐఎం పార్టీ జాతీయ కార్యాలయం దారుస్సలామ్ లో గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం పార్టీ నగర సహాయ కార్యదర్శి హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ పార్టీల నుండి చేరబోయే వారిని ఎంఐఎం పార్టీలోకి ఆహ్వానించాలని ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి, పెద్దపల్లి, గోదావరిఖని, రామగుండం, సిరిసిల్ల, హుజురాబాద్, జమ్మికుంట, వేములవాడ, కరీంనగర్ మున్సిపల్ పరిధిలో విస్తృతంగా చేరికల కార్యక్రమాన్ని చేపట్టాలని, తమ అధినేత ఓవైసీ స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారని, గులాం అహ్మద్ వివరించారు.

ఇతర పార్టీల నుండి చేరేవారికి ఎంఐఎం లో తలుపులు తెరిచి ఉన్నాయన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని సెక్యులర్ నాయకులతోపాటు ఎస్సీ ఎస్టీ, బీసీ నాయకులను సైతం ఎంఐఎం లో చేరికలకు ఆహ్వానం ఉంటుందని సామాజిక న్యాయమే లక్ష్యంగా అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని మున్సిపల్ ఏరియాల్లో పర్యటించి ఎంఐఎం లో చేరబోయే వారిని పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. జిల్లాలో నిర్ణయాత్మక శక్తిగా ఎంఐఎం ను బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేయాలని తమ అధినేత ఆదేశించినట్లు తెలిపారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. ఉన్నత స్థానాలకు ఎదగాలి

● రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 26 (జనంసాక్షి) :** విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని,ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.గురువారం యాంటీ డ్రగ్ డే సందర్భంగా మత్తుపదార్థాల నిర్మూలన వారోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, విద్యార్థులు, పోలీస్ అధికారులతో కలిసి అంబేద్కర్ చౌక్ నుంచి పద్మనాయక ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ తీశారు.ప్రజలను ఆకట్టుకుంటూ ఆలోచింపచేసేలా ఉన్న గంజాయి రహిత సమాజం%-%మనందరిబాధ్యత, డ్రగ్స్‌కి నో చెప్పండి, ఆరోగ్యమే అసలైన సంపద వంటి ఫ్లకార్డ్ లను ప్రదర్శించి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి పక్కా ప్రణాళిక ప్రకారం చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. డ్రగ్స్ ను వినియోగించి సమాజానికి ఇబ్బంది కలిగించే పౌరులుగా మారవద్దన్నారు. డ్రగ్స్ వినియోగంతో మెదడు, కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతింటాయని రాను రాను ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. డ్రగ్స్ వినియోగంతో శారీరకంగానే






కాకుండా మానసిక ఇబ్బందులు, సామాజిక రుగ్మతలు తలెత్తుతాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన ఉండి వాటికి దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ కు దూరంగా ఉంటూ ఉత్తమ సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ విద్యార్థులు, యువత తమ పరిసరాలు, విద్యాలయాలు ఇతర చోట్ల ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా, తరలించినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. డ్రగ్స్ రహిత సమాజంతో మన రాష్ట్రం అలాగే దేశం ఉన్నతంగా ఉంటుందన్నారు. విద్యార్థులు యువత డ్రగ్స్ కు దూరంగా ఉంటూ యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారాలని ఆకాంక్షించారు.యాంటీ డ్రగ్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన ఇతర పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, పతకాలను కలెక్టర్, ఎస్పి అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులు అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఫంక్షన్ హాల్ ఆవరణలో వివిధ పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను పరిశీలించారు.విద్యార్థులు గీసిన చిత్రాలు, తయారు చేసిన పెయింటింగ్ లను చూసి కలెక్టర్, ఎస్పీ వారిని అభినందించారు.అలాగే యాంటీ డ్రగ్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ పై కలెక్టర్, ఎస్పీ, అధికారులు సంతకాలు చేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సిఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్,నతేష్,మధుకర్, నాగేశ్వరరావు, ఆర్ఐలు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## లండన్‌లో కైవల్య అకాడమీ మొదటి వార్షికోత్సవ వేడుకలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 26 (జనంసాక్షి) :** లండన్ లో కైవల్య అకాడమి ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చర్ సంస్థ మొదటి వార్షికోత్సవం బుధవారం రగ్బీ లోని కార్క్ సన్ థియెటర్లో నిర్వహించారు.అకాడమి అద్యక్షురాలు, కూచిపూడి నాట్యాచారిణి కోపల్ వేదంవారి శిష్యులు ప్రార్థన,పూర్వరంగం,జతిస్వరం, తరంగం ప్రదర్శించారు.కూచిపూడి నాట్యరీతిలో బాము ప్రదర్శించిన మోహని ఘట్టం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.ముఖ్య అతిధులుగా లెమిగ్టన్,మేయర్ రగ్గి సింగ్, కౌన్సిలర్ శ్రీరామ్,హేమ,ఎల్లా ప్రగడలు విద్యార్థులకు సర్టిఫికెట్లను, జ్ఞాపికలను అందచేసారు.ఈ కార్యక్రమంలో డా.సురేష్ గురిజాల, డా.కామాక్షి, కౌన్సిలర్ ప్రభాకర్,చిత్ర సురేష్ ,దీపా, రష్మీ ,సుధీర్, రమ్య నంబియార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనకు పక్కా ప్రణాళిక




**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 26 (జనం సాక్షి) :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా జిల్లా పర్యటనకు వస్తున్నందున పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినయ్కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో సీపీ సాయి చైతన్యతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న కేంద్ర హోంమంత్రి అమిత్షా నగరంలోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయానికి ప్రారంభోత్సవం చేస్తారన్నారు. అనంతరం బైపాస్ చౌరస్తాలో డీ. శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత పాలిటెక్నిక్ గ్రౌండ్లో రైతుసభలో పాల్గొంటారని వివరించారు. పాలిటెక్నిక్ గ్రౌండ్లో జరిగే సభకు ట్రాఫిక్ ఇబ్బందుల రాకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక హెలీకాప్టర్లో ఆయన జిల్లాకు వస్తున్నందున కలెక్టరేట్లో హెలీప్యాడ్ సిద్ధం చేయాలని ఆర్అండ్బీ అధికారులకు సూచించారు. ఎక్కడా కూడా లోటుపాట్లకు తావులేకుండా పర్యటకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రతాపరంగా సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సీపీ సాయిచైతన్య సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లోని హైలాండ్ జంక్షన్లపై ఫోకస్

### తనిఖీచేసి పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

**కరీంనగర్ బ్యూరో, జూన్ 26 (జనంసాక్షి) :**పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేదించాలని నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు నగరంలో అధికారులతో కలిసి కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యటించారు. నగర సుంధరీకరణ లో భాగంగా ప్రధాన రహాదారులలో డివైడర్స్ అండ్ మీడియమ్స్‌తో పాటు నగరంలోని బస్టాండ్, తెంగాణ చౌక్, ఐబీ గెస్ట్ హౌజ్, కోర్ట్, మంచి ర్యాల్ చౌరస్తా, బొమ్మకల్ తదితర హైలాండ్ జంక్షన్లను తనిఖీ చేసి పరిశీలించారు. హైలాండ్ జంక్షన్లు మీడియమ్స్ లలో కార్మీకులతో చెత్తను తొలగించి వేయడంతో పాటు కూడళ్ళ రేలింగ్ చుట్టు ఉన్న ఫ్లెక్సీలను తొలగించి వేశారు. అధికారులకు హైలాండ్ల సుంధరీకరణ కు సంబంధించి పలు ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు నగరంలోని మార్కెట్ రోడ్లలో ఇరు వైపుల ఉన్న ఫుట్ పాత్ ఎంక్రోజ్ మెంట్ల పై కొరడా జులుపించారు. ఫుట్ పాత్ , రోడ్ల ను ఆక్రమించిన ఎంక్రోమెంట్లను డీఆర్ఎఫ్ అధికారులు సిబ్బందితో స్థానికంగా ఉండి తొలగించి వేశారు. ఆక్రమణలు, పరిశుభ్రత పై వ్యాపారులకు సూచించారు. మరో వైపు మార్కెట్ మంచి నీటి రిజర్వాయర్ ను సందర్శించి తనిఖీ చేశారు. రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను పరిశీలించి స్థానిక సిబ్బందిని మంచి నీటి సరఫరా తీరు, ట్యాంక్ ల ఫిల్లింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజర్వాయర్ సిబ్బంది రిజిస్టర్లను తనిఖీ చేసి వివరాల పై ఆరా తీశారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... కరీంనగర్ నగరపాలక సంస్థ లో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతంగా కొనసీగుతున్నాయని



అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి రోజు ఇచ్చిన షెడ్యూల్డ్ ప్రకారం డివిజన్ల వారిగా కార్యక్రమాలను విజయవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. నగర సుంధరీకరణ లో భాగంగా నగరంలోని డివైడర్స్ మీడియమ్స్ తో పాటు హైలాండ్ జంక్షన్ల లో కార్మీకులు చెత్తను శుభ్రం చేయాలన్నారు.

నగరపాలక సంస్థ ఇప్పటికే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేదించిందని తెలిపారు. నగర ప్రజలు ఎవరు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వాడకూడదని పూర్తిగా దాన్ని నిషేదించి పర్యావరణ పరిరక్షణ కు సహాకరించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం మనవ మనుగడకు చాలా ప్రమాధకరమని సూచించారు. ప్లాస్టిక్ పై ప్రజలు సమరం చేయాలన్నారు. నగరపాలక సంస్థ ద్వారా ప్లాస్టిక్ నివారణ చర్యలో బాగంగ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి... ప్లాస్టిక్ వాడే వ్యాపారులకు జరిమానా విధిస్తామని తెలిపారు. నగర ప్రజలకు సమయానికి అనుగుణంగా ఇంజనీరింగ్ అధికారులు మంచి నీటిని సరఫరా చేయాలని త్రాగు నీటి విషయంలో ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు రాకుండా చర్యలు తీస్కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ వేణు మాధవ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ స్వామీ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 26 (జనంసాక్షి) :** వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు పేరును ఎన్నికల ఓటర్ జాబిత నుండి తొలగించేందుకు ఆయన నివాసమైన సంగీత నిలయానికి గురువారము రెవెన్యూ అధికారులు నోటీసులు అంటించారు. గతంలో హైకోర్టు చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడేనని నిర్ధారించినందున క్రమంలో ఎన్నికల ఓటర్ జాబితా నుండి ఫామ్ 7 ప్రకారం ఆయన పేరును తొలగిస్తున్నట్లు ఇంటికి నోటీస్ అంటివేసి రిజిస్ట్రార్ పోస్ట్ చేశారు. ఓటర్ జాబితా నుండి పేరు తొలగింపుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే జూలై 2 లోగా సమాధానం ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకే ఎన్నికల ఓటర్ జాబితా నుండి పేరు తొలగిస్తూ నోటీసులు జారీ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

## భక్తులు లేక వెలవెలబోతున్న రాజన్న ఆలయం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 26 (జనంసాక్షి) :** గురువారం ఆషాడమాసం ప్రారంభమైంది. తెలంగాణలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయం ఆషాడమాసం కావడంతో ఆలయ పరిసరాలు నిర్మానుషంగా మారాయి. మొన్నటి వరకు భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయంలో క్యూలైన్స్ ప్రస్తుతం భక్తులు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మొన్నటి వరకు స్వామివారి దర్శనానికి గంటల తరబడి సమయం పట్టగా ఆషాడమాసంలో భక్తులు నిమిషాల్లోనే స్వామివారిని దర్శించుకుంటున్నారు.

## కొడుకు చూసేందుకు వచ్చి తల్లి మృతి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 26 (జనంసాక్షి) :** హాస్టల్లో ఉన్న కొడుకుని చూసేందుకు వచ్చి,కన్న కొడుకు ముందే తల్లి కుప్పకూలి మృతి చెందిన ఘటన గురువారం వేములవాడలో చోటుచేసు కుంది. వివరాల్లోకి వెళ్తే వేములవాడ రాజన్న ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కృత పాఠశాలలో చదువుకుంటున్న తన కుమారుడు నరేష్ ను చూడడానికి జగిత్యాల జిల్లా పోలాస గ్రామానికి చెందిన తల్లి నల్లూరి చందన (32) తన భర్తతో గురువారం వచ్చింది. కొడుకుతో మాట్లాడుతుండగా కండ్లు తిరుగుతున్నాయని, కూర్చుండపోయి కుప్పకూలీ స్పృహ కోల్పోయింది.దీంతో హుటాహుటిన ఆ పాఠశాల అధ్యాపకులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ఆమె మృతి చెందినట్లు తెలిపారు. కన్న కొడుకు ముందే కుప్పకూలీ మృతి చెందడంతో కొడుకు శోకసముద్రంలో మునిగిపోయాడు.

## పంచాయతీ కార్యాలయానికి ఫర్నీచర్ వితరణ



**రఘునాథపాలెం, జూన్ 26 (జనంసాక్షి) :** మండల పరిధిలోని పాపటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి మాజీ సర్పంచ్ కూరాకుల నర్సయ్య తనయుడు గోపీ ఫర్నిచర్ వితరణ చేసాడు. కార్యదర్శి చెన్ను నాగరాజు విజ్ఞప్తి మేరకు పన్నెండు వేలు విలువ చేసే ఇరవై ఐదు కుర్చీలని గురువారం గ్రామపెద్దల సమక్షంలో అందచేశారు. కార్యాలయంలో మౌళిక సదుపాయల కల్పనకు సహకరిస్తామని పలువురు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు దుంపటి నగేష్, లచ్చయ్య, ఆరెంపుల వెంకటేశ్వర్లు, చావా రామయ్య, కొనకంచి రామ చంద్రయ్య,అప్పని శంకర్, వడ్లమూడి వెంకటయ్య, వుంయ్యూరు లక్ష్మయ్య,కొండపర్తి జగన్, చావా భద్రయ్య,చచ్చు లక్ష్మి నారాయణ పావురాల నర్సయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవితాన్ని చీకట్లో మగ్గించవద్దు.. మత్తుకు బానిసవ్వొద్దు

### లక్ష్యాన్ని ఉద్దేశించుకుని ముందుకు సాగాలి : కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ బ్యూరో, జూన్ 26 (జనంసాక్షి) :** మత్తు పదార్థాలకు బానిసలు మారి జీవితాన్ని చీకటి గదిలో ముగించవద్దని, యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య, ఇంజనీరింగ్ విద్య అభ్యసిస్తున్న కొంతమంది విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడడం బాధాకరమని అన్నారు. కష్టపడి చదివి, ఎంతోమందితో పోటీపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, మంచి భవిష్యత్తు ఉన్న అలాంటి విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడటం శోచనీయమని అన్నారు. జీవితంలో ఎన్నో సమస్యలు, ఒడిదుడుకులు వస్తాయని, ప్రతి సమస్యకు పరిష్కార మార్గం ఉంటుందని అన్నారు. డ్రగ్స్ బారిన పడటం వారి జీవితాన్ని మాత్రమే కాకుండా మొత్తం కుటుంబాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. ఒకసారి మత్తు బారిన పడినవారు బయటపడడం తేలికైన విషయం కాదని, జీవితాన్ని నాశనం చేసే వరకు వదలదని అన్నారు. చెడు వ్యసనాలను, చెడు మార్గాలు చూపే స్నేహితులను తక్షణమే వదిలేయాలని సూచించారు. మంచి స్నేహితులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ సంతోషాన్ని పొందాలని సూచించారు. ధ్యానం, యోగా వంటివి అలవర్చుకోవాలని అన్నారు.

పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ... మాదకద్రవ్యాల






నిరోధానికి డ్రగ్ డిటెక్షన్ కిట్లను ఉపయోగించి తనిఖీలు చేస్తున్నామని అన్నారు. డక్స్ తీసుకున్నట్టు తెలిస్తే చట్టప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, కళాశాల స్థాయిలో విద్యార్థులు ఎక్కువగా మత్తు పదార్థాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటైన వారిలో మనసు, శరీరం ఆజ్ఞలో ఉండవని అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని పిల్లలను కాలేజీలకు పంపిస్తున్నారని, వారి ఆశలు వమ్ము చేయవద్దని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలో విద్యార్థులు మత్తుకు బానిస అవడం దారుణమైన విషయమని అన్నారు. డ్రగ్స్ అనర్థాలపై డి. ఎల్. ఎస్. ఏ ఆధ్వర్యంలో ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ ఇండియాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... డ్రగ్స్ మాఫియాను ఉక్కు పాదంతో అణిచి వేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నివారణకు అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనంతరం డ్రగ్స్ నిరోధానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ నిరోధంపై నిర్వహించిన పెయింటింగ్స్ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. డ్రగ్స్ నిర్మూలన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సి.డబ్ల్యూసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, ఎన్. వై. కే కోఆర్డినేటర్ రాంబాబు, వైస్ ప్రిన్సిపల్ చేతన్ శర్మ, నషా ముక్త్ భారత్ కమిటీ మెంబర్ కేశవరెడ్డి, సూపరింటెండెంట్ వీరారెడ్డి పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, జూన్ 26 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. గురువారం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా,జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గద్వాల కృష్ణవేణి చౌరస్తా నుండి మాదకద్రవ్య రహిత జిల్లా లక్ష్యంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ప్రారంభించారు. డ్రగ్స్ అవగాహన ర్యాలీని పాత బస్టాండ్ వరకు నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ సమాజంపై మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులు గుర్తించి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. మత్తుపదార్థాలు అమ్మే వారి గురించి సమాచారం అందించడం పౌరుల బాధ్యతగా పేర్కొన్నారు. డ్రగ్స్ బారిన పడిన యువతకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. 17-18 ఏళ్లలోపు యువత డ్రగ్స్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్నందున, ఈ దశలో వారికి సరైన మార్గదర్శకం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యా ర్థులు చదువుపై దృష్టి పెట్టి, శారీరకంగా-మానసికంగా బలంగా ఉండాలని సూచించారు.మత్తు పానీయాలు, సిగరెట్లు,గుట్కాలు, గంజాయి వంటివి యువత ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయని అన్నారు.డ్రగ్స్ నిర్మూలనకు యువత ముందుకు వచ్చి సమాజానికి తోడ్పడాలని అన్నారు.జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా కఠినమైన చర్యలు తీసుకుం టోందని తెలిపారు.జిల్లా స్థాయిలో కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, అందువల్ల అందరూ బాధ్యతతో ముందుకి వచ్చి, ప్రజలకు ప్రాణాంతకంగా పరిణమించే మాదకద్ర వ్యాల నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సునంద, డి.యం.హెచ్.ఓ సిద్ధప్ప, డి.ఎస్.పి. మొగులయ్య, ఎక్సైజ్, పోలీస్, జిల్లా సంక్షేమ శాఖ, వివిధ శాఖల అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, యువత, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





## కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనం త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కౌడిపల్లి జూన్ 26,(జనంసాక్షి):** కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో మిగిలి ఉన్న మైనర్ వర్క్స్ త్వరితగతిన పూర్తి చేసి ఉపయోగం లోకి తీసుకురావాలని సూచించారు.గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. పీహెచ్ సీ లోని హాజరు పట్టికను తెప్పించుకుని పరిశీలించారు. ప్రతి రోజు ఇన్ పేషెంట్లు అవుట్ పేషెంట్లు ఎంత మంది వస్తున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేదా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. నిరంతరం వైద్యసేవలు అందుతున్నాయని రోగులు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని పరిశీలించి ఎలక్ట్రిసిటీ, టైల్స్, డోర్స్, విండోస్, మైనర్ వర్క్స్, త్వరిత గతిన పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎంపీడీవో, శ్రీనివాస్ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హైడ్రా పేరుతో బెదిరింపులు

- ఇద్దరిపై కేసు నమోదు




**హైదరాబాద్, జూన్ 25 (జనంసాక్షి):** హైడ్రా పేరు చెప్పిబెదిరించిన ఇరువురిపై గచ్చిబౌలి పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. మిరియాల వేదాంతం, యెలిసెట్టి శోభన్ బాబు గండిపేట మండలం, నెక్నాంపూర్ విలేజ్‌లోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఓ ఇంటికి వెళ్లి బెదిరించినట్టు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. ఈ నెల 23న మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. నలుపు రంగు కారులో వచ్చిన ఈ ఇద్దరు ఇంటి ఆవరణలోకి వచ్చి పరిశీలిస్తుండగా.. ఎవరని అడిగితే తాము హైడ్రా నుంచి వచ్చామని బదులిచ్చారని ఆ ఇంటి వద్ద పని చేస్తున్న గుంతకల్ మల్లికార్జున్ తెలిపారు. ఎందుకు వచ్చారని అడిగితే ఈ ఇంటిని కూల్చేస్తామని.. ఇందుకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నామని చెప్పారన్నారు. ఇంటి యజమానితో మాట్లాడాలని సూచించగా.. చల్లగా జారకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మల్లికార్జున్ పేర్కొన్నారు. నిందితులు మిరియాల వేదాంతం(22) కారు డ్రైవర్ కాగా.. కరీంనగర్ జిల్లాకు చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. అల్కాపురి టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నాడు. మరో వ్యక్తి యెలిసెట్టి శోభన్‌బాబు ఆర్టీసీలో పని చేసి రిటైర్ అయ్యారు. ఈయన మణికొండలోని పుప్పాలగూడ, ఎస్టీమ్ రెసిడెన్సీలో నివాసం ఉంటున్నాడు. ఆ ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**హైడ్రా పేరుతో బెదిరిస్తే జైలు శిక్ష ఖాయం**

హైడ్రా పేరు చెప్పి ఎవరైనా మోసాలకు, బెదిరింపులకు పాల్పడితే వెంటనే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైడ్రా గురువారం ఒక ప్రకటనలో కోరింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని.. నేరుగా తమకు ఆ సమాచారం ఇచ్చినా వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపింది. హైడ్రా ఉద్యోగులు విచారణ చేపడితే.. పూర్తి వివరాలు అందజేస్తారని.. ఒక వేళ హైడ్రా ఉద్యోగులు కూడా మోసాలకు పాల్పడి.. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తే వారిపైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా స్పష్టం చేసింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే.. 8712406899 నంబరుకు ఫోను చేసి సమాచారాన్ని వాట్సాప్‌లో అందజేయడంతో పాటు.. వారి ఫొటోలు కూడా పంపించాలని కోరింది.

## ట్యాంక్ బండ్ వద్ద ప్రజలకు వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో జూన్26 (జనంసాక్షి):** వనపర్తి పట్టణంలోని నల్ల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద ప్రజలు ఆహ్లాదం పొందేందుకు మరిన్ని వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.గురువారం ఉదయం కలెక్టర్ నల్ల చెరువు మినీ ట్యాంక్ బండ్ ను సందర్శించారు. పట్టణ ప్రజలు ఉదయం సాయంత్రం నడక తో పాటు కుటుంబంతో ఆహ్లాదంగా గడిపేందుకు మినీ ట్యాంక్ బండ్ వద్ద మరిన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమి షనర్ ను ఆదేశించారు. ఇప్పటికే మంజూరు చేసిన పనులను చాలా ఆలస్యంగా పూర్తి చేస్తున్నా రని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ డి.ఈ కి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, స్థానిక తహసీల్దార్ రమేష్ రెడ్డి కలెక్టర్ వెంట ఉన్నారు.

## జిల్లాలో 84.33 శాతం బియ్యం పంపిణీ పూర్తి

- జిల్లాలో 520 రేషన్ షాప్‌లో బియ్యం పంపిణీ కొనసాగుతోంది
- జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్



**మెదక్, జూన్ 26 (జనంసాక్షి):** జిల్లాలో ఇప్పటివరకు 84.33 శాతం బియ్యం పంపిణీ పూర్తయి నట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ గడువును 30.06.2025 తేదీ వరకు పొడగించారు. జిల్లాలో 520 రేషన్ షాప్ లో బియ్యం పంపిణీ కొనసాగుతోంది కావున ప్రతి రేషన్ కార్డు దారుడు సంబందిత రేషన్ షాప్ నందు తప్పనిసరిగా తమ బయోమెట్రిక్ వేసి సన్న బియ్యం తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం పంపిణీ గడువు ముగిసేలోపు మీరు మీ పక్కనున్న రేషన్ దుకాణానికి వెళ్లి మూడు నెలల బియ్యం తీసుకోవాలి. అదే విధంగా సన్న బియ్యం పంపిణీ తేది పొడగించబడదు అని వివరించారు.

### యువత స్వయం ఉపాధితో

## ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి



**మొయినాబాద్ జూన్ 26 (జనంసాక్షి):** ఎవరో ఏదో చేస్తారని ఆశపడి ఉండకుండా నిరుద్యోగంగా ఉన్న యువతీ యువకులు స్వయం ఉపాధిని ఎంచుకొని కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎండి అమ్జద్ సోదరులు హాజీ, అఫీద్, తాజ్, అహ్మద్, అస్రఫ్, సమ్మద్ కలిసి స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా కొంపల్లి అనంతరెడ్డి పాల్గొని ఆటోమొబైల్స్ షాపును ప్రారంభించి మాట్లాడుతూ యువతీ యువకులు ఉద్యోగాలు రాలేవని నిరాశ చెందకుండా ఆర్థిక అభివృద్ధి కోసం స్వయం ఉపాధిని స్వతహాగా ఏర్పాటు చేసుకొని కుటుంబ పోషణతో పాటు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆటోమొబైల్స్ షాపు వాహనాదారులకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో హరిశంకర్, నాయకులు పాల్గొన్నారు.

### ఎర్రగుట్ట డబుల్ బెడ్ రూం ఇళ్లలో

# అక్రమంగా ఉన్న వారు వెంటనే ఖాళీ చేయాలి

- జడ్చర్లలో కొత్తగా 1000 ఇళ్ల నిర్మాణానికి చర్యలు
- అర్హులైన పట్టణ పేదలను గుర్తించి వారికే కేటాయించండి
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, జూన్ 26 (జనంసాక్షి):** జడ్చర్ల పట్టణంలో ఎర్రగుట్ట వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లలో ఎలాంటి కేటాయింపులు లేకుండా అక్రమంగా ఉంటున్న వారందరూ వెంటనే ఖాళీ చేయాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి తెలిపారు. వాటన్నింటినీ అర్హులైన వారికి అధికారికంగా కేటాయించడానికి చర్యలు తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ నేతలకు లక్షల రుపాయలు ఇచ్చి ఈ ఇళ్లను అక్రమంగా కొనుగోలు చేసిన వారు తాము డబ్బు ఇచ్చిన వారి గల్లా పట్టుకొని వాటిని తిరిగి వసూలు చేసుకోవాలని, వారు డబ్బు వెనక్కి ఇవ్వకపోతే పోలీస్ స్టేషన్ లో కేసులు పెట్టాలని ఆయన సూచించారు. జడ్చర్ల పట్టణంలోని ఎర్రగుట్ట ప్రాంతంలో రెండు ఫేజ్ లుగా మొత్తం 560 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించగా అధికారికంగా వాటిని అర్హులైన వారికి కేటాయించకుండా ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నేతలు ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు చొప్పున అక్రమంగా వసూలు చేసి, అనర్హులను ఆ ఇళ్లలోకి పంపించారని గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. ఈ కారణంగానే జడ్చర్ల పట్టణంలో అర్హులైన పేదలు ఎంతో మంది ఉండగా వారికి కాకుండా ధనవంతులకు, ఇతర ప్రాంతాల వారికి ఎర్రగుట్ట డబుల్ బెడ్రూం ఇండ్లను బీఆర్ఎస్ నేతలు అప్పగించారని చెప్పారు.

ప్రస్తుతం పట్టణంలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్న నేపథ్యంలో ఈ డబుల్ బెడ్రూంల అవినీతి వ్యవహారం బయటకు వస్తోందని చెప్పా రు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినా కట్టుకోవడానికి స్థలం లేక రోడ్ల పక్కన గుడిసెలు వేసుకొని బతికే పేదలు అనేక మంది ఉన్నార నన్నారు. ఇది కాకుండా ఎర్రగుట్టలో డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టడానికి తమ సొంత ప్లాట్లు కోల్పోయిన పేదలు కూడా 60 మందికి పైగా ఉన్నారని తెలిపారు. ప్లాట్లు కోల్పోయిన వారికి కూడా బీఆర్ఎస్ నేతల అవినీతి కారణంగా డబుల్ బెడ్రూం ఇళ్లు దక్కలేదని, ఈ అక్ర మాలను సరిదిద్దడం కోసం అధికారులు ఎర్రగుట్ట డబుల్ బెడ్రూ ంలలో ప్రస్తుతం ఉంటున్న వారందరినీ ఖాళీ చేయించి, అర్హులైన స్థానిక పేద కుటుంబాలకు వాటిని కేటాయించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ప్లాట్లు పోగొట్టుకున్న వారికి ఈ కేటాయింపుల్లో ప్రాధా న్యత ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో రెవెన్యూ, మున్సి పాలిటీ, హౌసింగ్, పోలీసు అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి ఆ ఇళ్లు ఖాళీ చేయించాలని సూచించారు. ఈ విషయాన్ని తాను జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్తానని పేర్కొన్నారు. బీ ఆర్ఎస్ పార్టీ నేతలకు లక్షల రుపాయలు చెల్లించి ఎర్రగుట్ట డబుల్ బెడ్రూం ఇళ్లలో కి చేరిన వారు ఆ ఇళ్లు ఖాళీ చేసి తమ డబ్బులను బీఆర్ఎస్ నేతల గల్లా పట్టి వసూలు చేసుకోవాలని, డబ్బులు వెనక్కి ఇవ్వకపోతే పోలీస్ కేసులు పెట్టాలని అనిరుధ్ రెడ్డి హితవు చెప్పారు.

**కొత్తగా 1000 డబుల్ బెడ్రూం ఇళ్లు:**
జడ్చర్ల పట్టణంలో ఇళ్లు కట్టుకోవడానికి ఇళ్ల స్థలాలు లేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించడానికి చర్యలు తీసుకుంటున్నామని, పట్టణంలో కొత్తగా దాదాపు 1000 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిం చడానికి అవకాశం ఉందని త్వరలోనే దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించారు. దీనితో పాటుగా పట్టణంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించడానికి కూడా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

## రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం వేరున ఘరానా మోసం

- సైబర్ క్రైమ్ నేరస్తుడిని అరెస్ట్ చేసిన పోలీసులు




**చేర్యాల జూన్ 26 (జనంసాక్షి):** తెలంగాణ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం వేరున ఘరానా మోసం చేసి ఓ వ్యక్తి డబ్బులు వసూలు చేసిన సంఘటన చేర్యాల మండలంలో వెలుగులోకి వచ్చింది. గురువారం చేర్యాల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా చేర్యాల సిఐఎల్ శ్రీను, ఎస్సై నీరేష్ మాట్లాడారు. పోలీసుల వివరాల ప్రకారం.. తెలంగాణ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం అనే వాట్సాప్ గ్రూపును నాగర్ కర్నూల్ జిల్లా ఉరుగొండ మండలానికి చెందిన పిల్లెల శ్రీకాంత్ అనే వ్యక్తి ఓపెన్ చేసి దాని ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారులను అందులో చేరేటట్టుగా చేసి తర్వాత జాతీయ రియల్ ఎస్టేట్ సంఘంలోన్ ఇస్తారని అందులో చేరడానికి సభ్యత్వ రుసుము కింద 25 వేలు చెల్లించాలని, తెలంగాణ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం గ్రూపులో నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన పిల్లెల శ్రీకాంత్ పెట్టగా ఇది నిజమేనని నమ్మి సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు లోన్ కావాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం అనే వాట్సాప్ గ్రూప్లో అడగగా వెంటనే పిల్లెల శ్రీకాంత్ అతనికి ఫోన్ చేసి సభ్యత్వ రుసుము కింద 25000 పంపమనగా అట్టి వ్యక్తి నిజమేనని నమ్మి అతనికి గూగుల్ పే ద్వారా రెండు విడతలుగా మొత్తం 25 వేల రూపాయలు పంపించాడు. తర్వాత అతను ఫోన్ ఎత్తకపోయేసరికి మోసపోయానని తెలిసి పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా ఇట్టి విషయంపై సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసి, పరిశోధన చేపట్టి నిందితున్ని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

## జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో పంచాయతీ ఉద్యోగులు



**కొల్చారం, జూన్ 26 (జనంసాక్షి):** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కొల్చారం మండల అధ్యక్షులు మల్లేశం జూలై 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులందరూ పాల్గొంటారని మండల కార్యాలయంలో రాకేష్ కు గురువారం సమ్మె నోటీసు అందజేశారు . కార్మికులు 100 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను నేటి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 4 లేబర్ కోర్టులను తెచ్చారన్నారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు అందరూ తప్పకుండా రావాలని మల్లేశం అన్నారు. ఈ కార్యక్రమంలో షేకర్,మణెమ్మ,రాజు ,లక్ష్మణ్ పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతీకి నిదర్శనం బోనాలు

- తొలి బోనమెత్తిన మంత్రి కొండా సురేఖ
- హైదరాబాదులో ప్రారంభమైన ఆషాఢమాస బోనాలు





**హైదరాబాద్, జూన్ 26 (జనంసాక్షి):** అమ్మకు బోనం... తల్లికి బోనం అంటూ ఆషాఢమాస బోనాలు షురూ అయ్యాయి. బోనాల సంబరాలు అంబరాన్ని అంటాయి. తొలి బోనాన్ని, పట్టు వస్త్రాలను అమ్మకు తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అందజేశారు. పోతురాజుల విన్యాసాలు అబ్బురపరిచాయి. భక్తి శ్రద్ధలతో వేల సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... ఆషాఢ బోనాలు సంస్కృతీ, సాంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు. జగదాంబ అమ్మవారి ఆశీర్వాదాలు తెలంగాణ ప్రజలపై, రాష్ట్ర ప్రభుత్వంపై ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు. జగదాంబ మహంకాళి గోల్కొండ బోనాల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర సభాపతి ప్రసాద్ కుమార్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్య సభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ లతో కలసి పాల్గొన్నారు. కొన్ని వందల సంవత్సరాల నుండి జంట నగరాల్లో వైభవోపేతంగా బోనాల సాంప్రదాయం కొనసాగుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హైదరాబాద్ జంట నగరాల్లో నిర్వహించే బోనాల నిర్వహణకు రూ. 20 కోట్ల రూపాయలు కేటాయించి, ముందుగానే అందజేశారని వివరించారు. గోల్కొండ బోనాలకు ఎంతో ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఉందన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి బోనాల పం దుగ ప్రాముఖ్యత పట్ల హైదరాబాద్ మహానగరానికి ప్రజలు, భక్తులు తరలివస్తున్నారన్నారు. అమ్మవారికి తొలి బోనం సమర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అలాగే ప్రభుత్వం ఈ బోనాల నిర్వహణకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అమ్మవారికి సమర్పించే బోనాలలో భక్తులకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులు ఆదేశించినట్టు చెప్పారు. నెలరోజుల పాటు బోనాల నిర్వహణ కార్యక్రమం నిర్వహణ సందర్భంగా ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాటు చేశామన్నారు. ఈ బోనాల కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామాయ్యర్, కమిషనర్ వెంకటరావు, హైదరాబాద్ సీపీ ఆనంద్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు హనుమంతరావు, ఆలయ కమిటీ చైర్మన్ చిట్టిబాబు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### రైతులకు పంట రుణాలను

# లక్ష్యం మేరకు విరివిగా అందజేయాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్




**గద్వాల నడిగడ్డ, జూన్ 26 (జనంసాక్షి):** ప్రాధాన్యత రంగాలకు, రైతులకు పంట రుణాలను లక్ష్యం మేరకు విరివిగా అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ బ్యాంకర్లను ఆదేశించారు. గురు వారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు డిసిసి, డిఎల్ఆర్సి జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు పంట అనుబంధ రుణాలు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న,మధ్య తరహా, విద్యా,గృహ రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రుణాలను అర్హులైన పేద ప్రజలకు మంజూరు చేయాలని సూచించారు. ముఖ్యంగా పంట రుణాలు,వ్యవసాయ మౌలిక వసతుల రుణాల మంజూరులో వేగం పెంచాలని అన్నారు. వ్యవసాయానికి ఉపయోగ కరమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గోదాములు,కోల్డ్ స్టోరేజీలకు అవసరమైన రుణాలను విరివిగా అందించాలని బ్యాంకర్లకు సూచించారు.రైతులకు వివిధ రుణాల పట్ల అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామాలలో గల రైతు వేదికలలో బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు అవసరమైన రుణాలను అందించాలని, ఇందులో భాగంగా జులై మొదటి వారంలో కలెక్టర్ కార్యాలయంలో రైతులకు బ్యాంకు రుణాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహిం చాలని అధికారులకు సూచించారు. ప్రధాన మంత్రి చిన్న తరహా ఆహార శుద్ధి పథకం కింద జిల్లాలో మంజూ రైన 18 యూనిట్లకు 35 శాతం చొప్పున చొప్పున రూ. 27.60 లక్షల సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని బ్యాంకర్లకు సూచించారు. చిన్న చిన్న వ్యాపార యూనిట్లకు వచ్చిన అప్లికేషన్లు పూర్తిగా పరిశీలించి వాటిని వేగవం తంగా పరిష్కరించాలన్నారు.విద్యా,గృహ రుణాల మంజూరులో కూడా గణనీయమైన పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి బ్యాంకులో అన్ని రంగాలకు కలిపి 75 శాతం పైగా రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భ ంగా జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.6472.29 కోట్లుగా కలెక్టర్ ప్రకటించి ఆవిష్కరించారు.గత ఏడాది కంటే రూ.1221.21 కోట్లను ఎక్కు వగా లక్ష్యం కేటాయిం చినట్లు ఆయన తెలిపారు. వార్షిక క్రెడిట్ ప్లాన్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ రూ.4945.14 కోట్లు, మధ్య,చిన్నతరహా పరిశ్రమలకు రూ.606 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.192. 84 కోట్లు, విద్య రుణాలు రూ. 16.80 కోట్లు,గృహ రుణాలు రూ. 124.22 కోట్లు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు,ఎల్‌డిఎం శ్రీనివాసు లు, నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి, ఆర్.బి.ఐ.ఏటీఎం చేతన్, జి.యం ఇండస్ట్రీస్ రామలింగేశ్వర్ గౌడ్, వివిధ శాఖల సంబంధిత అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27 జూన్ 2025

# విభజన చట్టం మేరకు పెరగని అసెంబ్లీ సీట్లు

**పదేళ్లయినా నేటికీ అమలు కాని నిర్ణయం**

**జనాభా లెక్కల తరవాతే డీలిమిటేషన్ ఛాన్స్**



**న్యూఢిల్లీ, జూన్26 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. ఈ మేరకు అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం హామీ కూడా ఇచ్చింది. అయితే విభజన హామీలన్నీ గాలికి పోయాయి. ఈ క్రమంలో ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. దీనిపైనా చంద్రబాబు ఒత్తిడి చేసే అవకాశం లేకపోలేదు. అయితే జనాభా గణన జరిగే వరకు వేచి చూస్తారని అంటున్నారు. జనభా లెక్కలు తేలాక ఎలాంటూ డీ లిమిటేషన్ జరగవచ్చని అంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. నియోజక వర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు తీసుకుంటే మంచిది. అయితే జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతు న్నాయి. 1973లో వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తి ప్రకారం సీట్లను కేటాయించారో ఆ విధంగానే ఇప్పుడు కూడా అలాంటి నియమాలు, నిబంధనలను పాటించాలని కోరుకుంటున్నాయి. ఒకవేళ లోక్‌సభ సీట్లు పెంచాల్సివచ్చినా అదే నిష్పత్తితో అన్ని రాష్ట్రాలకు సమంగా వర్తింప చేయాలని కూడా అంటున్నాయి. జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాలి. లోక్‌సభ, శాసనసభల సీట్లకు సంబంధించి గ్రామీణ, నగర ప్రాంతాలను దృష్టిలో పెట్టుకోవాలి. నియోజకవర్గాల పునర్విభజన జరిగి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాలని సూచిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే కేంద్రంలోని మోదీ సర్కార్ జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటే మంచిది. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్యానంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు. ఇప్పుడు జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యను కేటాయించాలని వారు వాదిస్తున్నారు.

# కాంగ్రెస్ మెడకు బీసీ రిజర్వేషన్ల ఉచ్చు

**అమలు చేయడం ఎలా అన్నదే ప్రధాన సమస్య**

**పార్టీపరంగా, ప్రభుత్వ పరంగా చర్చలు**

**హైదరాబాద్, జూన్26 (జనంసాక్షి) :** స్థానిక ఎన్నికలు మూడు నెలల్లోగా నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశించడంతో బిసి రిజర్వేషన్లు లేకుండా ముందుకు వెళ్లడం కుదరని పనిగా కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లపై విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కుటగణన చేశామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వానికి అమలు పెద్ద సవాల్ కానుంది. కేంద్రం అమలు చేయకుండా బిల్లుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పార్టీపరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లడంపై రాష్ట్ర ప్రభుత్వం ఆశలు పెట్టుకున్నది. దీనిని మిగతా పార్టీలు ఎలా స్పందిస్తాయన్నది కూడా ముఖ్యమే. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో చర్చలు జరుపుతున్నారని సమచారం. కు ఈ మేరకు కాగ్రెస్ శ్రేణులు కూడా సంకేతాలిచ్చారు. మరోవైపు హైకోర్టు తీర్పును స్వాగతిస్తూ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంపై త్వరలోనే పీసీసీ స్థాయిలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రిజర్వేషన్ల ఖరారుకు హైకోర్టును సర్కారు నెల రోజులు, ఆ తర్వాత ఎన్నికల నిర్వహణకు ఈసీ రెండు నెలల సమయం అడిగాయి. దీనిని దృష్టిలో ఉంచుకొనే స్థానిక ఎన్నికల నిర్వహణకు హైకోర్టు 3 నెలల గడువును నిర్దేశించింది. ఇచ్చిన మాట ప్రకారం నెల రోజుల్లో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ బీసీ బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయం రాకున్నా.. నేరుగా రిజర్వేషన్లు ప్రకటిస్తే కోర్టులు అడ్డుకున్నా.. నెలరోజుల గడువు మించిపోయే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి చేయడం, కాదనుకుంటే నేరుగా కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అధికార పార్టీ భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. 22 నుంచి 23 శాతం చట్టపరంగా, మరో 20 శాతం పార్టీపరంగా జనరల్ స్థానాల్లో బీసీలకు సీట్లు కేటాయించాలని భావిస్తున్నట్లు సాచారం. 42 శాతం స్థానాలను బీసీలకు కేటాయిస్తే అనివార్యంగా మిగిలిన పార్టీలు కూడా బీసీలకు అదేస్థాయిలో రిజర్వేషన్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా తాము అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని, తర్వాత కేంద్రంపై ఒత్తిడి కొనసాగించవచ్చనేది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనగా కనిపిస్తున్నది. అయితే ఇది ఎలా సాధ్యమన్నది కూడా ప్రశ్నే. పార్టీ కూడా దీనిపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.



# అర్బన్ ఫారెస్టుల అభివృద్ధికి కృషి

**పచ్చదనం కోసం ప్రత్యేక కార్యాచరణ**

**హైదరాబాద్, జూన్26 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న అర్బన్ ఫారెస్ట్ బ్లాక్‌లను అభివృద్ధి చేస్తున్నారు. పచ్చదనంలో భాగంగా పార్కులకు మహర్దశ కలుగనుంది. హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ పార్కులు గా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. నగరం చుట్టూ వివిధ ప్రాంతాల్లో 189 అర్బన్ ఫారెస్ట్ బ్లాక్ లు ఉండగా, 45 బ్లాక్ లను పార్కులుగా అభివృద్ధి చేస్తున్నామని, వీటిలో 17 పార్కులు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. దశల వారీగా వీటిని అభివృద్ధి చేస్తామంటున్నారు. అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేయడం వల్ల ప్రజలకు విహార కేంద్రాలుగా ఉపయోగపడతాయని, ఫ్యామిలీతో వెళ్లి గడపడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే నగరంలో పచ్చదనం పెంచడంపై హెచ్‌ఎండీఏ దృష్టి పెట్టింది. ఔటర్ రింగ్‌రోడ్, నేషనల్ హైవేస్, ట్రిపుల్‌ఆర్‌వరకు ఆయా ప్రాంతాల్లో పచ్చదనాన్ని విస్తరించేందుకు ప్రణాలిక సిద్ధం చేసింది. త్వరలో నిర్వహించనున్న వనమహోత్సవంలో భాగంగా 4.5 కోట్ల మొక్కలు నాటాలని అర్బన్ ఫారెస్ట్రీ ఆఫీసర్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతేడాది వనమహోత్సవం కింద 6.8 కోట్ల మొక్కలు నాటామని, ఇది మంచి ఫలితాలు ఇవ్వడంతో ఈసారి 4.5 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించి నట్టు చెబుతున్నారు. వన మహో త్సవం కోసం 42 హెచ్‌ఎండీఏ నర్సరీల్లో వివిధ రకాలకు చెందిన 5 కోట్ల మొక్కలు పెంచుతున్నట్టు తెలిపారు. మొక్కలు నాటడంతోపాటు పంపిణీ కార్యక్రమాల్లో బల్దియా, టీజీఐఐసీ, ఎఫ్డీసీ, మెట్రో రైల్ వంటి సంస్థలను భాగస్వామ్యం చేయనుంది. వన మహోత్సవం కోసం కోర్ అర్బన్ ఏరియాలతో పాటు హైదరాబాద్ చుట్టుపక్కల ప్రతి సంవత్సరం 5 నుంచి 6 కోట్ల మొక్కలను పెంచుతున్నట్టు హెచ్‌ఎం డీఏ అర్బన్ ఫారెస్ట్రీ అధికారులు స్పష్టం చేశారు. ఇందులో స్థానిక జాతులతో పాటు, వివిధ రకాల పూలు, అటవీ మొక్కలు, పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు ఉన్నాయంటున్నారు.

# జీరో గ్రావిటీకి అలవాటు పడుతున్నా..

**అంతరిక్షం నుంచి శుభాన్షు శుక్లా సందేశం**



**న్యూఢిల్లీ, జూన్ 26 (జనంసాక్షి) :** భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా రోదసి ప్రయాణం విజయవంతంగా ప్రారంభమైంది. ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు ప్రయోగించిన స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ నిప్పులు చిమ్ముతూ విజయవంతంగా రోదసిలోకి దూసుకెళ్లింది. ఈ సందర్భంగా అంతరిక్షం నుంచి శుభాన్షు ఓ సందేశం పంపారు. ఈ ప్రయాణంలో ప్రతిక్షణాన్ని ఆస్వాదిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తాను జీరో గ్రావిరిటీకి అలవాటు పడుతున్నట్లు చెప్పారు. 'అందరికీ నమస్కారం.. తోటి వ్యోమగాములతో ఇక్కడ ఉండటం చాలా సంతోషంగా ఉంది. వావ్.. ఇది ఎంత అద్భుతమైన ప్రయాణం. ఈ ప్రయాణంలో ప్రతిక్షణాన్ని నిజంగా ఆస్వాదిస్తున్నాను. ఇప్పుడిప్పుడే నడవడం నేర్చుకునే చిన్నారిలా.. జీరో గ్రావిటీకి అలవాటు పడుతున్నాను. ఎలా కదలాలో, నన్ను నేను ఎలా నియంత్రించుకోవా, ఎలా తినాలో తెలుసుకుంటున్నా' అంటూ శుభాన్షు ఈ ప్రయాణంలో తన అనుభవాలను సందేశం ద్వారా పంచుకున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వ్యోమగాములను పంపించి అక్కడ పలు ప్రయోగాలు చేయించడానికి అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్'.. నాసా, స్పేస్‌ఎక్స్, ఇస్రో, ఐరోపా అంతరిక్ష సంస్థ ఈఎస్‌ఏ భాగస్వామ్యంతో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. దీర్ఘకాలంపాటు చేపట్టే రోదసి యాత్రల్లో వ్యోమగాముల శారీరక మార్పులపై ప్రధానంగా ఈ మిషన్‌లో రిసెర్చ్ చేయనున్నారు. రోదసి యాత్రల సమయంలో కండరాలు, గుండె, రక్తనాళాలు, రోగనిరోధక వ్యవస్థపై కలిగే ప్రభావం.. ఇలా 60కి పైగా శాస్త్రీయ ప్రయోగాలను చేయనున్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ఈ ప్రయోగానికి భారత వ్యోమగామి శుభాన్షు పైలట్‌గా వ్యవహరిస్తున్నారు. 1984లో సోవియట్ యూనియన్‌కు చెందిన ఇంటర్‌కాస్మోస్ మిషన్ కింద సూయజ్ టీ-11 వ్యోమనౌకలో భారత వ్యోమగామి రాకేశ్‌శర్మ తొలిసారిగా అంతరిక్షంలోకి వెళ్లి ఎనిమిది రోజులపాటు ఉండి తిరిగి వచ్చారు. తాజా ప్రయోగంతో 41 ఏండ్ల తర్వాత రోదసిలోకి వెళ్తున్న రెండో భారతీయుడిగా శుభాన్షు రికార్డు సృష్టిస్తున్నారు. ఐఎస్‌ఎస్‌లోకి వెళు_న్న తొలి భారతీయుడు కూడా ఇతనే. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టి శుభాన్షు శుక్లా చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా ఆయన ఘటన సాధించారు. ఆక్సియం-4 ఐఎస్ఎస్‌తో డాక్ అయింది. దాదాపు నెల రోజుల ఆలస్యం, అనేక వాయిదాల తర్వాత జూన్ 25న స్పేస్ఎక్స్ డ్రాగన్ ఫ్లైట్ ఆక్సియం-4 విజయవంతంగా అంతరిక్షంలోకి బయలుదేరింది. ఇలా ఐఎస్ఎస్ చేరుకున్న మొదటి భారతీయుడి రికార్డు కూడా శుభాన్షు శుక్లా ఖాతాలో చేరింది. 28 గంటలు ప్రయాణించిన డ్రాగన్ అంతరిక్ష నౌక ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్(ఐఎస్ఎస్)ను చేరుకుంది. భూమికి 418 కిలోమీటర్ల ఎత్తులో ఎగురుతూ, గంటకు 17,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఐఎస్ఎస్ ని చేరుకోవడానికి అంతరిక్ష నౌక అనేక విన్యాసాలు చేయాల్సి వచ్చింది. ఆక్సియం-4 బృందం ఐఎస్ఎస్‌లో దాదాపు 14 రోజులు ఉంటారు. అక్కడ ఉన్న సిబ్బందితో కలిసి పనిచేస్తారు. 60 కంటే ఎక్కువ సైన్స్ ఎక్సపరిమెంట్స్ నిర్వహిస్తారు. క్యాన్సర్ పరిశోధన, డీఎన్ఏ రిపేర్ వంటివి ఇందులో భాగంగా ఉన్నాయి. భారత్ నుంచి శుభాన్షుతో పాటు పోలాండ్‌కు చెందిన స్లావోజ్ ఉజ్నాన్స్కీ-విస్నియెవ్స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కాపు అమెరికాకు చెందిన కమాండర్ పెగ్గీ విట్సన్ ఈ వ్యోమనౌక ద్వారా ఐఎస్ఎస్ చేరుకున్నారు. మిషన్ పైలట్ అయిన శుక్లా, అంతరిక్షంలోక వెళ్లిన రెండో భారతీయుడిగా హిస్టరీ క్రియేట్ చేశారు. అంతకుముందు 1984లో వింగ్ కమాండర్ రాకేశ్ శర్మ తొలిసారిగా అంతరిక్షంలోకి వెళ్లారు. దాదాపుగా 4 దశాబ్దాల తర్వాత మరో భారతీయులు స్పేస్‌లోకి ప్రవేశించారు.



# నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ సాగర్ మాల

**కేంద్ర షిప్పింగ్ శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రారంభం**

**న్యూఢిల్లీ, జూన్ 26 (జనంసాక్షి) :** భారతదేశపు మొట్టమొదటి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ సాగర్ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ గురువారం ప్రారంభించారు. ఇది సముద్ర రంగంలో భారతదేశపు మొట్టమొదటి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ. గతంలో సాగరమాల డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్‌గా ఉన్న ఈ సంస్థ ఇప్పుడు అమృత్ కాల్ విజన్ 2047కి అనుగుణంగా ముందుకు సాగుతోంది. ఇది దేశ సముద్ర మౌలిక సదుపాయాల కల్పన, వాటి అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తోంది. ఇదో మినీ రత్న కంపెనీ. కేటగిరీ-ఎలో ఉన్న ఈ సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజ్‌ను జూన్ 19న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఅధికారికంగా నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా గుర్తించింది. మన ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోన్న సముద్ర రంగాన్ని బలోపేతం చేయడానికి ఈ సంస్థ ఎంతగానో దోహదపడుతుంది. ఈ సంస్థ మేరీ టైం రంగంలో ఆర్థిక సహకారాన్ని అందిస్తుంది. ఓడరేవులు, స్టార్టప్‌లు, ఇతర సంస్థలను శక్తివంతం చేసేందుకు కూడా ఈ సంస్థ ఆర్థిక సహకారం అందిస్తుంది. సముద్ర రంగంలో ఆర్థిక ఇబ్బందుల్ని తొలగించడంతో పాటు, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి ఈఅఒ ఆర్థికంగా ఎంతో సపోర్ట్ ఇస్తుంది. ఈ కార్పొరేషన్ ద్వారా పోర్ట్ అథారిటీలు, షిప్పింగ్ కంపెనీలు, సీఓఇలు, స్టార్టప్‌లు, మేరీ టైం ఇన్సిట్యూషన్స్ వంటి విభిన్న శ్రేణి సంస్థలకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక నిధులు సమకూరుస్తుంది.

# డ్రగ్స్ వాడే వారిని కొట్టండి

**పోలీసులకు సమాచారం ఇవ్వండి**

**రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**




**నల్గొండ (జనంసాక్షి) :** డ్రగ్స్ వాడే వారిని కొట్టండని, పోలీసులకు సమాచారం ఇవ్వండని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవంలో భాగంగా నల్గొండ ఎన్జీ కళాశాల వద్ద జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ కోసం 11 రోజులు ఇక్కడే నిరాహార దీక్ష చేశానని తెలిపారు. కరోనా తర్వాత డ్రగ్స్ వాడకం మరింత పెరిగిందని, స్టూడెంట్స్ బానిసలుగా మారుతున్నారని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ ఉండరాదన్నారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ కట్టిస్తున్నామని, నల్గొండలో 34 కోట్లతో స్కిల్ సెంటర్ కట్టిస్తున్నామని తెలిపారు. త్వరలోనే సిఎం తో ప్రారంభిస్తామన్నారు. డ్రగ్స్ వాడే వారిని కొట్టండి..పోలీసులకు సమాచారం ఇవ్వండి అని తెలిపారు. విద్యార్థులకు ఇది లైఫ్ టర్నింగ్ టైం మాత్రమేనని, 20 ఏండ్ల వరకు చదువు,స్పోర్ట్స్,యోగ పై దృష్టిపెట్టాలని, హైద్రాబాద్ లో డ్రగ్స్ పై కఠిన చర్యలు తీసుకొంటున్నామని, ఎక్కడికక్కడే కట్టడి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు,యువత సెల్ ఫోన్ కు వీలైనంత దూరంగా ఉండాలని సూచించారు. అవసరమైతేనే వాడాలని, చదువుపైనే దృష్టి పెట్టాలని, చదివి పోటీ పరీక్షలు రాస్తూ ఉద్యోగాలు పొందాలని సూచించారు. ప్రకాశం బజార్ లో ప్రతీక్ ఫౌండేషన్ తో పాఠశాల నిర్మిస్తున్నామని తెలిపారు. డిజిటల్ తరగతుల తో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మీ భవిష్యత్ బాగుండాలంటే డ్రగ్స్ కు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, అడిషనల్ కలెక్టర్ జె .శ్రీనివాస్, అందరూ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆదనపు ఎస్పీ రమేష్, డి డబ్ల్యూఓ కృష్ణవేణి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి.డీఈవో తదితరులు పాల్గొన్నారు.

# తేజేశ్వర్ హత్యలో సంచలన విషయాలు

**కదలికలు కనిపెట్టేందుకు బైకుకు జిపిఎస్ అమరిక**

**వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నడానే హత్య**

**వివరాలు వెల్లడించిన గద్వాల ఎస్పీ**



**గద్వాల, జూన్26 (జనంసాక్షి) :** భార్య కామదాహానికి బలైన తేజేశ్వర్ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. తేజేశ్వర్ కదలికల కోసం బైకుకు జిపిఎస్ అమర్చినట్లుగా గుర్తించారు. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్‌ను ఆయన భార్య ఐశ్వర్య హత్య చేయించినట్లు జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గద్వాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన కీలక విషయాలను ఆయన వెల్లడించారు. వివాహమైన నెలకే ప్రియుడు, బ్యాంక్ మేనేజర్ తిరుమల్‌రావుతో కలిసి ఐశ్వర్య కుట్ర చేసినట్లు తెలిపారు. సుపారీ గ్యాంగ్ సాయంతో భర్తను చంపించినట్లు వివరించారు. 'ఈనెల 17న తేజేశ్వర్ అదృశ్యమయ్యాడు. ఈనెల 21న గాలేరు- నగరి కాల్వలో ఆయన మృతదేహం లభ్యమైంది. గతేడాది డిసెంబర్‌లో ఐశ్వర్య-తేజేశ్వర్‌కు నిశ్చితార్థం జరిగింది. అప్పటి నుంచే తేజేశ్వర్‌ను హతమార్చేందుకు తిరుమల్‌రావు, ఐశ్వర్య కుట్ర చేశారు. ఈ హత్యకు తిరుమల్‌రావు సుపారీ ఇచ్చారు. బ్యాంకులో రుణం కోసం తన వద్దకు వచ్చిన నగేశ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. తేజేశ్వర్ కదలికలు తెలుసుకునేందుకు అతడి బైక్‌కు జీపీఎస్ అమర్చారు. పొలం గురించి మాట్లాడదామని నిందితులు తేజేశ్వర్‌ను కారులో తీసుకెళ్లి వేటకొడవళ్లతో హతమార్చారు. మృతదేహాన్ని గాలేరు-నగరి కాలువలో పడేశారు. నిందితులు ఇటీవల మేఘాలయలో జరిగిన హనీమూన్ మర్డర్ కేసు గురించి చర్చించుకున్నారు. ఆ తరహాలో దొరక్కూడదని మాట్లాడుకున్నారు. ఐశ్వర్యను రెండో పెళ్లి చేసుకోవాలని తిరుమల్‌రావు ప్రణాళిక రచించాడు. హత్య తర్వాత తిరుమల్‌రావు, ఐశ్వర్య లద్దాఖ్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఐశ్వర్య తల్లితో తిరుమల్‌రావుకు వివాహేతర సంబంధం ఉంది. ఈ కేసులో ఇప్పటి వరకు 8 మంది నిందితులను అరెస్ట్ చేశామ ఎస్పీ తెలిపారు.

# ఆత్మహత్య కోసమే పట్టాలపైకి కారు

**హాట్‌టాపిక్‌గా యువతి వ్యవహారం**

**హైదరాబాద్, జూన్ 26 (జనంసాక్షి) :** శంకర్ పల్లి రైలు పట్టాలపై కారు తీసుకెళ్లిన లేడీ కేసులో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది.. ఆత్మహత్య చేసుకునేందుకు కారుతో సహా పట్టాల మీదకి వెళ్ళినట్లు పోలీసులు గుర్తించారు. గురువారం ఉదయం తాను ఉంటున్న ప్లాట్ నుంచి కార్ తో సహా బయటికి వచ్చింది సోనీ. తన దగ్గరున్న కుక్కను నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో వదిలి వెళ్ళిపోయింది. సూసైడ్ చేసుకోవడానికి కార్ తీసుకొని రైలు పట్టాలపైకి వచ్చింది. కుటుంబ కలహాలే దీనికి ప్రధాన కారణమని పోలీసుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆర్మీలో జాబ్ చేయాలని సోనీ ప్రయత్నం చేసింది.. కానీ తల్లిదండ్రులు ఒప్పుకోలేదు.. మరోవైపు తాను పనిచేస్తున్న సాఫ్ట్వేర్ కంపెనీ నుంచి ఉద్యోగం తొలగించారు. తల్లిదండ్రుల ఆర్మీ జాబు నిరాకరణ, ఉద్యోగం పోవడంతో మానసిక ఆందోళన చెందింది. కార్ తో సహా ట్రైన్ కు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకోవాలని ప్లాన్ చేసింది. అయితే ఇదంతా రీల్స్ కోసమని తొలుత భావించారు. వివరాల్లోకి వెళితే రైలు పట్టాలపై ఓ యువతి హల్‌చల్ చేసింది. ఆమె నిర్వాకంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. నాగులపల్లి-శంకర్‌పల్లి మార్గంలో పట్టాలపై సుమారు 7 కి.మీ మేర యువతి కారు నడిపింది. కారును అడ్డగించిన స్థానికులను ఆమె చాకుతో బెదిరించింది. అదే మార్గంలో వస్తున్న ఓ రైలు లోకో పైలట్ గమనించి ట్రైన్‌ను ఆపారు. స్థానికులు అతికష్టం మీద యువతిని పట్టుకున్నారు. యువతి చేసిన పనితో సుమారు 2 గంటల పాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం శంకర్‌పల్లి పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టాలపై కారు నడిపిన యువతిని లక్నోకి చెందిన రవికా సోనీగా గుర్తించారు. రీల్స్ కోసమే ఈ నిర్వాకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆమె హైదరాబాద్‌లోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించినట్లు సమాచారం. ఇటీవల రవికా సోనీని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ క్రమంలో ఆమె మతిస్థిమితం కోల్పోయిందా? డ్రగ్స్ తీసుకుందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం యువతిని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370